జీవనము - వెలుతురు - పరిశుభ్రత.

పాఠశాలలకు ఉపయోగించునట్లు ఆరోగ్యమునుగురించి
వ్రాసిన ప్రథమ బోధిని.

ంచాలరాష్ట్రమునందు విద్యాశాలకు అధికారులగు శ్రీ డైరక్టరువారి
అధికారముక్రింద ప్రచురింపబడినది.

మదరాసు:

గవర్నమెంటు ప్రెస్సుయొక్క సూపరింటెండెంటువారివలన
ముద్రింపబడెను.

1912.

II

TPLA109B118

విషయసూచిక.

1 వ ప్రకరణము.

పుట.

వ్యాధినుండి తప్పించుకొనుటకు తగిన జ్ఞానమును సంపాదించు శక్తిని సర్వేశ్వరుడు మానవుల కిచ్చియున్నాడు. ఆరోగ్యమునుగురించిన కొన్నినియమములు. దేహముయొక్క పరిశుద్ధత. వస్త్రములయొక్క. నిర్మలత్వము. శుద్ధమైన ఆహారము. శుద్ధమైన జలము. స్వచ్ఛమైన గాలి. శరీరసాధకము. మితత్వము 1

2 వ ప్రకరణము.

మంచి బావి. అందలి జలమును నిర్మలముగాను శుభ్రముగా ఉంచు విధము. మంచిబావులవలన ప్రజలకు కలరాపీడ తొలగిపోవును. కలరా పుట్టుటకు కారణములు. కలరా వ్యాపించువిధము 7

3 వ ప్రకరణము.

ఆరోగ్యమునుగురించిన నియమములవలన కలుగు మేలు. గ్రామములందలి జనులకు నిర్మలమైనగాలి దొరకు విధము. గ్రామములకు తగిన ఆరోగ్య గృహము. పొడిగానుండునట్లు ఇంటిని కట్టువిధము. ధాన్యమును ఉంచదగిన స్థలములు. పశువులను కట్టుటకు తగిన స్థలములు. నిర్మలమైనగాలి, వెలుతురు, కిటికీలు. 10

4 వ ప్రకరణము.

గ్రామమునంతటిని పరిశుభ్రముగ ఉంచువిధము. ఈగలు వృద్ధిపొందువిధము. అపరిశుభ్రమగు గాలివలన కలుగు వ్యాధులు. ఈగలవలన కలుగు వ్యాధులు. 15

5 వ ప్రకరణము.

మన్యపుజ్వరము. క్వైనావలన మన్యపుజ్వరము తొలగిపోవును. క్వైనాను ఇచ్చు చెట్టు. మొదట ఈ సింకోనా (క్వైనా) చెట్టు ఇండియాకు వచ్చిన విధము. క్వైనా బిళ్లలు 19

6 వ ప్రకరణము.

గ్రుడ్డితనమును కలిగించు రెండు సామాన్యకారణములు. మశూచకము. టీకాలవలన మశూచకము తొలగిపోవును. రెండుసార్లు టీకాలను వేయవలెను. టీకాలకు రసమును తయారుచేయు విధము 22

7 వ ప్రకరణము.

ఆరోగ్యమునుగురించిన నిబంధనములు విదేశమునందున్న జనులకైనను మేలును చేయగలవు 23

8 వ ప్రకరణము.

పట్టణములలో చట్టా చేయబడిన వీధు ను ఏర్పరచి, మురుగు కాల్వలనుకట్టి, వాటిని పరిశుభ్రముగా ఉంచువిధము. మురుగు కాల్వలను శుభ్రముగానుంచు విధము. ఇండ్లు ఒకదానిపైని ఒకటిక్రిక్కిరిసి ఉండరాదు. ఇండ్లయొక్క ముందుభాగమునకును వెనుకభాగమునకును మంచివెలుతురు రావలెను. వీధులు వెడల్పుగా ఉండవలెను ... ... పుట. 26

9 వ ప్రకరణము.

ఆస్పత్రులు. కండ్లవ్యాధులు. కండ్లలోని పొరలు. మూత్రాశ్మరిలేక శిలారోగము. చర్మవ్యాధులు. ఆసుపత్రులవలన కలుగులాభములు. ఆసుపత్రులలో చికిత్సను పూర్ణముగ పొందువిధము. క్వైనాచెట్టు హిందూదేశములోని పర్వతములందు పెంచబడుచున్నది. వెర్రికుక్కలచేత కరవబడినవారి చికిత్సకొరకు ఏర్పడిన ఆస్పత్రులు. క్వైనాబిళ్లలు. టీకాలనిమిత్తమైన రసము. డాక్టరు జెన్నరు గారు... 28

10 వ ప్రకరణము.

అపరిశుద్ధమైన నీటిని త్రాగుటవలన కలుగు అపాయము. అపరిశుద్ధమైనగాలిని పీల్చినందువలన కలుగు అపాయము. వ్యాధులు కర్మమువలన రావు ... 33

11 వ ప్రకరణము.

మన్యపుజ్వరము. అది పుట్టు కారణములు. రక్తమండలి పురుగులు. మన్యపు జ్వరము దోమలవలన కలుగు విధము. దోమలు వృద్ధిపొందు విధము. దోమలు వృద్ధి కాకుండుటకు చేయవలసిన పనులు... 38

12 వ ప్రకరణము.

పెరూ దేశము. క్వైనాను మొదట కనిపెట్టిన విధము 45

13 వ ప్రకరణము.

క్వైనావలన మన్యపు జ్వరము కుదురు విధము. అట్టి జ్వరములో క్వైనాను పుచ్చుకొను విధము. క్వైనావలన ఈ జ్వరము పోవురీతి. ఇట్టి జ్వరము రాకుండుటకు క్వైనాను తీసికొను విధము. క్వైనావలన ఏ బాధయును కలుగదు 48

14 వ ప్రకరణము.

బొబ్బరోగము ఎలుకలమూలమున కలుగుచున్నది. కాలిఫా, బొబ్బరోగము, ఎలుకలు—వీనిని గురించిన కథ 53

15 వ ప్రకరణము.

ఎలుకలమూలమున ప్రజలకు బొబ్బరోగము వచ్చువిధము. ఎలుక మిణ్ణల్లులు. బొబ్బరోగము తగిలినపుడు ఎలుకలు కన్నములనుండి పైకివచ్చిచచ్చుటకు ఉండు కారణములు 59

16 వ ప్రకరణము.

బొబ్బరోగమువలన మరణము రాకుండుటకై ప్రజలు అవలంబించవలసిన ఐదు మార్గములు. ఎలుకలవలన కలుగుహాని. మనుష్యుడు, ఎలుకలు వీనిని గురించిన కథ. ఎలుకలను బోనులలో పట్టువిధము. వాటికి విషము పెట్టు విధము. ఒక గ్రామమునుండి మరియొక గ్రామమునకు ఈ రోగము వ్యాపించకుండుటకు చేయవలసినపని. ఎలుకలు చచ్చినగ్రామములను ఇండ్లనువదలి వేయుటలోనుండు వివేకము. రాత్రివేళలందు బొబ్బరోగమున్న ఇండ్లకు పోయినందువలన కలుగు అపాయము. బొబ్బరోగమున్న ఇండ్లను పరిశుద్ధము చేయువిధము. బొబ్బరోగమురాకుండ టీకాలువేయించుకొనుటవలన కలుగు లాభము. బొబ్బరోగము తగిలినవారి విషయమై తీసికొనవలసిన జాగ్రత్త. అట్టివారిని మృత్యువునుండి తప్పించు మార్గములు ... ... పుట. 63

17 వ ప్రకరణము.

కలరా. కలరా వ్యాపించువిధము. కలరా రాకుండుటకు చేయవలసిన పనులు. చక్కగా పండనిపండ్లవలనను అపరిశుద్ధమైన నీటివలనను కలుగు అపాయము. కలరా వచ్చినపుడు చేయవలసిన పనులు... 73

18 వ ప్రకరణము.

ప్రజలు త్రాగెడు నీళ్లబావుల దగ్గరను ఊటులదగ్గరను బట్టలను ఉతుకుటచేత కలుగు ఉపద్రవము 78

19 వ ప్రకరణము.

కలరా రాకుండ తీసికొనవలసిన ముందు జాగ్రత్తలు. అది వచ్చినపుడు చేయవలసిన పనులు 81

20 వ ప్రకరణము.

రోతగానుండు వాడుకలు. ఆరోగ్యములేని కుక్కలవలన కలుగు ఉపద్రవములు. ఉమ్మివేయుటవలన కలుగు అపాయము. క్షయరోగము. క్షయరోగమును తప్పించుకొను విధము. మురికిపండ్లవలన కలుగు హాని. క్షయరోగమునకు చికిత్స. క్షయరోగమును కుదర్చగల రెండు గొప్ప ఔషధములు. సమాప్తము 85

VI

ఉపాధ్యాయులు గమనింపవలసిన విషయములు.

ఈ పుస్తకములోని విషయమును సులభముగ బోధించుటకు తగినట్లు వ్రాసితిని అని గ్రంథకర్త నమ్ముచున్నాడు.

మొట్టమొదట పుస్తకమందు ఉండు విషయములను పూర్ణముగ మీరు గ్రహింపవలయును. ముందుగ ఈ విషయములను మీరే చక్కగ గ్రహించి అందలి ప్రధానాంశములతో ఏకీభవించియుండవలెను. అప్పుడుగాని పుస్తకమునందు ఉండుదానిని బోధించు శక్తి మీకు పట్టుపడదు.

చిన్న విద్యార్థులకును, పెద్ద విద్యార్థులకునుకూడ ఒక పుస్తకమే ఉండుటమీకు ఒకకష్టముగా నుండును. పుస్తకమందలి అనుక్రమణిక మీకు ఇట్టి కష్టమును తొలగించుటకు సహాయపడును. బడికివచ్చు ప్రతి బిడ్డకును పుస్తకవిషయములో కొంతవరకైనను చెప్పవలెను. విద్యను ప్రారంభించినది మొదలు ముగియువరకును ఉండు విద్యార్థులను మీరు నాలుగు తరగతులుగ భాగింపవచ్చును. పసిబిడ్డలుండు ప్రారంభతరగతిలో 1 వ ప్రకరణములోని ఆరోగ్య నియమములను బోధింపవచ్చును. రెండవ తరగతికి మొదటి ఆరు ప్రకరణములను, 20 వ ప్రకరణమును, బొబ్బరోగమును గురించినట్టియును, స్నానము కినిపెట్టినకథను గురించినట్టియును ఇతర ప్రకరణములలోని కొన్ని సంగతులను, కూడ నేర్పవచ్చును. మూడవ తరగతిలో మొదటి పది ప్రకరణములను, రెండవ తరగతి పాఠభాగములనుకూడ చెప్పవలెను. మిక్కిలి పెద్దది అగు నాల్గవతరగతిలో పుస్తకమును అంతను బోధింతుము. ఇవి మీ సహాయమునకై చెప్పిన మాటలు. ఆయావిద్యార్థులకు అనుకూలముగ ఉండునట్లు మీ యంతట మీరే పుస్తకవిషయములను వివిధములుగ నిర్ణయించుకొను మార్గములు మీకు స్ఫురించుననుటకు సందియము లేదు.

విద్యార్థులు గమనింపవలసిన విషయములు.

ఈ పుస్తకముయొక్క మొదటి సగములో రెండుదేశముల స్థితిని వర్ణింప ప్రయత్నించితిని. ఈ రెండు దేశములునుకూడ మీదేశమునే పోలియున్నవి. ఒక భేదముమాత్రము కలదు. మీదేశమందున్నవారు కూడ ఆరోగ్య నియమములను మన్నించి నడచుటకు సంపూర్ణముగ ప్రయత్నించినయెడల మీదేశముకూడ ఆ వివేకియగు మహారాజుదేశమువలె ఉండగలదు.

రెండవ సగము మీరును మీ చుట్టుపట్లనుండువారును రోగపీడితులుగాకుండ ఉండుటకు చేయవలసిన పనులనుగురించి బోధించుచున్నది.

అయితే ఈక్షణమందే మీదేశము ఆ వివేకి మహారాజుదేశమువలె ఉండజాలదు. కాని ఇప్పటినుండియును దానిని పోలియుండుటకు ప్రారంభింపవచ్చును. ఈ చిన్న పుస్తకములను చక్కగ గ్రహించిన మీలోని ప్రతివారును అందు బోధింపబడిన ప్రకారము ఆచరించుటచేత మీదేశమును ఆ వివేకి మహారాజు దేశమువలె ఉంచుటకు కొంత సహాయపడవచ్చును. మీరు చదువునేర్చి గొప్పవరమును పొందినవారైరి. అట్టి వరమును పొందనివారనేకులు మీ చుట్టుపట్లనున్నారు. చెంతనున్నవారిని దయతో జూచెదరను పేరు హిందూదేశపు జనులు పొందియున్నారు. కావున ఈ చిన్నపుస్తకమునందుండు సంగతులను మీరు మట్టుకు గ్రహించి తృప్తిపొందక దాని సారమును చదువురాని మీ ఇరుగుపొరుగువారికిగూడ బోధించుటకు ప్రయత్నింపుడు.

A Subbarao

జీవనము - వెలుతురు - పరిశుభ్రత.

జీవనము విషయమగు నియమములనుగురించియును, ఆరోగ్యమునకు సంబంధించిన నిబంధనములనుగురించియును, వ్యాధిబాధలనుండి తప్పించుకొనుమార్గములను గురించియును, ఈ పుస్తకము పాంచాలదేశపు జనులకు ఉద్దేశింపబడి వ్రాయబడినది.

మిగుల ఘనతవహించిన శ్రీరాజ చక్రవర్తిగారికి లోబడియుండు ప్రజల క్షేమముకొరకును, వారి ఆరోగ్యమును వృద్ధిచేయుటకును, తమ శక్తి వంచనలేక పనిచేయుట యే విధి కృత్యమనియును గౌరవమైన పని అనియును సదా భావించునట్టి ఆంగ్లేయుల సేవకుడగు ఒకనిచేత ఇది వ్రాయబడినది.

పాంచాలదేశపు బడులలో ఇది ఆరోగ్యమునుగురించిన ప్రథమ బోధినిగా ఉపయోగింపబడుటకు అచ్చుటి పఠనీయ గ్రంథ సంఘమువారిచేత ఆమోదింపబడినది.

A Subbarao

1

జీవనము-వెలుతురు-పరిశుభ్రత.

1 వ ప్రకరణము.

[వ్యాధినుండి తప్పించుకొనుటకు తగిన జ్ఞానమును సంపాదించు శక్తిని సర్వేశ్వరుడు మానవుల కిచ్చియున్నాడు. ఆరోగ్యమును గురించిన కొన్ని నియమములు. దేహముయొక్క పరిశుద్ధత. వస్త్రములయొక్క నిర్మలత్వము. శుద్ధమైన ఆహారము. శుద్ధమైన జలము. స్వచ్ఛమైన గాలి. శరీరసాధకము. మితత్వము.]

హిందూదేశమునందు చక్కని దేశమును పాలించుచున్న రాజొకడుండెను. ఆతడు ధర్మపరిపాలకుడు. తన ప్రజల స్థితిగతులను అభివృద్ధిపరచుటకై నిబంధనములను చేయుటయందు ఎక్కువకాలమును గడపుచుండును. అందువలన ఆ దేశమందున్న రయితులు అందరును ఆతనిని అత్యంతము ప్రేమించుచుండిరి. ఆ దేశమునందు మంచి నీటి వసతి గలదు. భూమి ఎక్కువ ఫలవంతమై మంచి పంటల నిచ్చుచుండెను. అచ్చట పెక్కు చక్కని పశులమందలు గలవు. అవి మేయుటకు అధికమైన పచ్చికయును గలదు.

కాని ప్రజలు అధికముగ వ్యాధిపీడితులుగ నుండుటచేత రాజు హృదయము తల్లడిల్లుచుండెను. జ్వరములవలనను నీళ్ల విరేచనముల వలనను అనేకులు నశించిరి. కలరా తరుచుగా కొన్ని సంవత్సరములకు ఒకసారి బయలుదేరి ప్రజలను నాశముచేయుచుండెను.

ఒకానొక దినమున రాజు కొలువు తీరియుండి తన ప్రధానితోను ఇతర ప్రముఖులతోను ఇట్లని పలికెను :—"ఈ దేశమందలి రయితులు మాయామర్మము లెరుగనివారు. మూఢులు. తమకింత కీడును చేయుచున్న రోగములనుండి తప్పించుకొనుటకు ఏమిచేయవలెనో తెలియనివారు. ఈ రోగములన్నియును తమ కర్మమువలన కలుగుచున్నవని ఎంచెదరు. అట్లు మరణము సంభవించుట ఈశ్వరేచ్ఛయని చెప్పుచుందురు. అయితే, నేను దేవునికి విధేయుడగు సేవకుడను మాత్రమే. ఈశ్వరుని ఇచ్ఛ ఇట్టిదని నిజముగ నమ్మినపుడు దానికి అనుకూలముగ నడుచుకొనుటకు సిద్ధుడనే. కాని ఈ విషయమును గురించి చిరకాలము తలపోయుచుంటిని. పుష్కలముగ ఆహార ద్రవ్యములను ఇచ్చునట్లు ప్రజలు తమ భూములను సేద్యము చేసికొనుటకు తగిన జ్ఞానమును సంపాదించుకొన నిచ్చినది భగవంతుడే. వారికి త్రాగుటకు పాలను, వారి బట్టలకు కావలయు ఉన్నెను ఇచ్చునట్టి పశులమందలను అనేక

ములను అనుగ్రహించినదియును భగవంతుడే. ఇట్టి భగవంతుడు వారికి అంత హానిని చేయుచున్న వ్యాధులనుండి తప్పించుకొను జ్ఞానమును సంపాదించ నొల్లకుండునా ? కావున ఈ విషయములలో ప్రజలను జ్ఞానవంతులుగ జేయుటకు నేనేమి చేయవలసియుండునో నాకాలోచన చెప్పుము. ”

అప్పుడచ్చటనుండు వారిలో నొక గొప్ప వర్తకుడు ఇట్లు పలికెను :—

“ రాజా ! ఈ విషయమును తాము సెలవిచ్చినది సత్యము. అనేకములగు దూరదేశములకు నేను పోయియుంటిని. నేనొక సంగతిని కనిపెట్టినాడను. ఆయాదేశములలో నిబంధనములును నియమములును చేయబడినవి. వాటిని అందలి ప్రజలు విధేయులై ఆచరించుటచేత కలరా, జ్వరము, నీళ్ల విరేచనములు, గ్రహణి విరేచనములు, బొబ్బరోగము, మశూచకము మొదలగు వ్యాధులన్నియును కొంచె మించుమించు అంతరించినవి. నిత్యమును దేహమును కడుగుకొనుట, ధరించు బట్టలను పరిశుభ్రముగ నుంచుకొనుట, ఆహారద్రవ్యములను సిద్ధము చేసికొనుటయందును వండుకొనుటయందును శుభ్రముగానుండుట, పానపాత్రములను త్రాగెడు నీటిని శుద్ధముగా నుంచుకొనుట—ఈ మొదలగు విషయములను గురించి నిబంధనములున్నవి. ఇట్టి నిబంధనములకు విధేయుడై ప్రవర్తించనివానికి ఎన్నటికిని దేహదార్ఢ్యముగాని చక్కని దేహారోగ్యముగాని ఉండనేరదు. ”

“ ఈ నిబంధనములు ఇండ్ల నిర్మాణము మొదలగు ప్రజల యారోగ్య విషయములకు సంబంధించియున్నవి. ఇండ్లు పొడిగాను వెలుతురు గలవిగను, ధారాళముగ గాలి ప్రసరించునవిగను, విశాలమైనవిగను, శ్రమలేక పరిశుభ్రముగ నుంచదగినవిగను కట్టబడవలెను. ఇండ్లనుండియును, గ్రామములనుండియును అన్ని విధములైన కల్మషములను నిత్యమును తొలగించుట, రాజవీధులను సంత చావళ్లను సదా శుభ్రముగానుంచుట, మురుగు తూములను నిత్యమును తుడిచి నీటితో శుభ్రపరచుట, మఱియు దూళిరేగకుండ రస్తాలను ప్రతి దినమును నీటితో దడుపుచుండుట—మొదలైనవాటిని గురించిన నిబంధనములును ఉన్నవి. ”

“ మంచి బావులను త్రవ్వించి అందలి నీరు స్వచ్ఛముగను త్రాగుటకు అనుకూలముగను ఉండునట్లు వాటిని ప్రతి సంవత్సరమును శుభ్రపరచి మరమ్మతులు చేయించుటకును, బావులలోను చెరువులలోను ఉండు నీటిని అపరిశుద్ధపరచి త్రాగుటకు పనికి రాకుండచేయు కల్మషములు అందులో చేరకుండుటకును—మరికొన్ని నిబంధనములు గలవు. ఈ విష

యములనుగూర్చియును, ఇట్టి ఇతర విషయములనుగూర్చియును ఆ దేశములలో చక్కని చట్టములు గలవు. ఈ చట్టములచేతను అందుండు ప్రజలకు మంచిమేలు చేకూరుచున్నది. ఈ చట్టములకు విధేయులై నడుచుకొనుటవారికి బాధకరముగా లేదు. అందువలన వారును మనస్ఫూర్తిగా వాటికిలోబడి నడుచుకొనుచున్నారు. ఇట్టి చట్టములు అత్యావశ్యకములు. కావున జనులు వాటికి అనుగుణ్యముగ నడచుకొననియెడల తాముండు పట్టణములుగాని పల్లెలుగాని రోగరహితములై యుండవు. మరియు అవి సుఖదాయకములుగను వాసయోగ్యములుగనుకూడ నుండవు."

"రాజా! ఇంకను ఒక సంగతిని కనిపెట్టినాను. ఏయే దేశములలోని ప్రజలు తమ స్వేచ్ఛావృత్తిని చట్టములకు విధేయులై ఉందురో, అచ్చటనుండువారు ఆరోగ్యమును దార్ఢ్యమును కలిగి పెద్దలగుచున్నారు. అచ్చట పడుచువాండ్రు దృఢగాత్రులుగను సుందరాంగులుగను ఉన్నారు. అనేకులు ముసలిపండ్లగువరకును జీవించుచున్నారు."

"నేను చూచిన దేశములలో నింకొకటిగలదు. అచ్చటికి పలుమారు పోయియుంటిని. దానిని మిగుల వివేకియగు మహారాజు పాలించుచున్నాడు. అతడు ఇట్టి చట్టములను నిర్ణయించుటకై అధికముగా నాలోచన చేయుచుండును. అట్టి పనికి తనకు సహాయపడుటకై తగిన పండితులగు వైద్యశాస్త్రజ్ఞులను దగ్గరపెట్టుకొనియున్నాడు."

"ఈ వైద్యశాస్త్రజ్ఞులు అందరును వ్యాధులనుగురించియును వాని ఉత్పత్తికారణములను గురించియును చక్కగ తెలిసినవారుగానున్నారు ఏ కారణములచేత వ్యాధులు ప్రజలలో వ్యాపించుచున్నవో వారు బాగుగ నెరుగుదురు. అట్టి వ్యాధులు దేశమునందు వ్యాపింపకుండుటకును, వాటివలన కలుగు బాధలను నివారణచేయుటకును తగిన మార్గములను కనిపెట్టుటయందు వారు అతికుశలులుగానున్నారు."

"రాజా! ఆ మహారాజునకు ఒకజాబు వ్రాసి తమ దూతలను బంపుడు. అచ్చటి వైద్యశిఖామణులలో నొకరిని ఇచ్చటకు పంపి ఇంత మిక్కుటమైన హానిని చేయుచున్న వ్యాధులనుండి ఈ దేశపు ప్రజలను రక్షించు మార్గములను అతడు వీరికి నేర్పునట్లు ఆ మహారాజును ప్రార్థింపుము."

ఇట్లా వర్తకుడు చెప్పిన మాటలకు రాజు మెచ్చి తన పెద్ద కుమారుడగు యువరాజును ఆ మహారాజు దేశమునకు పోవుటకై సిద్ధపడుమని

ఆజ్ఞాపించెను. ఆ మహారాజు దేశము దూరముగానుండుటచేత యువరాజుతోగూడ రక్షకభటులను సేవకులను అనేకులను పంపెను. ఆ మహారాజునకు కానుకలుగా నొక ఏనుగును అధికమైన బంగారు నగలును వానిచేత బంపెను. తన దేశమును నాశనము చేయుచున్న వ్యాధులనుండి తన ప్రజలను సంరక్షింపగల చట్టములను నిబంధనములను చేయుటయందు తనకు సహాయపడగల వైద్యశాస్త్రజ్ఞుని పంపుమని ఆ మహారాజును కోరుచు నొక ఉత్తరము వ్రాసి తనకుమారుని చేతికి ఇచ్చి పంపెను.

యువరాజు తన సిబ్బందితో పెక్కువారములు ప్రయాణముచేసి మార్గమధ్యమున వింతలగు దేశములను జనులను అనేకము చూచి ఆ మహారాజు దేశమును చేరెను. ఆ దేశమును చేరగానె యువరాజును అతని సిబ్బందియును అచ్చటి జనులను, అన్నియెడల కనుపడు భాగ్య చిహ్నములను చూచి చాల ఆశ్చర్యపడిరి.

అచ్చటి జనులు అంగసౌష్ఠవముగలిగి బలాఢ్యులైయుండిరి. పసిప్రాయమునను యౌవనమునను చచ్చువారు అచ్చట అంతగా లేరు. అనేకులు ముసలివండ్లగువరకును జీవించియుండిరి డెబ్బది ఎనుబది యేండ్లు వచ్చినను వారు దేహారోగ్యముగలిగియుండిరి. ఆ దేశమునందు మశూచకపు మచ్చలుగలవారుగాని తమ దేశమునందుండినట్లు గ్రుడ్డివారుగాని వారికి కనుపడలేదు.

ఆ మహారాజు దేశముకూడ తన తండ్రి దేశమువంటిదే. అచ్చటను ఇచ్చటను—ఆకురాలు కాలము, వానకాలము, ఎండకాలము ఇవి సమానములే. ఇట్లయినను ఆ మహారాజు దేశమునందు అట్టి భాగ్యచిహ్నములుండుట యువరాజునకు అత్యద్భుతముగ కనుపడెను.

యువరాజును అతని సిబ్బందియును రాత్రి సమయమున పట్టణములందుగాని పల్లెలందుగాని ఆగుచుండిరి. అప్పుడచ్చటి జనులు వారిని ఆదరించుచుండిరి. యువరాజు ఆ మహారాజు దేశమునుగురించి అనేక సంగతులను ఆ జనులనడుగుచుండెను. ఒకప్పుడాతడు—"ఈ దేశమునందలి జనులింత చక్కనివారుగను బలముగలవారుగను ఉండుటకు కారణములను నాకుజెప్పుము" ని అడిగెను.

"ఇచ్చటి జనులావిధముననుండుటకు కారణము వారు ఆరోగ్య నిబంధనములను అనుసరించి నడచుకొనటయే" అని ఆ జనులు పలికిరి.

" వాడుకొను

పగచవలయును అను

గలదు. చర్మముగుండ శ

పోవుచుండును. ఆ కల్మషములు పై

మురికిచేయును. ఇట్టి స్థితిలోనున్న దుస్తు

వ్యాధి కారణము లగును."

" మిక్కిలి పరిశుద్ధమైనట్టియు, పరిశుద్ధస్థలమందు వండబడిన ఆహారమును మాత్రమే భుజింపవలెను అను నిబంధనము ఇంకొకటి. దీనికిని కారణముగలదు. వ్యాధిని పుట్టించు కల్మషములు అనేకములు మొదట ఆహారద్రవ్యములలో ప్రవేశించును. ఆ యాహారము లోపలికి పోయినపుడు అవియును రక్తములలో చేరి అచ్చట రోగమును పుట్టించును."

" స్వచ్ఛమై శుద్ధముగనుండునట్టి బావినుండిగాని ఊటనుండిగాని గొట్టమునుండిగాని తీయబడు నీటినే త్రాగవలయును అను వేరొక నిబంధనము కలదు. ఇందులకు కారణ మేమనగా :—వ్యాధిని కలిగించు అనేకములయిన కల్మషములు మొదట నీటిలో చేరును. ఆ నీటిని త్రాగినపుడు అవియును లోపలికిపోయి రక్తములో చేరి రోగమును పుట్టించును. త్రాగినవెంటనే నీరు అన్నకోశమునుండి రక్తములో చేరును. ఈ నీరు పరిశుద్ధమయినది కానియెడల రక్తము అపరిశుద్ధమగును. రక్తము చెడినపుడు దేహారోగ్యముండనేరదు."

ండరములకు రక్తము
...ంటిని పయికి వెడల
...దాల్చి పయికివచ్చును."

...వరకుమాత్రమే తినవలయును, త్రాగ
అను ఇంకొకనిబంధనము గలదు. మిత
...భుజించినను, త్రాగినను మనుష్యునికి ఆరోగ్యము
లదు. అట్లుండినయెడల దేహము క్రొవ్వుపట్టి స్థూలమగును."

"ముఖ్యమయిన ఆరోగ్యనిబంధనములలో ఇవి కొన్నిగా నున్నవి. వీటిలో దేనినయినను అవలంబించుట అసాధ్యముగాదు. ప్రతి వాడును వీటికి విధేయుడై నడచుకొనవలెను. అట్లుండుటచేత మానవకోటిని హింసించు వ్యాధులు ఆతనిదరికిరావు. వీటిని ఉపేక్షించినయెడల బల ముండదు. రోగములబాధయును తప్పదు."

"ఈ నిబంధనములను పట్టుదలతో అనుసరించువాడు ఆరోగ్యబలము లను రెండు బహుమానములను పొందును. ఈ రెండును అమూల్యమైన వరములు. ఎందువల్లననగా:—ఎవనికిగాని ఆరోగ్యబలములు పోయినపుడు రాజుల యధికారమున్నను ధనికులధనమున్నను తిరిగి ఆతడు వాటిని పొందజాలడు."

యువరాజు అప్పుడిట్లు పలికెను:—"ఈ నిబంధనములలో కష్ట మెంతమాత్రమును లేదు. అన్నిటిని సులభముగ నాచరింపవచ్చును.

నిశ్చయముగా వివేకి ఎవ్వడైనను వానిని పట్టుదలతో అవలంబించుటయందు గల శ్రమను లెక్కింపడు. అందులకుమారుగ తాను తప్పకపొందగల ఆ రెండు బహుమానములు, అనగా, ఆరోగ్యబలములను గురించి మాత్రమే ఆలోచింపుచుండును. ”

---

2 వ ప్రకరణము.

[మంచి బావి. అందలి జలమును నిర్మలముగాను శుభ్రముగా ఉంచువిధము. మంచి బావులవలన ప్రజలకు కలరా పీడ తొలిగిపోవును. కలరా పుట్టుటకు కారణములు. కలరా వ్యాపించువిధము.]

అది వేసవికాలము. యువరాజును అతని సిబ్బందియును తమ ప్రయాణములో నేదైన గ్రామముదగ్గరకు వచ్చినపుడు అచ్చటి జనులు వారిని కలిసికొని ఆదరించుచుండిరి. అట్లా జనులువచ్చునపుడు వారు దప్పిగొనియుందురేమో అని వారికి దాహము తీర్చుకొనుటకు పరిశుద్ధమైన పాత్రములలో నీటిని తెచ్చుచుండిరి. ఆ నీరు ఎప్పుడును మంచిదిగను పరిశుద్ధమయినదిగను ఉండెను. ప్రతి గ్రామమందునను ఇట్టి పరిశుద్ధమయిన జలముండుట ఎట్లు సంభవించెనని యువరాజొకప్పుడా జనులనడిగెను. ఇందులకు ప్రత్యుత్తరమిచ్చుటకై ఆ జనులా యువరాజును తీసికొనిపోయి తమ బావులలో నొకదానిని కనుపరచిరి. ఆ బావి ప్రశస్తమైన ఇటికలతో భద్రముగ కట్టబడినది. బావిచుట్టును పయిని సుమారు రెండు అడుగులు ఎత్తుగల పిట్టగోడ ఉండెను. ఈ గోడకు వెలుపల నూతికి అన్నివైపులను నాలుగు అంగలమేర చప్టాయున్నది. ఈ గోడయును చప్టాయును ఇటికలతోనే జాగరూకతతో కట్టబడినవి. వానిపయిని సిమ్మెంటు గచ్చు ఉన్నది. దాని గట్టితనము నునుపుదనమును పాలశిలను పోలియున్నవి. నూతిముఖమునుండి ఆవల నన్నివైపులను ఈచప్టా పటవాలుగా చేయబడినది. ఆ చప్టాకు చిగురున చుట్టును మురుగు కాల్వగలదు. ఇది సదుపుగానున్న మరియొక కాల్వలో చేరుచున్నది. అందువలన వృథాగా క్రిందపడిన నీరంతయు దానిలోనుండి పయికి పోవుచున్నది. ఆ బావియొక్క నిర్మాణము దానిలోనికి ఎట్టి మురికినిగాని కల్మషమునుగాని రానీయకున్నది.

ఆ బావిలోని నీటిని తోడుట కొక నీళ్లమనుష్యుడు గలడు. నీరు కావలసినవారందరును తమ కుండలను చప్టా పయిని తెచ్చి ఉంచిరి. అపుడు ఆ నీళ్లమనుష్యుడు ఒక పరిశుద్ధమయిన పెద్ద ఇత్తడిపాత్రను

బావిలోకి దింపి నీరు తీసికొనివచ్చి వారికుండలను నింపెను. ఆ నూతి నీరు మిగుల పరిశుభ్రముగను బాగుగను ఉండెను.

"ఇది మిక్కిలి చక్కనిబావి. దీనిలోని నీరు మిగుల ప్రశస్తముగ నున్నది. ఇంత బాగుగనున్న నూతులు ఈ దేశమునందు అనేకము లున్నవా?" అని యువరాజడిగెను.

అందులకచ్చటి జనులిట్లు ఉత్తరము చెప్పిరి:—"పెద్దగ్రామములలో ఇంతమంచివి పెక్కునూతులు గలవు. ప్రతి గ్రామమందును ఇట్టి బావి ఒక్కటి అయినను ఉండును. ప్రతి గ్రామమందును ఇంత మంచి బావి ఒకటి అయినను ఉండవలెననియు ఎవ్వడుగాని త్రాగుట మిక్కిలి పరిశుద్ధమైన జలములేక ఉండకూడదనియు ఈ దేశపు మహారాజు చట్టముచేసి యున్నాడు. అట్టి బావికి ప్రతిదానికిని ఒక నీళ్లమనుష్యుడు ఉండును. అట్టి మనుష్యుడు అగ్రవర్ణము వాడుగానుండుటచేత అతనిచేతి నీరు అందరును త్రాగుదురు. ఈ నీళ్లమనుష్యుడు లేక అతని కుటుంబము లోనివారు తప్ప మరియొకరు నూతిలో పాత్రను దించరాదని శాసించబడినది. ఆ నీళ్లమనుష్యుడు ఉపయోగించు పాత్ర మరియొకపనికి ఎన్నడును ఉపయోగింపబడకూడదు. ఆ పాత్రను బాగుచేయించవలసినపుడు మాత్రమే అది నూతిదగ్గరనుండి తీసికొనిపోబడును. అట్లు బాగు పడిన తరువాత దానిని ఆ నీళ్లమనుష్యుడు అగ్నితోను శుభ్రమయిన ఇసుకతోను శుద్ధముచేసిన వెనుకగాని నూతిలో దింపవలను పడదు."

"ఇవి నిశ్చయముగ వివేకముగల చట్టములు. అయితే ఈ నీళ్ల మనుష్యునకు జీతమిచ్చువారెవరు?" అని యువరాజనెను.

జనులిట్లు బదులుచెప్పిరి:—"ప్రతియింటికిని దినమునకు పట్టునీళ్లకు కుండకు ఇంతయని ఆ యింటి యజమానుడు నెలకు కొంతధనము నిచ్చును. లోతైన బావిగానున్నయెడల ఎక్కువ సొమ్ము వచ్చును. లోతుగానుండని బావికి అంతగారాదు."

"బావులన్నిటికిని ఇట్టిచట్టములు గలవా?" అని యువరాజడిగెను.

అందులకు జనులిట్లు చెప్పిరి:—"వంటకును, త్రాగుటకును ఉపయోగపడు నీరుగల బావులనుగురించి మాత్రమే ఇట్టి నిబంధనములుగలవి. ఇవిగాక మరికొన్ని నూతులుగలవు. వాటి నీరు బట్ట లుతుకుటకును, ఇండ్లుకడుగుట మొదలుగాగల పనులకును ఉపయోగించును. ఆ నూతుల లోని నీరు ఎవరయినను తీసికొనవచ్చును."

"ఇంత వివేకముగల చట్టములను ఏర్పరచి ఆ మహారాజే నిశ్చయముగ గొప్పమేలును చేసియున్నాడు" అని యువరాజనెను.

అందుపయిని జనులిట్లు తిరిగి చెప్పిరి :—"ఈచట్టములవలన చాల మేలు కలిగినది. ఇందుచేత తప్పక ప్రతివానికిని పరిశుద్ధమయిన మంచి నీరు త్రాగుటకు దొరకుచున్నది. ఆ కారణముచేత అపరిశుద్ధజలమువలన కలుగు వ్యాధులనుండి ప్రతివాడును తన్ను తాను కాపాడుకొన గలిగి యున్నాడు. నూతులనుగురించిన చట్టములు లేనికాలమున ఘోరవ్యాధి యగు కలరా ప్రవేశించి తరుచుప్రజలను పీడించుచుండెను. కలరా ప్రవేశించి భయంకరముగ వ్యాపింపగానే కొద్దివారములలోపలనే వేల కొలది జనులు దానిచే బాధింపబడి చచ్చుచుండెడివారు. ఇప్పుడన్ననో ఈ చట్టముల యనుగ్రహముచేత ఆ వ్యాధి దేశమునందు వ్యాపించుటయే లేదు."

"దీనికి కారణమేమనగా కలరాజాడ్యము నీటిలోనుండు లెక్కలేని పురుగుల (లేక అంకురముల) వలన కలుగుచున్నది. ఈ పురుగులు అతి సూక్ష్మములు. కంటితో వాటినిచూచుట అసాధ్యము. మేఘములవలె బయలువెడలు మిడుతలదండ్లవలె అవి లెక్కలేకయుండును. ఈ పురుగులు మనుష్యుని పేగులలోచేరి నీళ్లవిరేచన వ్యాధిని పుట్టించును. ఈ పేగులనుండి ఇవి రక్తములోచేరును. అట్లు రక్తములోచేరి దానియందుగల సత్వమును శీఘ్రముగా నాశనముచేయును. ఈ కారణముచేత ఆ మనుష్యునకు బలమంతయును పోయి కొన్నిగంటలలోపలెనే మరణము సంభవించును."

"ఎవరికైనను కలరావచ్చినపుడు వాంతిభేదులగును. వీనిమూలమున గంజినీళ్లవంటి ద్రవ్యము పయికివచ్చును. అపుడు కలరాపురుగులు అతని శరీరమునుండి ఆ నీటిగుండ పయికివచ్చుచుండును. రోగినుండి వాంతివలనగాని భేదివలనగాని పయికివచ్చిన నీటిలో నొకటిబిందువును తీసి ఒకనూతి నీళ్లలోవేసినయెడల ఆ బిందువులోని కలరాపురుగులు నూతి నీళ్లలో పెరిగి లక్షలకొలది అగును. బాగుగ దున్నిన నేలలోవేసిన విత్తనములు మొలచి వేనవేలగు ధాన్యపుగింజలను ఎట్లు యిచ్చునో అటులనే ఆనూతిలో నా పురుగులు పెరుగును అట్లు పాడుచేయబడిన నూతి నీటిని త్రాగినవానికి తప్పక కలరా వచ్చును."

అందుపయిని యువరాజిట్లు పలికెను :—"ఇది అంతయును చాల అద్భుతముగనున్నది. ఈ కలరా పురుగులు అతి సూక్ష్మములని కంటికి

కనుపడవని చెప్పుచున్నారు. అట్లుండియును ఈ కలరా వ్యాధియొక్క కారణములను గురించి మీకింత ఎట్లు తెలిసినది. ఆ సంగతినాకు చెప్పవలయును."

అందుసకు జనులిట్లు ఉత్తరము చెప్పిరి :—"మా మహారాజు పట్టణములో పండితులును జ్ఞానవంతులును అగు వైద్యశాస్త్రజ్ఞులు అనేకులున్నారు. వారివద్ద * మైక్రాస్కోపు లనబడు సూక్ష్మదర్శని యంత్రములున్నవి. వాటి మూలమున ఈ పురుగులను వారు చూడగలరు అట్లు పరీక్షించి వారు వ్యాధుల కారణములను కనుగొనుచుందురు. ఈ వైద్య శిఖామణులనుండియే మాకు కలరాయొక్క కారణములు తెలిసినవి. వారి ఆలోచన మీదనే మా మహారాజు నూతనను గురించిన చట్టములను చేసియున్నాడు."

---

3 వ ప్రకరణము.

[ఆరోగ్యమును గురించిన నియమములవలన కలుగుమేలు. గ్రామములందలి జనులకు నిర్మలమైన గాలి దొరకు విధము. గ్రామములకు తగిన ఆరోగ్య గృహము. పాడి గానుండునట్లు ఇంటిని కట్టు విధము. ధాన్యమును ఉంచదగిన స్థలములు. పశువులను కట్టుటకు తగిన స్థలములు. నిర్మలమైన గాలి, వెలుతురు, కిటికీలు.]

యువరాజును సిబ్బందియును ఇట్లామహారాజు పట్టణమునకు ప్రయాణమై పోవునపుడు ఒకానొక దినమున వారొక పెద్ద గ్రామమును చేరిరి. ఆ గ్రామమందు పండితుడగు నొక న్యాయాధికారి ఉండెను. అతడు వీరిని అచ్చట కొన్నినాళ్లు తన గృహమున విశ్రమింపు మని ప్రార్థించెను. ఆ న్యాయాధికారి ఇతని తండ్రి దేశమును గురించియును అచ్చటి ప్రజలను గురించియును అనేక సంగతులు యువరాజును అడిగెను.

యువరాజు చెప్పినదేమనగా :—"నా తండ్రి దేశము మీ దేశము వంటిదే. అక్కడి భూస్థితి, నీరు, శీతోష్ణములు, ఋతువులు మీ దేశము

---

* 'మైక్రాస్కోపు' అనగా చిన్న వస్తువులను పెద్దవాటినిగ కనపరచు యంత్రము. అటువలెనే 'టెలిస్కోపు' (దూరదర్శని) అను యంత్రము చిన్నవిగను దూరముగను ఉన్న వస్తువులను పెద్దవాటినిగను దగ్గరనుండునట్లును కనుపరచును. ఒక పెద్ద మైక్రాస్కోపుతో తలవెండ్రుకను జూచినయెడల అది పెద్ద మోకువలె కనుపించును. వ్యాధులను పుట్టించు పురుగులను పెద్ద మైక్రాస్కోపుతో చూచినయెడల అవి వేరుశనగ గింజలంత పెద్దవిగ కానవచ్చును. కాని నిజముగ ఆ పురుగు లతి సూక్ష్మములు అట్టి యంత్రముతో చూచినప్పుడుగాని అవి కనుపడనేకనుపడవు.

నందుండువాటికి పోలియున్నవి. కాని ఈ దేశపు జనులవలె అక్కడ నుండువారు ధార్ఢ్యమును చురుకుతనమును గలిగియున్న వారుకారు. వారికి కలరా, జ్వరము మొదలగు వ్యాధులవలన బాధ మెండుగా గలదు."

న్యాయాధికారి ఇట్లు పలికెను :—" ఈ దేశమందలి జనులు ఆరోగ్య నిబంధనములను తెలిసికొని వాటిని పొందికగా అనుసరించుచున్నారు. ఈ విధముగ మీ దేశపుజనులు తెలిసికొని ఆచరించకుండుట చేతనే అంత రోగపీడ కలుగుటకు కారణముగానున్నది."

యువరాజిట్లు చెప్పెను :—" అది నిజమే కాని ఈ దేశమందు మీవారు ఆరోగ్య నిబంధనములను అనుసరింపగలిగినంత సులభముగా మా దేశమం దున్నవారు చేయలేకున్నారు. మిక్కిలి పరిశుద్ధమైన నీటిని మాత్రమే త్రాగవలెనను నిబంధనము ఒకటియున్నది. ఇక్కడ ప్రతి గ్రామమం దను ఒక్కటి యయినను ప్రశస్తమైన బావి ఉండును. అందలి నీరు మిక్కిలి పరిశుద్ధముగానుండును. అందువలన ఎవరికైనను అట్టి నిబంధ నమును అనుసరించుట సులభమే."

" నిర్మలముగను వాసన లేక పరిశుద్ధముగను ఉండు గాలినే పీల్చ వలయునను నిబంధనము మరియొకటిగలదు. మా దేశమందలి గ్రామ ములలో గాలి తరుచుగా పరిశుద్ధముగా నుండక దుర్వాసనతోకూడ నిండియుండును. అట్టి స్థితిలో ఎవనికిగాని తనయింటిలో మంచిగాలి లభించు టెట్లు? అప్పుడాతడు ఇట్టి నిబంధనము చొప్పున నడచుకొను టెట్లు?"

న్యాయాధికారి చెప్పినదేమనగా :—" అట్టి స్థితిగతులలో ఎవరికి గాని ఇండ్లలో శుద్ధమైనగాలి దొరకదు. అయితే ప్రతి గ్రామమందు నను శుద్ధమైనగాలి దొరకుటకై మా మహారాజు కొన్ని మంచి ఆరోగ్య నిబంధనములను ఏర్పరచియున్నారు."

" న్యాయాధికారీ! గ్రామములందలి గాలిని శుభ్రపరచు నిమిత్త ము ఏర్పరచబడిన నిబంధనములను గురించి నాకు చెప్పుము" అని యువరాజు పలికెను.

న్యాయాధికారి ఇట్లు చెప్పెను :—" గ్రామమందున్న ప్రతి ఇంటిని వీధిని అనుదినము ఊడ్చవలెననియు, ఇండ్లలోను వీధులలోను ఊడ్చబడిన

పెంట, చెత్త మొదలగువానిని ప్రతి దినమును తీసికొనిపోయి దూరముగ పొలములలో వేయవలెననియు ఒక నిబంధనము కలదు. ఇట్లు తీసికొని పో బడిన చెత్త చెదారముల పైని మన్నుకప్పబడును. ఈ స్థితిలోనున్న దానిని తగిన ఋతువులరాగానే కాపులు పొలములకు పెట్టుకొందురు. ఈ నిబంధనమువలన ప్రయోజనమేమనగా—ఈ చెత్త చెదారములు గ్రామములోనే నిలువ ఉన్నయెడల అవి అపరిశుద్ధమైనవిగానుండుట చేత దుర్వాసనను కలిగించును. ఇందుచేత గాలి చెడి రోగములకు హేతువువగును."

"అది చక్కని నిబంధనము. గాలిని శుభ్రపరచి నిర్మలముగానుం చుటకు ఇంకను కొన్ని నిబంధనములున్న వేమో చెప్పుము" అని యువ రాజనెను.

న్యాయాధికారి చెప్పినదేమనగా :—"కట్టవలసిన ఇండ్లమాదిరిని గురించి కొన్ని చట్టములుగలవు. ఇప్పుడు నీవు నాతో గ్రామమునకు వచ్చినయెడల ఈ దేశమున కట్టు ఇండ్ల మాదిరినిచూచి దానిని చక్కగ తెలిసికొనకలుగుదువు."

అప్పుడు న్యాయాధికారి యువరాజును ఎండిన ఇటికలతోను మంటి తోను కట్టుకొనిన ఒక బీదవాని ఇంటికి తీసికొనిపోయెను. వారు వీధి గుమ్మము దాటినతోడనే లోపలి ఆవరణము కనుపడెను. ఆ యావరణము వీధి మట్టమునకు ఒక అడుగు ఎత్తుగానున్నది.

న్యాయాధికారి ఇట్లుపలికెను :—"ఈ యావరణము వీధి మట్టము నకు ఒక అడుగు ఎత్తుగానుండుట మంచి విషయము. వానకాలమందైనను వరదలు వచ్చినప్పుడైనను ఈ యిల్లు పొడిగానే ఉండును. ఇల్లు చెమ్మ గానుండినయెడల అందున్నగాలి అపరిశుభ్రమై అనారోగ్యమునకు కార ణమగును."

ఈ యావరణమునకు ఒక వైపున వెల్లడిగానుండు పాక యొకటి గోడకు చేర్చికట్టబడినది. ఆ పాకలోపల ధాన్యమును నిలువచేసిన మట్టి గాదెలున్నవి.

న్యాయాధికారి ఇట్లు చెప్పెను :—"ధాన్యపుగాదెలను మనుష్యు లుండు గదులలోనుంచక పోవుటమంచిది. అట్లుంచినయెడల ఆ గదుల లోపలికి ఎలుకలును చుంచులును, బొబ్బరోగమునకు హేతువులగు పురు గులును, వచ్చుటకు కారణమగును. అట్టి కారణములనుపట్టియే మను

ష్యులుండు గదులలో తిను బండారపు వస్తువులను లేశమైనను ఉంచకూడదు."

ఈ యావరణమున కొక కొనను మనుష్యులుండు గదియున్నది. రెండవ కొనయందు రాత్రులందు పశువులను కట్టుపాక ఉన్నది.

న్యాయాధికారి చెప్పినదేమనగా :—"మనుష్యులుండు స్థలమున పశువుల నుంచకుండుట మంచిది. అట్లున్నయెడల పశువులవలన గాలి చెడి అపరిశుభ్రపడును."

తరువాత వారు ఇంటివారుండు గదిలోపలికి పోయిరి. ఈ గది ఆవరణము మట్టముకన్న అర అడుగు ఎత్తుగనున్నది. అందుచేత వరదల కాలములోకూడ పొడిగాను ఆరోగ్యకరముగాను ఉండును. గది విశాలమైనది దానికి ఒక వైపున ద్వారమున్నది. తక్కిన మూడు వైపులను ఒక్కొక్క కిటికీయున్నది. ప్రతి కిటికీయును నిలువు ఎత్తున అమర్చబడియున్నది. ప్రతి కిటికీకిని జల్లెడవంటి * ఇనుప తీగెల తెర అమర్చబడియున్నది.

న్యాయాధికారి ఇట్లుపలికెను :—"ఇట్లు గదికి ఒక తట్టున ద్వారమును మిగిలిన మూడు వైపులను కిటికీలును ఉండుట మంచిది. అందు మూలమున గాలిపయినుండి లోపలికిని లోపలనుండి పైకిని పోగలిగియుండును. మనుష్యులు గదిలో నిద్రించునపుడు వారు విడుచు అపరిశుద్ధపు గాలి ఈ కిటికీలగుండ వెలుపలికి పోయి పైనున్న మంచిగాలి లోపలికి వచ్చుచుండును. మనుష్యుని ఊపిరి తిత్తులనుండి విడువబడు గాలి అపరిశుభ్రమైనది గదిలో నిలిచియుండునట్టి గాలినితిరిగి పీల్చినయెడల ఆరోగ్యము చెడుటకు కారణమగును. కిటికీలకుండు ఇనుప తీగెల తెర చాలమంచిది. ఎదువల్లనంటే దానిగుండ వెలుతురును గాలియును వచ్చును. అది గట్టిగా బిగింపబడినపుడు దొంగల భయముండదు ఎక్కువగా వెలుతురు రావడము మంచిది. వెలుతురుచేతనే గదిలోపలనుండు గాలి శుభ్రపడుచుండును. బలముగలిగి ఆరోగ్యముగనుండవలెనంటే ప్రతి వానికిని తగినంత వెలుతురు అవసరముగానున్నది.

---

* పాంచాల దేశమందుండు పట్టణములలో దేశీయులందరును వారి ఇండ్ల కిటికీలకు ఇట్టి ఇనుప తెరను తరుచుగ నుపయోగింతురు. దీనిని వారు "లోహికి జాలి" అని పిలిచెదరు.

చీకటి గదులలోనుండి పనిచేయువా రెప్పుడును బలములేక పాలిపోయి రోగపీడితులుగ నుందురు."

ఇంటికి వెలుపల మట్టి మెట్లున్నవి. వాటిని ఎక్కి ఇంటి కప్పు మీదికి పోవచ్చును.

న్యాయాధికారి చెప్పినదేమనగా :—"ఇంటి కప్పుమీదికి పోవుటకు మెట్లుండుట మంచిది. సాయంకాలమునందు సుఖముగ కప్పుపైకి పోయి కూరుచుండి చల్లని గాలిని అనుభవింపవచ్చును. ఇదియునుగాక వరపులను పరపు గుడ్డలను తరుచుగా కప్పుమీద ఎండబెట్టి పరిశుభ్రము చేయుట కిది అవసరమైనదిగాకూడనున్నది. ఎందువల్లననగా మనుష్యుని చర్మమునుండివచ్చు చెమట అపరిశుద్ధమైనది. అది పరపులలోను గుడ్డలలోను నిలిచియుండిన యెడల అవి అపరిశుభ్రమగును. అందువలన ఆరోగ్యము చెడును. సూర్యునివలన కలుగు వెలుతురును వేడిమియును, అట్టి కల్మషములను కొట్టివేసి పేలను మిణ్ణల్లులను పారదోలును."

"ఇండ్లను కట్టుకొను విషయమును గురించి చట్టములేమైన ఉన్న యెడల వానిని చెప్పుము" అని యువరాజడిగెను.

న్యాయాధికారి ఇట్లు పలికెను :—"గ్రామసభవారి అనుమతిని పొందక ఎవరుగాని ఏ గ్రామమందును ఇండ్లు కట్టరాదు. ఎవరైనను ఇల్లు కట్టుకొనవలెనని కోరినపుడు ఆ పనికి గ్రామ సభవారి సెలవును పుచ్చుకొనవలెను. తాను కట్టనైయున్న మాదిరి సంగతివారితో చెప్ప వలెను. ఆ మాదిరి మంచిదిగా నున్నపుడు సభవారు వానికి ఇల్లు కట్టు కొనుటకు సెలవిచ్చెదరు."

న్యాయాధికారి యువరాజును ఆ గ్రామమందున్న అనేకములైన ఇండ్లకు తీసికొనిపోయెను. అవి అన్నియును మంచి మాదిరిని అనుసరించి కట్టబడి విశాలముగను, శుభ్రముగను గాలి వచ్చునవిగను ఉండెను. గ్రామమందును ఇండ్లయందును వీచెడు గాలి నిర్మలముగను, స్వచ్ఛముగను, వాసన రహితముగను ఉండెను.

న్యాయాధికారి ఇట్లు పలికెను :—"ఈ మహారాజు ఇండ్ల నిర్మాణమును గురించి ఈ చట్టములనుచేసి యుండని కాలమునందు ప్రజలు పనికి మాలిన మాదిరిని అనుసరించి ఇండ్లు కట్టుకొనుచుండిరి. అట్టి ఇండ్లు కిటికీలు లేక చీకటి మయములై ఉండెను. శుభ్రమైన గాలియు వెలు

తురును వచ్చుటకు వీలులేక ఉండెను. అందుండు మురికిగాలి పైకిపోవుచుండుటయును లేదు. తరుచుగా పశువులను కట్టుపాకలు ప్రత్యేకముగ ఉండినవిగావు. ధాన్యపుగాదెలకును వేరు స్థలములులేక ఉండినవి. అట్టి పనికిమాలిన ఇండ్లలో మనుష్యులును పశువులును ఏకముగ నిద్రించుచుండెడివారు. అచ్చటి గాలి పూర్తిగ చెడి ఎక్కువ అనారోగ్యమునకు కారణమగుచుండెను."

"ఈ మహారాజు చేసిన మంచి చట్టములవలన అంతయును మారినది. ఈ చట్టముల ప్రకారము నడచుకొనుట ప్రజలకొక కష్టముగ లేదు. ఎందుచేతననగా పనికిమాలిన మాదిరిని అనుసరించి ఇండ్లను కట్టుటకు పట్టు ధనముకంటెను కూలికంటెను మంచిమాదిరి ఇండ్లకు ఎక్కువపట్టదు. అధిక ధనము వెచ్చించి పనికిమాలిన మాదిరిని అనుసరించి కట్టిన గొప్ప ఇంటిలో నుండుటకంటె, చవుకగా మంచిమాదిరిని కట్టబడిన సామాన్యపు ఇంటిలోనుండుటయే మనుష్యునకు ఎక్కువ మేలును కలుగజేయును."

---

4 వ ప్రకరణము.

[గ్రామమునంతటిని పరిశుభ్రముగ ఉంచు విధము. ఈగలు వృద్ధిపొందు విధము. అపరిశుభ్రమగు గాలివలన కలుగు వ్యాధులు. ఈగలవలన కలుగు వ్యాధులు.]

అపుడు న్యాయాధికారి యువరాజును గ్రామములోని వీధుల వెంబడి తీసికొనిపోయి తినుబండారములును కాయగూరలును అమ్ము దుకాణములను చూపెను. అన్ని వైపులను వీధులు పరిశుభ్రముగానుండెను. అచ్చట మురికి, పెంట, చెత్త మొదలగునవి ఏవియును లేవు.

"న్యాయాధికారీ! ఈ గ్రామములందలి వీధులింత పరిశుభ్రముగానుంచుటకు నిశ్చయముగ అధికమైన శ్రమయును, ఆయాసమును పడవలసియుండునుగదా" అని యువరాజనెను.

న్యాయాధికారి ఇట్లు ఉత్తరము చెప్పెను:—"అట్లింతమాత్రమును గాదు. ప్రతి గ్రామమును దినమున కొకసారి ఊడ్చెదరు. అందువలన వీధులనన్నిటిని పరిశుభ్రముగానుంచుటకు అధికమైన శ్రమగాని ఆయాసముగాని పడవలసిన అవసరములేదు. ప్రతి దినమందున తీసివేయబడు మురికి, పెంట, చెత్త మొదలగునవి అంత విశేషముగానుండవు.

అనేక దినములవరకును తీయక పెరగనిచ్చినయెడల వీటిని తీసివేయుటకు ఎక్కువ శ్రమ ప్రయాసములు కావలసియుండును."

యువరాజు ఇట్లు పలికెను:—"ఈ దేశమందు చూచిన గ్రామములలో ఒక సంగతి కనిపెట్టినాను. అది ఏమనగా—ఇప్పటికి వేసవికాలము కొంచెము మించు మించు ముగియనైయున్నను ఎచ్చటనుగాని ఈగలంతగా కనుపడవు మా తండ్రి దేశములోని గ్రామములలో ఈ కాలమందు కోట్లకొలది ఈగలు గుంపులు గుంపులుగ తిరుగుచుండును. వాటివలన కలుగు పీడ సహించుటకు సాధ్యముగానుండదు. ఓ న్యాయాధిపతీ! ఇది ఈగల కాలమైనను ఈ గ్రామములలో అవి అంతస్వల్పముగానుండుటకు కారణమేమో తెలియజెప్పుము."

న్యాయాధికారి ఇట్లు ఉత్తర మిచ్చెను:—"మా దేశమందున్న వైద్య శాస్త్రపండితులు ఈ గలీక్రింది విధమున వృద్ధి అగుచున్నవని మాకు తెలియ జెప్పినారు. కొంచెము చెమ్మగాను ఉష్ణముగాను ఉండు పెంటమీదనో చెత్త మీదనో ఆడు ఈగలు తమ గ్రుడ్లను చిన్న గుంపులు గుంపులుగ బెట్టును అట్టిది ఉష్ణకాలముగా నుండినయెడల త్వరలోనే ఈ చిన్న గుంపులలోని ప్రతి గ్రుడ్డునుండియును చిన్న కూనలు బయలు వెడలును. ఆ పెంటలోని వస్తువులచేతనే అవి పొట్టపోసికొని ఒకటి రెండు దినములలో ప్రతి కూనయును ఈగయొక్క ప్రమాణము గలిగినది అగును. ఈ జాతి కీటకముల విషయములో సామాన్యముగ సంభవించు రీతిని వీనిపై పొరలు పగులును. పై పొరలు పగులగానే లోపలినుండి పూర్తిగ పెరిగిన ఈగ వెలుపడును. పట్టు పురుగులును ఈ విధముననే మొదట పురుగులుగనుండి అటువెనుక చిమ్మటలవంటివి అగును. కాని వీటిలో ఈ మార్పు కొంచెము ఆలస్యముగా జరుగును. పట్టు పురుగులు ప్రమాణమున పెద్దవి అగుటచేతను ఈ మార్పును సులభముగ కనిపెట్టవచ్చును. ఈగలు చిన్నవిగా నుండుటచేత వీనిలోకూడ నిట్టి మార్పు జరుగుచుండుననియే సామాన్యముగ తెలియదు. ఈగలు కొంచెము తడిగాను ఉష్ణముగాను ఉండు పెంటలోను చెత్తలోనుగదా తమ గ్రుడ్లను పెట్టుచున్నవి! ఇట్టి చెత్తయును పెంటయును అన్నివైపులనుండినయెడల లెక్కలేని ఈగలు వాటిమీద పెరుగును. ఆ కారణముచేతనే మేము ఇట్టి పెంటను చెత్తను ఇతర కల్మషమును మా ఇండ్లనుండియును గ్రామముల నుండియును దూరముగ దీసికొనిపోయి పొలములలో

వేయుదుము. ఆ పాలములలో వాటిపైని కొంచెము మట్టికప్పియుంచి ఈగలు తమ గ్రుడ్లు నచ్చట పెట్టుటకు వీలులేనట్లు చేయుదుము. పాలము కాపులకు ఎరువు క్రింద పనికి వచ్చువరకును అవి అచ్చటనే ఉండును."

"ఈగలు మురుగునీటితో తడిసిన నేలమీదగూడ తమ గ్రుడ్లను పెట్టును. అందుచేతను ఈ గ్రామములలో మురుగు నీరు పోవుటకు కాల్వలు లేని స్థలములందు జనులు తమ ఇండ్లలోని మురుగు నీటిని ఒక తొట్టెలో పోయుదురు. తరువాత దీనిని తీసికొనిపోయి పాలములలో వేయుదురు. ఆ పాలములా మురుగు నీటిని వెంటనే పీల్చివేయును. ఈ విధముగ గ్రామములు ఈగల బాధలనుండి తొలగింపబడినవి."

"అంత స్వల్పముగ ఈగలుండుట నిజముగా ఎక్కువ సౌఖ్యకరమైన సంగతి" అని యువరాజనెను.

అందుపైని న్యాయాధికారి ఇట్లనెను :—"అది సౌఖ్యకరమైన విషయ మొకటి మాత్రమే కాదు. అందువలన ఆరోగ్యముగూడ సంరక్షింపబడుచున్నది. ఏమనగా—ఈగలు పెంట మీదను, చెత్త మీదను, ఇతర కల్మషము మీదనేగాక తిండి పదార్థములమీదగూడ వచ్చి చేరును. ఆ కల్మషము లన్నిటియందును వ్యాధులను పుట్టించు పురుగులుండును. ముఖ్యముగ నీళ్ల విరేచనములు, గ్రహణి విరేచనములు, కలరా అను వాటికి కారణములగు పురుగులు అందుండును. వానిపైని చేరు ఈగలకు కల్మషమేగాక దానితోపాటు అందుండు పురుగులుకూడ అంటుకొనును. అచటనుండి ఈగలు తిండి వస్తువులపై వ్రాలినపుడు ఇవి అన్నియును ఆహార ద్రవ్యములలో చేరును. ఆహార ద్రవ్యములు అందువలన చెడి అపరిశుద్ధమయి వ్యాధిని పుట్టించునవి అగును. రస్తాపైని నడిచి వచ్చినవాని పాదములకు అంటుండు దుమ్మును ధూళియును అంటుకొనును గదా! అట్టి మనుష్యుడు ఇంటి లోపలికి వచ్చినపుడు వాని పాదములనుండి కొంత దుమ్మును ధూళియును లోపల ప్రవేశించును. ఇదే విధముగ ఈగల విషయమును సంభవించుచున్నది. తరుచుగా ఈగలు మొదట చెత్తలోనుండి తరువాత పాలలోగాని మంచి నీళ్లలోగాని పడును. ఇందువలన ఆ పాలును నీరునుగూడ అపరిశుభ్రమగుచుండును. ఇట్లవి అపరిశుభ్రమై ఆరోగ్యమును చెరిచి ముఖ్యముగ కలరా, నీళ్ల విరేచనములు, గ్రహణి విరేచనములు అను రోగములకు కారణములగుచుండును."

"ఇంతియుగాక ఎవనిశరీరముమీదనైనను తెరచియున్న గాయమున్న యెడల ఈ యీగలు దానిమీద వ్రాలి అన్నివిధములగు కల్మషములను దానిలోనుంచి మలినముచేసి గాయమును త్వరలో కుదురనీయవు."

"ఇంకను చూడుడు. ఎవనికైనను కొంచెము కన్ను కలిగి నీరు కారుచుండవచ్చును. వెంటనే ఈగలు ఆ కంటిమీద చేరి అందులోనన్ని విధములగు మురికిని ఉంచును. ఇందువలన రోగము ప్రకోపించును. కన్ను రక్తముతో కంది ఎర్రబడును. కంటికి వేడి హెచ్చయి వాపు గలిగి బాధ ఎక్కువగును. తరుచుగా అట్టి సమయమున పుండ్లు లేచి దృష్టిని పోగొట్టుటకూడ కలదు."

"కావున అనుదినమును గ్రామమందున్న కల్మషములనన్నింటిని తీసివేసి సందులను ఆవరణములను పొడిగాను శుభ్రముగాను ఉంచుటవలన అక్కడనుండు గాలిపరిశుద్ధముగాను దుర్వాసనలేకుండగను ఉండుటయేగాక ఎక్కడనుగాని ఈగలు తమ గ్రుడ్లను పెట్టుటకు ఇరవుండదు."

"అపరిశుభ్రమైన గాలివలన గొంతుకకు సంబంధించినట్టియును ఊపిరితిత్తులకు సంబంధించినట్టియును రుగ్మతలు అనేకములు కలుగును. గొంతునొప్పి, జలుబు, దగ్గు, న్యూమోనియా జ్వరము, క్షయ వ్యాధి-మొదలగునవి అట్టివాటిలో కొన్నిగానున్నవి. గ్రామములోని గాలి శుభ్రముగానున్న యెడల ఈ రోగముల యొక్క బాధ చాలవరకు తగ్గిపోవును."

"కడ్లకలక, నీళ్ల విరేచనములు, గ్రహణి విరేచనములు, కలరా-ఇవి చాల మట్టుకు ఈగలవలననే కలుగుచున్నవి. గ్రామము శుభ్రముగానుండి ఈగలు అధికముగ లేక యుండిన యెడల ఈ వ్యాధులవలన బాధ చాలవరకు తొలగి పోవును."

యవరాజిట్లు పలికెను :—"అయ్యో! నా తండ్రి దేశములో ఈ వ్యాధులన్నియును సర్వ సామాన్యముగ వచ్చుచుండును. అట్లు రోగములు రావడము తమ కర్మమనియు వాటినుండితప్పించుకొనుట ఎవరికిని శక్యముగాదనియు అచ్చటి జనులు చెప్పుదురు. ఈ రోగములన్నియు తాము నలుదిశలను గ్రామమందు పారవేయు పెంట, చెత్త మొదలగు వాటిచేత కలుగుచుండునన్న జ్ఞానము వారికి లేదు."

న్యాయాధికారి ఇట్లు చెప్పెను :—"పూర్వ కాలమందు ఇక్కడను ప్రజలా విధముగనే అట్టి రోగములన్నియును తమ కర్మమువలన కలి

గెనని అనుకొనుచుండిరి. అయితే ఆకాలమున పాఠశాలలు లేవు. ఇప్పుడో ఈ దేశమందలి ప్రతి బిడ్డకును వ్రాయుటయును చదువుటయును నేర్పబడుచున్నది. బిడ్డలు చదువను వ్రాయను నేర్చినవెంటనే వారికి-"దైవ భక్తికి తరువాత పరిశుభ్రతయే" అను నీతి నేర్పబడుచున్నది. బడి చాలించి పోవు లోపల ప్రతి బిడ్డకును ఆరోగ్యమును గురించిన నియమములును నిబంధనములును అతి శ్రద్ధతో నేర్పబడును. సామాన్యమైన వ్యాధులకుండు ముఖ్యకారణములు వారికి తెలియును. అట్లు తెలిసికొనిన ప్రతివాడును అనారోగ్యము తన్ను చేరకుండ తానురక్షించుకొనగలిగియుండును."

---

5 వ ప్రకరణము.

[మన్యపు జ్వరము. క్వైనావలన మన్యపు జ్వరము తొలిగి పోవుట. క్వైనాను ఇచ్చువెట్టు - దట ఈ సింకోనా (క్వైనా) చెట్టు ఇండియాకువచ్చిన విధము. క్వైనా బిళ్లలు.]

యువరాజిట్లుపలికెను :—" ఈ కాలమున నా తండ్రి దేశమందలి జనులు మన్యపు జ్వరముచే చాల బాధపడుటయును వారిలో ననేకులు చనిపోవుటయును కలదు శీతోష్ణ స్థితియందును కాలమాన మందును నా తండ్రి దేశముతో తమ దేశము పోలియుండినను, ఇచ్చటనుండువారు మన్యపు జ్వరమువలన చచ్చుటగాని అధికముగ బాధపడుటగాని కనుపించదు."

న్యాయాధికారి ఇట్లు పలికెను :—" ఇక్కడనుండువారికి క్వైనాను పుచ్చుకొనిన యెడల ఇట్టిమరణము సంభవించదనియు మన్యపు జ్వరము దానివలన కుదురుననియు తెలిసియుండకపోయినచో వీరిలోననేకులును ఈ కాలమందు మన్యపు జ్వరముచేత చావవలసియుందురు. క్వైనా ఔషధమును కొనదలచిన వారికిని గ్గీతమైన ధరకు దానిని అమ్ముటకై ప్రతి గ్రామము నందును ఒక్క ఏజంటుండవలయునని మా మహారాజు శాసించియున్నాడు. సింకోనా చెట్టని పిలువబడు దాని బెరడునుండి ఈయౌషధము తయారు చేయబడుచున్నది. పూర్వకాలమందు దీని ధర చాల హెచ్చుగా నుండెను. ఎందువల్లననగా ఆ సింకోనాచెట్టు దక్షిణ అమెరికా ఖండములోని పెరూదేశమందు మాత్రమె ఉండి యుండెను. పెరూదేశము కడుదూరమున నుండుటచేత ఆ చెట్టు బెరడును పెట్టమీదను నీటి మీదను ఈ దేశమునకు తీసికొనివచ్చుటకు ఎక్కువధనము వ్యయ

పరచవలసియుండెను. అందుచేత చాలకాలము క్రిందట సుప్రసిద్ధురాలై మిగుల ఘనత వహించియున్న శ్రీ విక్టోరియా మహారాణిగారు ఆ మొక్కలను పెరూ దేశమునుండి తెచ్చి, ఇండియా దేశములోని పర్వత ప్రాంతమందలి అరణ్యములో నాటవలసినదని ఆజ్ఞాపించెను. అతి ప్రయాసము పైని ఇట్లు చేయబడెను. వివేకియగు మా మహారాజు ఈ మొక్కలను గొన్నింటిని తెప్పించెను. ఇపుడు మా దేశమందలి పర్వతభూములలో సింకోనాచెట్లు పెరుగు పెద్ద తోటలు గలవు*. ఈ చెట్ల బెరడును పొడిచేసి దానినుండి క్వైనానుతీసి మా మహారాజు పట్టణమునకు తీసికొనివత్తురు. ఆ పట్టణమందు కొన్ని యంత్రములు గలవు. వాటి సహాయముచేత క్వైనా బిళ్లలు తయారు చేయబడుచున్నవి. ఇందుచేత దాని ధర తగ్గుటకు కారణమైనది. ఎంతటి బీదవాడైనను తనకును తన కుటుంబమునకు పట్టు క్వైనానుకొని మన్యపు జ్వరమునుండి బాధకలుగకుండ రక్షించుకొనగలిగియున్నాడు."

"మా దేశమందుండు అనేకులకుకూడ క్వైనా మహిమచేత జ్వరము కుదురునని తెలియును. కాని మన్యపు జ్వరమువలన ఎంత బాధపడుచున్నను దానిని పుచ్చుకొనరు" అని యువరాజు పలికెను.

"మన్యపు జ్వరము పోవునని తెలిసియుండియును దానివలన అధికమైన బాధపడుచున్నప్పటికిని మీ దేశమందలి జనులు క్వైనాను పుచ్చుకొనకుండుటకు కారణమేమి" అని న్యాయాధికారి అనెను.

"అది ఉష్ణము చేయుననియు అందువలన జ్వరముచేత దేహము వేడి ఎక్కినపుడు దానిని తీసికొనుట మంచిదిగాదనియు మా దేశమందలి జనులు సామాన్యముగా చెప్పుదురు" అని యువరాజు పలికెను.

అందుపైని న్యాయాధికారి ఇట్లు పలికెను:—"జ్వరము వచ్చినపుడు క్వైనా వేడి చేయునని దానిని తీసికొనకూడదని చెప్పుట సబబుమాలిన సంగతిగా నున్నది. అది ఉష్ణము చేయనే చేయదు. ఒకవేళ ఉష్ణము చేసినను దానివలన జ్వరము కుదురుచున్నపుడు ఏమి హాని కలుగగలదు? ఎంత క్వైనాను తీసికొనినను మన్యపు జ్వరమువలన కలుగు ఉష్ణముకంటెను బాధకంటెను దానివలన ఏమియును ఎక్కువ తటస్థించదు."

---

* సిక్కిమ్ దేశమునందును నీలగిరి కొండలలోను సింకోనా తోటలు పెద్దవి గలవు.

"ఇంతియగాక పాలతో తీసికొనినప్పుడుగాని క్వైనావలన ప్రయోజన ముండదనియు అందుచేత పాలు లభించనపుడు దానిని తీసికొనజాలమనియు మా దేశపు జనులు చెప్పుదురు" అని యువరాజు పలికెను."

న్యాయాధికారి ఇట్లు పలికెను :—"పాలతో దానిని తీసికొనుట మంచిదే. పాలవలన దాహమును ఆకలియునుకూడ తీరును. అయినప్పటికిని పాలు దొరకని సమయమునందైనను క్వైనాను పుచ్చుకొనవచ్చును. పాలు లేకపోయినను జ్వరము తగ్గించు శక్తి క్వైనాకు పోనేరదు."

"మాము కడు బీదవాండ్రముగా నుడుటచేత క్వైనాను కొనలేమని కూడ ఇచ్చటివారు చెప్పుదురు" అని యువరాజు పలికెను. న్యాయాధికారి ఇట్లు పలికెను :—"ఎవడుగాని క్వైనాను కొనలేనంత బీదవాడుగానున్నానని చెప్పుమాటలలో సబబు కనుపడదు. మన్యపు జ్వరము వచ్చినపుడు క్వైనాను పుచ్చుకొనకుండువాడు అనేక వారములు జబ్బుపడియుండును. అందువలన తన పొలములో సగమువంతు బీడు పడియుండి పండుపంటలో సగము నష్టమగును. ఇంతకంటె అతడు ఒవేకియై కొన్ని డబ్బులు ఖర్చులుపెట్టి క్వైనానుకొని జ్వరమును పోగొట్టుకొని అంత ఫలసాయపు నష్టము రాకుండ జాగ్రత్త పడడా? మన్యపు జ్వరముయొక్క బాధను తీసివేయదగినటువంటియు ఫలసాయములో సగమును తిరిగి రాబట్టునటువంటియు, క్వైనాను కొనలేనంత బీదవాడుగా ఎట్టి కాపువాడైనను ఉండడు. నా వృత్తి న్యాయమును పరిపాలించు పనిగానున్నది. ఎవరైనను ఒక కాపువాని ఫలసాయములోని స్వల్పపు భాగమును గురించి అబద్ధపు దావాను తెచ్చినపుడు, ఆ కాపువాడు ఆ యబద్ధపు దావా ప్రకారము ఒప్పుకొని సొమ్ము ఇయ్యనే ఇయ్యడు. కాని దావా సంబంధమున ఎన్ని రూపాయలనైనను వ్యయపరుచును. ఇది అంతయును నాకు తెలిసిన విషయమే. చూడుడీ! మన్యపు జ్వరము వచ్చినయెడల చాలకాలము కాపువాడు పనిచేయలేక యుండును. అందుచేత తన పంటలో సగమువరకును నష్టమగును. ఇట్టి నష్టమును పోగొట్టునట్టి క్వైనా అవుషధమును కొంచెము సొమ్ము వ్యయపరచి కొనలేనని ఏ కాపువాడైనను ఎట్లు చెప్పగలడు?"

---

6 వ ప్రకరణము.

[గ్రుడ్డితనమును కలిగించు రెండు సామాన్య కారణములు. మశూచకము. టీకాల వలన మశూచకము తొలగిపోవును. రెండుసార్లు టీకాలను వేయవలెను. టీకాలకు రసమును తయారు చేయు విధము.]

యువరాజా న్యాయాధిపతి ఇంటిలో పలుదినములుండి ఆ దేశపు జనులకు అంతటి మేలును చేసిన ఆరోగ్య నిబంధనములను గురించియును చట్టములను గురించియును అనేక సంగతులు నేర్చుకొనెను.

ఒకనాడా యువరాజు ఇట్లు పలికెను :—" న్యాయాధిపతీ ! ఇన్ని నాళ్లు ఈ దేశమునందు తిరుగుచుంటినిగాని గ్రుడ్డివారంతగా నాకు కనుపడలేదు, సరేకదా మశూచకపు మచ్చలున్న వారే లేరు. గ్రుడ్డివారును మశూచకము పడినవారును మాదేశమునందు అధికముగ నున్నారు. ప్రతి గ్రామమునందును ఇట్టివారిని అనేకులను చూడవచ్చును. ఇకరడనట్టివారు లేక పోవుటకు కారణమేమో చెప్పుము ".

న్యాయాధిపతి ఇట్లు చెప్పెను:—" గ్రుడ్డితనము రెండు కారణముల చేత కలుగును. ఒకటి, కండ్ల కలక ; ఈగలు, మురికి వీటివలన అదిక కలుగును. రెండవ పెద్ద కారణము, మశూచకము. మా పట్టణములందును పల్లెలందును, ఈగలను కల్మషమును చేరనీయక నేత్ర రోగమును మాన్పుకొంటిమి. టీకాల మూలమున మశూచకమునుండి రక్షించుకొంటిమి. "

" మా దేశమందుకూడ చాలమంది బిడ్డలకు అనగా ప్రతి గ్రామములోని సగముకంటె ఎక్కువమందికి-టీకాలు వేయబడినది. అయినను మశూచకము అప్పుడప్పుడు వచ్చుచున్నది. కాని ఎన్నడును టీకాలు వేయించుకొననివారికి మశూచకము వచ్చుచుండును " అని యువరాజు పలికెను. న్యాయాధికారి ఇట్లు పలికెను :—" మా దేశములో ఒక చట్టముకలదు. దాని ప్రకారము పుట్టిన బిడ్డకు ఆరుమాసములలోపుగా టీకాలు వేయవలెను. తిరిగి ఆ బిడ్డకు రెండవసారి తొమ్మిది పది పండ్ల ప్రాయమున టీకాలు వేయవలెను. ఈ చట్టమును ఖచితముగా అమలులోనికి తీసికొనివచ్చిన పిదప మశూచకము బొత్తిగ అంతరించినది. "

" బిడ్డకు ఒకసారి టీకాలు వేసియుండిన చాలదా ఏమి ? " అని యువరాజడిగెను.

న్యాయాధికారి ఇట్లు ఉత్తరము చెప్పెను: —"మొట్టమొదట ఈ దేశమందు పిల్లలకు పుట్టగానే టీకాలు వేయించవలెనను నిబంధనము మాత్రమేగలదు. అట్లు టీకాలు వేయించుకొనిన పిల్లలకు బాల్యములో మశూచకము రాకయుండెను కాని వారు పెద్దలయినపుడు కొన్నివేళలందీజాడ్యము వచ్చుచుండెను. పసితనమందు వేసిన టీకాలవలన కలుగు ప్రయోజనము యావజ్జీవమును ఉండక పోవచ్చునని ఎంచి రెండవ తడవ పిల్లలకు తొమ్మిది పది ఏండ్ల ప్రాయమందు టీకాలు తిరిగి వేయబడుటకు ఏర్పాటుచేయబడినది. ఇట్లీ రెండు తడవలు టీకాలు వేయించుకొనినవారికి టీకాలయొక్క లాభము యావజ్జీవమును ఉండును".

"ఈ గ్రామములందలి బిడ్డలకు టీకాలు వేయుటకు కావలసిన రసము మీకు ఎక్కడనుండివచ్చును" అని యువరాజు అడిగెను

న్యాయాధికారి ఇట్లు బదులు చెప్పెను :—"టీకాలకు కావసిన రసము మా మహారాజు పట్టణమునందు తయారు చేయబడి గ్రామములకు గొట్టములలో పంపబడును. ఆ పట్టణమునకు నీవు పోయినపుడు అక్కడనుండు వైద్యశాస్త్రజ్ఞులు ఈ రసమును తయారు చేయుచున్న భవనమును చూపుదురు. ఆ భవనమందు గేదె దూడలకు టీకాలువేసి వాటి చర్మమునుండి ఈ రసము తీయబడుచుండును."*

---

7 వ ప్రకరణము.

[ఆరోగ్యమును గురించిన నిబంధనములు ఏ దేశమందున్న జనులకైనను మేలును చేయగలవు.]

ఇట్లు కొన్నినాళ్లుండి యువరాజు జ్ఞానియగు ఆ న్యాయాధిపతి యొక్క సెలవునుపొంది కొద్దిదినములలోనే మహారాజు పట్టణము చేరెను. అప్పుడా మహారాజు తన మంత్రులలో కొందరను పంపి అతనిని రావించి నివసించుటకు మంచి భవనమిచ్చి ఎక్కువ దయతో ఆదరించెను. మరునాడు అక్కడ గొప్ప దర్బారు జరిగినది. యువరాజు ఆ దర్బారుకుపోయి తన తండ్రి పంపిన కానుకలను ఆ మహారాజునకు అర్పించెను. తన దేశములోని జనులను రోగములు చాల పీడించుచున్నవనియు వాటి

---

* టీకాలకు కావలసిన రసమును తయారుచేయు శాలలు అనేకములు ఇండియాలో కలవు. చెన్నరాజధానిలో సైదాపేటకు సమీపమునందు ఉన్న గిండీ గ్రామమువద్ద ఇందు నిమిత్తమైన పెద్ద భవనము ఒకటి కలదు.

నుండివారు సంరక్షించుకొనగలుగునట్లు ఆరోగ్యము విషయమైన మంచి నిబంధనములను చేసి, వారికి వాటిని నేర్పుటకు తనకు సహాయపడగలిగిన వివేకియగు నొక వైద్యశాస్త్రజ్ఞుని పంపుమనియు కోరి తండ్రి వ్రాసి ఇచ్చిన జాబునుకూడ ఆ మహారాజునకు యువరాజు సమర్పించెను. అందుమీదట మహారాజు యువరాజు పైని ఎక్కువ అనుగ్రహము గలిగి తనవైద్య శిఖామణులను అందరను పిలువనంపి వారితో ఇట్లని పలికెను:—
"ఓ వైద్యశిఖామణులారా! అనేక సంవత్సరముల క్రిందట నా ప్రజల యొక్క ఆరోగ్యమును అభివృద్ధిపరచు నిమిత్తము మంచి చట్టములను చేసి అమలులో నుంచుటకు మీ సహాయమును పొందుటకై మిమ్ములను పిలిచితిని. పూర్వకాలమునందు నా దేశమందు మశూచకము ప్రబలియుండెను. జీవితకాలములో ఎప్పుడో ఒకప్పుడు మశూచకము పడక తప్పించుకొన్నవారు అపుడు అంతగా లేరు. నాలుగైదు పండ్లకు ఒక సారి ఘోరమైన మశూచకపు జాడ్యములు బయలుదేరి వ్యాపించుచుండెను. అప్పుడు నా ప్రజలు, ముఖ్యముగా చిన్న బిడ్డలు, మారి(దొమ్మ)* రోగమునకు పశువులు నశించినట్లు నశించుచుండిరి. ఇదియునుగాక మశూచకమువచ్చి కుదిరినవారిలో అనేకులు బలహీనులగుటయును, కురూపులగుటయును, యావజ్జీవము గ్రుడ్డివారగుటయును కూడ తటస్థించుచుండెను. మానవకోటిని పీడించుటయందు మశూచకమంతటి ఘోరమైన పీడ మరియొకటి లేదు. అయితే, ఓ శాస్త్రజ్ఞులారా! మానవకోటికి శాస్త్రములవలన కలిగిన మేళ్లలో శ్రేష్ఠమైనదని చెప్పబడు టీకాలపద్ధతిని ఇటీవల నా దేశములో మీరు అవలంబించితిరి. మశూచకము అంతరించినది. అందరకును రెండుసార్లు టీకాలు వేయబడియున్నవి. అప్పటినుండియును నా దేశమందుండు వారిలో ఒక్కనికైన మశూచకము వచ్చియుండలేదు".

"పూర్వపు దినములలో అతిభయంకరమైన కలరావ్యాధులు దేశమందు అంతటను వ్యాపించి, పిల్లలను పెద్దలను, బలహీనులను బలముగలవారిని, ధనవంతులను బీదవారిని, కూడ వేలకొలది నశింపుచేయుచుండెను. ఎవరికిగాని వాటిని తప్పించుకొను జ్ఞానమే లేక ఉండెను. అట్టి దురవస్థలో వారు ఆరోగములన్నియును తమకర్మమువలన కలుగుచుండెనని చెప్పుచుండిరి. ఓ! వైద్యశాస్త్రజ్ఞులారా! మీరువచ్చి ప్రజలకు కలరా ముఖ్యముగ చెడిపోయిన నీటివలన కలుగుచుండెనని బోధించితిరి. ప్రతిగ్రామమునందును శ్రేష్ఠమైన నూతుల నేర్పరచుటచేత నా దేశమందున్న జనులకు

* మారి అనగా పశువులలో బయలుదేరు అంటుజాడ్యమునకు పేరు.

ఈ కలరా రోగములబాధ చాలవరకు తగ్గినది. ఇప్పుడు గ్రామములో ఎవరికైనను కలరా తగిలినట్టయితే ఆరోగిని ప్రత్యేకముగా ఉంచి రోగియొక్క వాంతిభేదుల మూలమున వెలువడు అపరిశుభ్ర పదార్థములను నీటికిగాని ఆహార ద్రవ్యములకుగాని, పానపాత్రలకుగాని వంటపాత్రలకుగాని అంటనీయక ఉంచినయెడల ఆ కలరారోగము ఇతరులకు వ్యాపించనేరదని అందరికిని తెలిసియున్నది. ఈప్రకారము మీరు బోధించుటవలన కలరా ఉపద్రవముయొక్క భయము సగము తగ్గినది. ”

“ ఇంతియగాక, పూర్వపుదినములలో వానకాలము రాగానే మన్యపుజ్వరము ప్రవేశించి నా దేశమందు అంతటను వ్యాపించుచుండెను. మన్యపుజ్వరము ఎక్కువగా ప్రబలిన సంవత్సరములలో కాపులు జబ్బుపడి తమ పొలములను దున్నుకొని వ్యవసాయము చేయలేకయుండిరి. అదియునుగాక ముసలివాండ్రలోను పిల్లలలోను అనేకులు మన్యపుజ్వరమువలన నశించుచుండిరి. అట్టి సంవత్సరములలో ఎంత అనారోగ్యము కలిగినదో ఎంతమంది చచ్చిఉండిరో కనుగొనుటకైన వీలులేని ఘోరనష్టము కలుగుచుండెను. వైద్యులారా! మీరువచ్చి నా దేశమునకు మన్యపుజ్వరమువలన నాశనమును చాలవరకు తగ్గించినారు ఇప్పుడు మీరు కొండలలో పెద్ద సింకోనా తోటలను పెంచినారు. పూర్వమందు క్వైనా ఔషధము చాలధరకలిగినదై ఉండెను. అందువలన మిక్కిలి ధనవంతులు మాత్రమే దానిని కొనగలిగియుండిరి. ఇప్పుడన్ననో ఎంతబీదవాడైనను కొద్దిపాటి సొమ్మునకు తనకును తనకుటుంబములోని వారికిని మన్యపుజ్వరమువలన బాధకలుగకుండుటకు తగిన క్వైనాను కొనగలిగియున్నాడు. బడులలో చదువుప్రతి బిడ్డకును క్వైనాను తీసికొనినయెడల మన్యపుజ్వరముయొక్క బాధపోవునను సంగతి తెలిసియున్నది. ”

“ ఇదియునుగాక ఇండ్లను గ్రామములను పరిశుభ్రముగా నుంచునట్లును అనుదినమును పెంట, చెత్త మొదలగు కల్మషములను దూరముగ పారవేయునట్లును మీరు ప్రజలకు బోధించి వారికి నీళ్ల విరేచనములు, గ్రహణి విరేచనములు, నేత్రరోగములు మొదలుగాగల అనేకములైన పీడలు రాకుండునట్లు చేసితిరి. పొడిగా ఉండునటువంటియు, గాలి బాగుగ ప్రసరించునటువంటియు, ఇండ్లలో నివసించుటచేతను, పరిశుభ్రమైన గాలిని పీల్చుటచేతను క్షయరోగము, రొమ్ముపడిశము, న్యూమోనియా జ్వరము అను ఊపిరితిత్తులకు సంబంధించిన జాడ్యములు గావని ప్రజలకు బోధించితిరి. ”

“ఈ సాధనములచేత అనేకులు రక్షింపబడినారు. ఘోరమైన పీడ మాన్పబడినది. నాప్రజలయొక్క దేహ దార్ఢ్యమును ఆరోగ్యమును బాగుబడినవి. వారు ఎక్కువ సౌఖ్యముగ జీవించుచున్నారు. ఇందువలన కదా ఇప్పుడు నాస్నేహితుడగు ఆ రాజు తనకుమారుని ఇట్టి సౌఖ్యములు ఏ విధమున కలిగినవో నేర్చుకొనిరమ్మని పంపినాడు. కావునమీరు యువ రాజును తీసికొనిపోయి ఆరోగ్యమును గురించిన నియమములను నిబంధన ములను బోధించి ఈ పట్టణమునందు ప్రజలయొక్క క్షేమమునకును ఆరో గ్యమునకును చేయబడిన దానిని అంతయును చూపుము.”

---

8 వ ప్రకరణము.

[పట్టణములో చప్టాచేయబడిన వీథులను ఏర్పరచి మురుగుకాల్వలకట్టి, వాటిని పరిశు భ్రముగా ఉంచువిధము. మురుగుకాల్వలను శుభ్రముగా ఉంచువిధము. ఇండ్లు ఒక దానిపైని ఒకటి క్రిక్కిరిసి ఉండరాదు. ఇండ్లయొక్క ముందుభాగమునకును వె నుకభాగమునకును మంచివెలుతురు రావలెను. వీథులు వెడల్పుగా నుండవలెను.]

వీథులు గోడిగా పెట్టిన ఇటికలతో చప్టాచేయబడినవి. ప్రతివీథికిని రెండు ప్రక్కలందును మురుగు కాల్వలున్నవి. పట్టణములో ఎత్తైన ప్రదేశములందుండు నూతులలోని నీరు ఎడ్లచే తోడబడి మురుగుకాల్వల లో పెట్టబడుచున్నది. ఆ నీరు మురుగుకాల్వలలో పారి వానిని కడిగి వేయుచున్నది. ఈ మురుగుకాల్వలనుండి వచ్చు మురుగు నీరంతయును ఒక పెద్దమురుగు కాల్వలోచేరి పిదప అందుండి పట్టణమునకు దూరము గానున్న చెరువులలోకి పోవుచున్నది. ఈ చెరువులలో చేరు మురుగు నీరు * పారశీకపు చక్రములనబడు యంత్రములచేత ఒక పెద్దపొలము, లోకి తీసికొనిపోబడుచున్నది. ఈ పొలములలో పంటలను పండించుట వలన పట్టణ పరిపాలన సంఘము (మ్యూనిసిపల్) వారికి చాల లాభము కలుగుచున్నది పారశీకపు చక్రములను త్రిప్పుటకును, పట్టణమందలి పెంట చెత్త, మొదలైనవాటిని తీసికొనిపోవుటకును ఉపయోగింపబడుచున్న ఎడ్లను అన్నింటిని మేపుటకు కావలసిన వ్యయముకంటె ఎక్కువలాభ మునకు ఆపొలములోపంటలు పండింపబడుచుండెను. వీటిని అన్నింటిని కనుపరచుచున్న వైద్యశాస్త్రజ్ఞులను జూచి యువరాజు ఇట్లు పలికెను:—

---

* పారశీకపు చక్రమనగా పండ్లుగల పెద్దకర్ర చక్రములతో అమర్చబడిన ఒక యంత్రము. దీనిని ఎడ్లనుగాని, దున్నపోతులనుగాని కట్టి నూతులలోని నీటిని తోడించె దరు. ఇట్టి సాధనము పాంచాలదేశమందలి ఉత్తరజిల్లాలలో వాడుకచేయబడుచున్నది.

"పట్టణమందలి మురుగు నీటని చెత్తను తీసివేయుటకు ఈ ఉపాయము చాల సదుపాయమైనదిగానున్నది. అయితే ఈమురుగు కాల్వలన్నియు ను ఎప్పుడును క్రమమైన స్థితిలోనుండునా ?"

"వైద్యశాస్త్రజ్ఞులిట్లు పలికిరి :—"పీటిని మొదట నిర్మించినపుడు ఎక్కువ శ్రమకలిగినది. ఎందువల్లనంటే పరిశుభ్రము చేయబడక పోవుటచేత మురుగుకాల్వలన్నియును పూడిపోయి వాటినుండి దుర్వాసన బయలుదేరినది. కాని ఇప్పుడు మురుగుకాల్వలను నీటితో పరిశుభ్రము చేయుటకై మ్యూనిసిపల్ సంఘమువారు నీళ్ల మనుష్యులను పాకివాండ్రను నియమించినారు. ఒక్కొక్క నీళ్ల మనుష్యునకు మురుగుకాల్వలో కొంత హద్దువరకును ఇయ్యబడును. తనవాద్దులోపలి మురుగుకాల్వను వాడు నిత్యమును నీటితో కడుగవలెను. అటువలెనే ప్రతి పాకివానికిని కొంతభాగము నిర్ణయింపబడును. తనభాగమును తాను నిత్యమును ఊడ్చుచుండవలెను. ఈ విధముగా మురుగుకాల్వలన్నియును పరిశుభ్రముగాను, ఖాలీగాను, దుర్వాసన లేకుండునట్లును ఉంచబడినవి. ఇట్లు ఇవి పరిశుభ్రముగా ఉన్నపుడు పట్టణమందుండు మురికి, చెత్త, మురుగునీరు మొదలగునవి పూర్ణముగ వాటిమూలమున పోవుచుండుటకు వీలుగానుండును. అందుచేత వాటి నిమిత్తము వ్యయపరచబడు ద్రవ్యము సార్థకమైనది అగుచున్నది. నిత్యమును పీటిని నీటితోకడిగి పరిశుభ్రముగా ఊడ్వక పోయినచో అందు నిమిత్తము వెచ్చింపబడు ధనము వ్యర్థమగును. మురుగు కాల్వలను శ్రద్ధగాచూచుచున్నప్పుడు అవి పట్టణమందలి గాలిని నిర్మలముగా నుంచుటకు సాధనములగుచున్నవి. అందువలన పట్టణములోనుండు జనులకు అనారోగ్యము కలుగనేరదు."

"ఏ యుపాయములచేతను పట్టణమందలి చెత్త, పెంట మొదలగు వాటిని మీరు తీసివేయగలిగి యున్నారు ?" అని యువరాజడిగెను.

అందుమీదట వైద్యశాస్త్రజ్ఞులు ఇట్లు ఉత్తరముచెప్పిరి :—"పట్టణ మందలి చెత్త, పెంట మొదలగువాటిని విక్రయించి మ్యూనిసిపల్ వారు చాల ధనమును సంపాదించుచున్నారు. పాకివాండ్రు పీటిని ఊడ్చిపెట్టిన తరువాత ఇవి ఎడ్లమీదనో గాడిదెలమీదనో ఎడ్లబండ్లమీదనో పట్టణమునకు దూరముగా తీసికొనిపోబడి అచ్చట కాపులకు పొలముల ఎరువుగా అమ్మబడును. అట్లు అమ్మబడక ఉండువాటిని మ్యూనిసిపల్ వారి ఇటిక ఆవములో కాల్చివేయుదురు ఈ విధముగ వీధులలోని చెత్తచేయుటకు కావలసిన ఇటికలన్నియును తయారగుచున్నవి."

"నా తండ్రి దేశమందలి పట్టణములలో నివసించువారు అనేకులు
పాలిపోయిన దేహముగలిగి రోగులైయున్నారు. కాని ఇచ్చటనుండువారు
దేహదార్ఢ్యముగలిగి ఆరోగ్యము అనుభవించుచున్నారు" అని యువ
రాజనెను. అందుపైని వైద్యశాస్త్రజ్ఞులిట్లు పలికిరి:— "పెద్దపట్టణము
లలోని వీధులు సన్నముగానుండును. ఇండ్లుకూడ ఎత్తుగానుండి క్రిక్కిరిసి
ఒక దానిని అంటి మరియొకటియుండును. ఇట్టిస్థితి పట్టణములోనున్న జనులకు
క్షయరోగమునకు కారణమగుచుండును. ఈ పట్టణమును కట్టినపుడు
ఎక్కువ జాగ్రత్తతో వీధులు వెడల్పుగా ఉంచబడినవి. ఇదియునుగాక
వీధులకు మధ్యను తగినంత ఖాలియుంచబడినది. ఆ కారణమున ముందువై
పున వీధిని అంటియుండు ఇండ్లకును వెనకవైపున రెండవవీధిని అంటి
యుండుఇండ్లకును నడుమను ఆవరణములకును తోటలకును చాల స్థలము
ఉన్నది. ఇట్టిస్థితిగతులలో మాత్రమే ఇండ్లకు వెనుకభాగమునందుండు
గదులకు గాలియును వెలుతురును వచ్చుటకు వీలుగానుండును. ఇండ్ల
యొక్క ముందుభాగములకుకూడ తగినంత వెలుతురును గాలియును వచ్చు
నిమిత్తము ఒకపద్ధతి నియమింపబడినది అది ఏమనగా—ఎట్టివీధులలో
నైనను ఎత్తైన ఇండ్లను కట్టవలసినపుడు నడిశీత కాలమునందు మధ్యాహ్న
మున వాటినీడ వీధివెడల్పును అతిక్రమించి యుండరాదు. ఇందువలన వీధి
తూర్పు పశ్చిమములుగా ఉన్నను వీధికి దక్షిణపు ప్రక్కనుండు ఏ ఇం
టియొక్క నీడగాని నడిశీతకాలమున మధ్యాహ్న సమయమునందైనను
దానికి ఎదురుగా ఉత్తరపు ప్రక్కనుండు ఇంటిమీదికి ఎంతమాత్రమును
పోజాలదు."

---

9 వ ప్రకరణము.

[ఆసుపత్రులు. కండ్ల వ్యాధులు. కండ్లలోని పొరలు. మూత్రాశ్మరి లేక శిలారోగము. చర్మవ్యాధులు. ఆసుపత్రులవలన కలుగు లాభములు. ఆసుపత్రులలో చికిత్సను పూర్ణముగ పొందువిధము. క్వైనాచెట్టు హిందూదేశములోని పర్వతములందు పెంచబడుచున్నది. వెర్రికుక్కలచేత కరవబడినవారి చికిత్సకొరకు ఏర్పడిన ఆసుపత్రులు. క్వైనాబిళ్లలు. టీకాలనిమిత్తమైన రసము, డాక్టరు జెన్నరుగారు.]

అటుతర్వాత వైద్యశాస్త్రజ్ఞులు యువరాజును తీసికొనిపోయి పట్టణ
మందున్న ఆసుపత్రులను కనుపరచిరి:—నేత్రరోగముల చికిత్సకు ప్రత్యే
కముగా కట్టబడిన ఒక చక్కని ఆసుపత్రిని కనపరచి యువరాజుతో
వారు ఇట్లు చెప్పిరి:— "చల్లగానుండు కాలమున ఈ ఆసుపత్రికి దేశ
ముయొక్క అన్ని దిశలనుండియును లెక్కలేని రోగులు వత్తురు. అపుడు

ఇందు పనిచేయుచున్న ప్రజ్ఞావంతుడగు వైద్యుడు తరుచుగ ఒక్క నాటి ఉదయమునందు 50 మొదలు 60 మందకి కండ్లలోని పొరలను శస్త్రముచేసి తీసివేసి దృష్టిని చక్కపరచుట తటస్థించుచున్నది. ఈ నడుమను కొన్ని సంవత్సరములలోపలనే ఇక్కడనుండు వైద్యుడు పది వేలమందికైనను పొరలుతీసి కండ్లను బాగుపరచియున్నారు."

అటుపిమ్మట అన్ని విధములగు వ్యాధులను కుదుర్చుటకు ఏర్పరచబడి నటువంటి అనేకములైన ఆసుపత్రులను చూపి వైద్యులు యువరాజుతో ఇట్లనిరి :—"మొదట ఈ యాసుపత్రులను కట్టినపుడు ఇక్కడనుండు వారు మూఢులై ఉండి నాటివలన ఎక్కువలాభమును పొందలేకపోయిరి. వ్యాధి ప్రవేశించిన వెంటనే రోగిని ఆసుపత్రికి తీసికొనివచ్చుటకు మారుగా అవసానకాలము వచ్చువరకును ఊరకుండి వైద్యులేమియును చికిత్సచేయ జాలని అవస్థలోనున్నపుడు ఆసుపత్రికి వచ్చుచుండిరి. అట్టి రోగులు ఆసుపత్రికి పెందలకడ వచ్చియుండినయడల వారి రోగములు కుదిరిపోయి ఉండును. ఇదియునుగాక తరుచుగా రోగి ఆసుపత్రికివచ్చి "నేను చాల నెలలనుండి బాధపడుచున్నాను. నాకా బాధపోవుటకు ఏదయి నను ఔషధమును ఇమ్ము" అని చెప్పుట సర్వ సామాన్యముగా ఉం డెను. అతనికి వైద్యుడు రోగమునకు తగినమందు ఇచ్చి ఆమందుకా గానే తిరిగి రావలసినది అని చెప్పును. అయితే ఆ రోగి ఆ ఒక్క మోతాదును మాత్రము పుచ్చుకొని తనకు రోగము వెంటనే కుదుర లేదని తిరిగి మందు పుచ్చుకొనుటమానును. చాలనెలలనుండి బాధపడుచున్న వానికి ఒక దినములో రోగము కుదురవలెనని అనుకొనుట అసంగతమైన సంగతి. అనేకవారములవరకుగాని నెలలవరకుగాని అతడు మందును తీసికొనవలసియుండును. కాని యిప్పుడు జనులు చదువునేర్చినవారై ఈ సంగతులను అన్నిటిని తెలిసికొనియున్నారు. ఈ ఆసుపత్రులవలనకూడ వారికి మంచిలాభము కలుగుచున్నది."

"మూత్రాశ్మరి లేక శిలారోగమువలన బాధపడువారు అనేకులు ఈ ఆసుపత్రులకువచ్చి చికిత్సను పొందుచున్నారా?" అని యువరాజు అడిగెను.

అందుమీద వైద్య శాస్త్రజ్ఞులిట్లు చెప్పిరి :—"ఈ రోగము దేశములో సర్వ సామాన్యమైనదిగా ఉన్నది. కాని అది మిక్కిలి చక్కగ కుదుర్చబడుచున్నది. శిలారోగముచేత బాధపడుచున్న రోగి ఆసుపత్రికి

వచ్చినవెంటనే అతనికి క్లోరపారము యిచ్చి లోపలనుండు శిలను పిండి చేసి తీసివేయుదురు. కొద్ది దినములలోపలనే యీ రోగము పూర్ణముగ కుదిరి రోగియింటికి పోవును. అట్లు చేయకుండినయెడల రోగికి బాధ యావజ్జీవమును ఉండవలసియుండును. ఇంత బాధకరమగు వ్యాధి అంత సూక్ష్మముగ నివారింపబడుట గొప్ప భాగ్యముగా ఉన్నది."

"చర్మ రోగములచేత పీడింపబడువారు అనేకులు ఇక్కడికివచ్చి చికిత్సను పొందుదురా? నా తండ్రి దేశములోని జనులు చర్మవ్యాధుల వలన చాల బాధపడుచున్నారు" అని యువరాజు అనెను.

వైద్య శాస్త్రజ్ఞు లిట్లు బదులు చెప్పిరి:—"పూర్వ కాలమునందు ఇక్కడనుండు వారుకూడ చర్మవ్యాధులవలన ఎక్కువగా బాధపడుచుండెడివారు. వారు విద్యనేర్చిన తరువాత సబ్బును ఉపయోగించుచున్నారు. అందుచేత చర్మవ్యాధులు ఇప్పుడు సామాన్యముగా లేవు. పూర్వమందు సబ్బు చాల ఖరీదుగా నుండుటచేత కొద్ది మందిమాత్రమే ఉపయోగించుచుండిరి. ఇప్పుడు మహారాజు పట్టణములో సబ్బును తయారుచేయు యంత్రశాలలు అనేకములు కలవు. సబ్బు చాల చవుక అయినది. ఇప్పుడు దానిని మిక్కిలి బీదవాడైనను కొనగలడు. చర్మ వ్యాధు లన్నియును చర్మముమీద పెరుగు పురుగులవలన కలుగును. సబ్బు వలన ఆ పురుగులు చాలభాగము నశించును."

ఆ పట్టణమునకు కొన్ని దినముల ప్రయాణములోపలనే పర్వతము లున్నవి. కావున ఆ వైద్య శాస్త్రజ్ఞులు యువరాజును పర్వతములపైకి తీసికొనిపోయి అచ్చటనున్న పెద్ద సింకోనా తోటలను కనుపరిచిరి. ఈ సింకోనా చెట్ల బెరడునుండియే జనులకు మన్యపు జ్వరమును తగ్గించిన క్వైనా మందు తయారుచేయబడుచున్నది. ఆ పర్వతములలోని ఒక పట్టణమునందు ఉన్న ఆసుపత్రిని ఒకదానిని కనుపరిచిరి. దేశముయొక్క అన్ని వైపులనుండియును జనులు ఈ ఆసుపత్రికి వచ్చుచుండిరి. "ఈ ఆసుపత్రి ఏమి? ఇది కొండలలో నుండుటకు కారణ మేమి?" అని యువ రాజడిగెను.

వైద్య శాస్త్రజ్ఞు లిట్లు పలికిరి:—"వెర్రి కుక్కలు లేక నక్కలు మనుష్యులను కరచినపుడు వారు ఇక్కడికి చికిత్స నిమిత్తము వచ్చెదరు. మిగుల చల్లగానుండు స్థలమందుగాని అట్టి రోగములకు కావలసిన మందును తయారుచేయుటకు వీలు లేదు. ఆ కారణముచేత ఈ ఆసుపత్రి

కొండలలో ఉండుటకు కారణమైనది. వెఱ్ఱికుక్క కరిచినవానికి కుక్క వెఱ్ఱివచ్చు ఉపద్రవముకలదు. పూర్వమందు వెఱ్ఱికుక్క కరిచినవానికి కుక్క వెఱ్ఱి రాకుండచేయుటకు మార్గమే లేకపోయెను. కాని 'పాశ్చర్' అను గొప్ప ఐరోపీయ వైద్యుడు కుక్క, నక్క లేక యిట్టి యితర జంతువులు కరిచినవానికి వాటి వెఱ్ఱి కలుగకుండుటకు అద్భుతమైన చికిత్సను కనిపెట్టినాడు. గొప్పదేశము లన్నిటిలోను ఇప్పుడు ఇట్టి ఆసుపత్రులుగలవు. ఆ మహా వైద్యుని పేరుపెట్టి వాటిని 'పాశ్చర్' ఆసుపత్రులని పిలిచెదరు. *

అటుతరువాత యువరాజు మహారాజు పట్టణమును చేరెను. అట్లు చేరినవెంటనే వైద్య శాస్త్రజ్ఞులు క్వైనా బిళ్లలను తయారుచేయునట్టి యంత్రములను అతనికి కనుపరిచిరి. ఈ బిళ్లలను పొట్లములలో కట్టి ప్రతి గ్రామమందును ఉండు ఏజంట్లకు పంపుదురు. †

అటుతరువాత వైద్య శాస్త్రజ్ఞులు యువరాజును టీకాలకు రసమును తయారుచేయు భవనమునకు తీసికొనిపోయిరి. ఆ భవనముయొక్క గదులలో ఒక గోడమీదను ఒకానొక మనుష్యుని చిత్రపటమున్నది.

"ఈ చిత్రపట మెవరిదై ఉన్నదో చెప్పుము" అని యువరాజనెను. వైద్యశాస్త్రజ్ఞు లిట్లు ఉత్తరము చెప్పిరి:—"ఈ పటము సుప్రసిద్ధుడైనఆంగ్లేయ వైద్య శిఖామణిఅగు 'జెన్నరు' గారిది. ఆయన తన ప్రజ్ఞచేతను పాండిత్యముచేతను పూనికవలనను టీకాల పద్ధతిని కనిపెట్టి మానవకోటికి మశూచకపు బాధ అంతరించు మార్గమును నేర్పినాడు."

అపుడు వారు భవనము లోపలికి పోయిరి. అచ్చట గేదెదూడలకు మొదట టీకాలువేసి వాటి చర్మమునుండి రసము ఏ విధముగా తీయబడు

---

* వెఱ్ఱికుక్కలచేత కరవబడినవారి చికిత్సకు గొప్పదేశము లన్నిటిలోను "పాశ్చర్" ఆసుపత్రులుగలవు. పాంచాలదేశమునకు 'కాసౌలీ' లో ఒకటిఉన్నది. చెన్న రాజధానికి 'కూనూరు' లో ఒకటి ఉన్నది. వెఱ్ఱికుక్కచేత కరవబడిన వెంటనే గాయముమీద చురక పెట్టించుకొనవలెను. అటుమీదట సాధ్యమైనంతత్వరలో 'కూనూరు' లో ఉన్న 'పాశ్చర్' ఆసుపత్రికి పోవలెను. వారు మిక్కిలి బీదలుగా ఉండి 'కూనూరు' నకు పోజాలనపుడు దగ్గరనుండు మేజిస్ట్రేటు వారికిగాని ఇతర గవర్నమెంటు ఆఫీసరునకుగాని కనుపడి చెప్పుకొనవలెను. ఇట్టి చికిత్సకొరకు 'కూనూరు' నకు పోజాలని బీదవారికి కొంతధనమును ఇచ్చుటకు వారికి అధికారమియ్యబడినది.

† లాహోరు పట్టణమందు క్వైనాబిళ్లలను చేయుటకు ఒక యంత్రము గలదు. జ్వరమువచ్చు దినములలో దానితో బిళ్లలను తయారుచేసి దేశమంతటికిని పంపుదురు.

చున్నదో వారు చూచిరి. ఈ రసమును పూర్ణముగ పరిశుభ్రపరిచి నిర్మలమైన ద్రవ్యముగ చేయు పద్ధతిని, దానిని తయారుచేసి నిలువచేయుటకు ఉపయోగించు పలిముట్లను గొట్టములను ఉష్ణముచేత శుద్ధముచేయు మార్గమును, కూడ చూచిరి. ఇట్లు అన్ని సంగతులను గ్రహించిన తరువాత యువరాజు తన తండ్రిదేశమునకు ప్రయాణమై పోవుటకు సిద్ధపడెను. అప్పుడు మహారాజు వానిని బిలువనంపి అతని తండ్రికి అనేకమైన కానుకలను ఇచ్చి యీ క్రింది విధముగా పలికెను.—"కొలదికాలములోపలనే మీ దేశపు జనుల ఆరోగ్యమును చక్కపరచుటకై మంచి చట్టములను చేయుటయందు నీ తండ్రికి సహాయపడగలిగిన ఒక వైద్యుని నేను పంపెదను. ఆ వైద్యునికి మీ దేశపు జనుల స్థితిగతులు బాగుగ తెలియునిమిత్తమై అతడు వర్తకుని వేషముధరించి మీ దేశమునకు వచ్చి తుదకు నీ తండ్రికిమాత్రమే నిజరూపమున కనుపడును. నేను అతనికి ఈ ముద్ర నిచ్చెదను. ఆ ముద్రపైని ఈ క్రిందిమాటలు ఉండును. 'రోగము, మరణము, ఇవి అంధకారమునకును మురికికిని పుట్టిన బిడ్డలు. ఆరోగ్యము దీర్ఘాయువు ఇవి వెలుతురునకును పరిశుభ్రతకును పుట్టిన బిడ్డలు.' ఈ ముద్రను నీ తండ్రికి ఇతడు కనుపరిచినపుడు ఇతడే నేను పంపిన వైద్యుడని ఎరుగుము."

యువరాజు అంతట మహారాజుయొక్క సెలవు తీసికొని తన తండ్రిదేశమునకు పోయెను. తన తండ్రి దేశముగుండ మరలిపోవునపుడు ప్రజలు ఇంత అనారోగ్యముకలిగి రోగపీడితులుగ ఉన్నారుగదాయని అతని హృదయము విచారముతో నిండి ఉండెను. ఇప్పుడు అతనికి ఈ అనారోగ్యమంతయును ఉండ తగనిది అని తెలిసినది. అనారోగ్యమును నశింపుచేయునట్టి ఆరోగ్యమును గురించిన సూక్ష్మ విషయములు ప్రజలకు తెలిసియుండిన యెడల ఈ బాధ అంతయును తగ్గిపోయి ఉండుననికూడ అతనికి తెలిసియున్నది.

అతడు స్వదేశమును చేరగానే తండ్రితో తానా దేశమున జూచిన దానిని అంతయును చెప్పెను. అచ్చట ఏయే ఉపాయములచేత మాన్పబడగల రోగములు మాన్పబడినవో, ఏయే విధమున ప్రజలయొక్క ఆరోగ్యము వృద్ధి పరచబడినదో దీనిని అంతయునుకూడ తండ్రితో చెప్పెను.

ఆ మహారాజు త్వరలోనే ప్రాజ్ఞులగు తన వైద్యశాస్త్రజ్ఞులలో ఒకనిని పంపగలడనియు, ఆ శాస్త్రజ్ఞుని సహాయమువలన తాను చట్టము

లను పర్పరచి మాన్పదగిన వ్యాధులను మాన్పించి ప్రజలయొక్క ఆరోగ్య మును వృద్ధిచేయగలిగియుండుననియు యువరాజు తండ్రితో చెప్పెను. ఆ వైద్య శాస్త్రజ్ఞుడువచ్చి సులభమైన ఆరోగ్య నియమములను ప్రజలకు నేర్పి వారికి వ్యాధులవలన కలుగు పీడవదలి పోవునట్లును ఆరోగ్యము అల వడునట్లును చేయగలడని కూడ చెప్పెను. మరియు ఆ వైద్య శిఖామణి మహారాజు ఇచ్చిన ముద్రను ఒక దాగిని చూపి తనకు అగపడెననియు, ఆ ముద్రమీద ఈ క్రిందిమాటలు ఉండుననియు యువరాజు తన తండ్రితో చెప్పెను :—"రోగము, మరణము, ఇవి అంధకారమునకును మురికికిని పుట్టిన బిడ్డలు. ఆరోగ్యము, దీర్ఘాయువు, ఇవి వెలుతురునకును పరిశు భ్రతకును పుట్టిన బిడ్డలు."

---

10 వ ప్రకరణము.

[అపరిశుద్ధమైన నీటిని త్రాగుట వలన కలుగు అపాయము. అపరిశుద్ధమైన గాలిని పీల్చినందువలన కలుగు అపాయము. వ్యాధులు కర్మమువలనరావు]

ఇట్లు జరిగిన చాలవారములకు ఆ రాజు దేశములో ఒకానొక గ్రామము చెంతను ఒకనాడు తనగేదెలను దున్నలను కాపువాడొకడు కాచుకొనుచుండెను. అది శీతకాలము. మధ్యాహ్న సమయమైనందున వాడు తన పశువులను దగ్గరనుండు కొలనువద్దకు నీరు పెట్టుటకు తీసికొని పోయెను. ఆ ప్రక్కను కొందరు ఆడువాండ్రు బట్టలను ఉతుకుకొను చున్నారు. కాపువాడు తన పశువులకు నీరు పెట్టుచుండగా ఆ మార్గ మమీదుగా ఒక బాటసారి కంచర గాడిదెపైని వర్తకపు సరకులను వేసి కొని పోవుచుండెను. కొలను సమీపమునందున్న చెట్టునీడను ఆ బాటసారి కొంచెముసేపు దిగి విశ్రమించుచుండెను. తన పశువులకు నీరుపెట్టు కొని కాపువాడు ఆ బాటసారి దగ్గరకుపోయి నీవెక్కడికి పోవుచున్నావని అడిగెను.

"నేను మీరాజు పట్టణమునకు వెళ్లుచున్నాను. ఈ రాత్రికి అ క్కడ చేరగలనేమో దయచేసి చెప్పుము" అని బాటసారి పలికెను.

కాపువాడిట్లు పలికెను :—"ఇప్పుడు మధ్యాహ్నము దాటినది. రాత్రి పడకమునుపు నీవుఅచ్చటికి పోజాలవు. నా మాటలు విని ఈ రాత్రికి నాయింటిలోనుండి ఉదయముననే లేచి సుఖముగా ప్రయాణమై పొమ్ము"

"అట్లుచేయుట నాకు సంతోషముగానున్నది. నీవు నాయందు చాల దయగానున్నావు. ఉదయము మొదలు ప్రయాణము చేయుచున్నాను. నాకిప్పుడు దాహముగానున్నది. త్రాగుటకు నీరెకక్కడ దొరకునో చెప్పుము" అని బాటసారి పలికెను.

"ఈ కొలనిలోనుండు నీటినే గ్రామమందున్న మేమందరమును త్రాగుచున్నాము" అని కాపువాడు చెప్పెను

అందుపైని బాటసారి చెప్పినది ఏమనగా:—"ఈ కొలనిలో మీరు పశువులకు నీరు పెట్టుచున్నారు. బట్టలనుకూడ దీనిలోనే ఉతుకు కొనుచున్నారు. ఈ విధముగా నీరంతయు అపరిశుభ్రమయి అధికమైన రోగ పీడకు కారణమగుచుండవలయును. ఇట్టి నీరు పశువులకు మాత్రమే పనికివచ్చును."

"పెక్క తరములనుండి మేము ఈ నీటినే త్రాగుచున్నాము దీని వలన మాకు రోగము లేమియును వచ్చియుండలేదు" అని కాపువాడనెను.

"కలరా, నీళ్ల విరేచనములు, గ్రహణి విరేచనములు, నారి కురుపు మొదలగు జాడ్యములు ఈ గ్రామమందలి జనులకు రావడము లేదా ఏమి?" అని బాటసారి పలికెను.

"అవును, నిశ్చయమే; ఇచ్చటి జనులు ఆ జాడ్యములన్నిటివలనను బాధపడుచున్నారు" అని కాపువాడు పలికెను.

"కాని ఈ గ్రామమందున్నవారు పశువుల మూలమునను మురికి గుడ్డలు ఉతుకుటవలనను అపరిశుభ్రపరచబడని నీటిని త్రాగినయెడల కలరా, అతి విరేచనములు, గ్రహణి విరేచనములు, నారి కురుపు మొదలుగాగల జాడ్యములు వారికి రాకపోయియుండును" అని బాటసారి పలికెను.

"ఆ రోగములు రావలసిన విధి ఉన్నపుడు వాటి ఋతువులలో అవి వచ్చుచుండును. అవి విధివశమున వచ్చుచున్నవిగాని మరియొకటికాదు. అట్టి రోగములు రాకుండ మనుష్యుడెట్లు తప్పించుకొనగలిగియుండును!" అని కాపువాడు పలికెను.

"విధి వశముచేత కలుగు జాడ్యము ఏదియును లేదు. అన్నిటికిని కారణములున్నవి. ఆ కారణములను తెలిసికొన్నవాడు వాటిని రాకుండజేసికొనగలడు" అని బాటసారి చెప్పెను.

కాపువాడు ఇట్లు చెప్పెను :—" అట్టి మాటలలో నాకు నమ్మకము లేదు. అన్ని రోగములును విధి వశముగానే ఉన్నవి. అట్లయినపుడు మనుష్యుడు వాటినుండి తప్పించుకొనజాలడు. ఏదైనను కానిమ్ము. నీవు ఈ నీటిని త్రాగుటకు ఇష్టపడియుండలేదు. కావున ఈ గ్రామము నకు కొంచెముదూరములోనున్న పరిశుద్ధమైన మంచినీటి బావినుండి నా కొమార్తెనుపంపి నీకొక పాత్రతో నీరు తెప్పించెదను. ఈ కొలని లోని నీటిని మేము త్రాగుచున్నాము. అది మాకు ఇష్టముగానున్నది. నీకు ఇష్టము లేనపుడు నీవు దానిని ఎందుకు త్రాగవలెను ?".

ఇట్లు చేసినందునకై కాపువానికి బాటసారి వందనములు అర్పించి ప్రొద్దుపోవుచున్నందున వారు ఇరువురు పశువులను వెంటబెట్టుకొని ఇంటికి పోయిరి.

అది శీతకాలముగా నుండుటచేత కాపువాడు తన పశువులను ఇంటి లోపలికి తోలుకొనిపోయి తాను తన కుటుంబమును నివసించునటు వంటియు నిద్రించునటువంటియు గది మూలలో వాటిని కట్టివేసెను.

ఇందుపైని బాటసారి ఇట్లు పలికెను :—" పశువులచేత అపరిశు ద్ధము చేయబడిన గాలిని పీల్చుచు పశువులుండు స్థలమునందే మీరు నిద్రిం చుచున్నారు. నిశ్చయముగ మీకు ఈ పని చాల వ్యాధులు కలుగు టకు కారణమయి ఉండవలెను. ఈ గదిలోని గాలి పశువులకు పనికి వచ్చునుగాని మనుష్యులు పీల్చుటకు పనికిరాదు."

కాపువాడిట్లుచెప్పెను :—" ఇట్లు పశువులుండు చోటుననే నివసిం చుట మాకు వాడుకగానున్నది. ఇందు మూలమున వ్యాధులు కలుగు టకు కారణముండునని నాకెంతమాత్రమును తోచదు. వ్యాధులు విధి వశముచేతనే కలుగుచున్నవి. ఆ సంగతి నీతో నేను ఇంతకు పూర్వమే చెప్పితిని."

అందు మీదట కాపువాడు పశువుల మేతకై గడ్డిని కొంచెము ధాన్యమును వేసి, తానును బాటసారియును భుజించుటకు కొంచెము రొట్టెను కొన్ని కాయకూరలను వండెను.

బాటసారి ఇట్లు పలికెను :—" నీ పశువులకు నీవు గడ్డిని వేయు చున్నావు. నీవు రొట్టెను కూరలను తయారు చేసికొనుచున్నావు పశువులకు ఆహారముగానుండు గడ్డిని నీవు తినవు."

"అందుపైని కాపువానికి నవ్వువచ్చి పెద్ద నవ్వునవ్వి ఇట్లు పలికెను :—ఏమీ! పశువులకు వేసినగడ్డిని నేను తిందునా? మనుష్యులు గడ్డిని తినినచో వ్యాధులు కలుగును. అందుపైని మరణము తప్పక సంభవించును. అట్టి గడ్డి పశువులకు మాత్రమే తగియున్నది."

తాను నవ్వవలసిన తరుణము ఇదియని బాటసారి బిగ్గరగా నవ్వి ఇట్లు పలికెను :—"ఇప్పుడేకదా నీవు వ్యాధులన్నియును విధి వశమని చెప్పినావు? పశువులకు మాత్రమే తగిన నీటిని మీరు త్రాగుచున్నారనియు అందువలన రోగములు కలుగుటకు కారణమగుచున్నదనియు నేను చెప్పినపుడు రోగములు విధికృతమని చెప్పినావు. తిరిగి పశువులకు తగిన గాలినే మీరు పీల్చుచున్నారు, అదియును రోగకారణముగా నుండునని చెప్పినపుడు నీవు రోగము కర్మముచేతనే వచ్చుచున్నదని చెప్పుచున్నావు కాని పశువులు తిను గడ్డిని మీరు తినెదరా అని యడిగినపుడు, అట్టిపని రోగమును పుట్టించి మరణమునుకూడ సంభవింపజేయునని చెప్పుచున్నావు. అందువలన రోగములన్నియును కర్మమువలననే కలుగుచున్నవని నీవు చెప్పుట ఎంతమాత్రమును సరిగా నుండలేదు."

అందుపైని కాపువాడు ఇట్లుపలికెను :—"అయినప్పటికిని వ్యాధులు విధికృతములనియు వాటిని మనుష్యుడు తప్పించుకొనలేడనియు నేను నమ్ముచున్నాను."

అందుమీద బాటసారి ఇట్లు పలికెను :—"మంచిది! స్నేహితుడా! నాకట్టి నమ్మకము ఎంతమాత్రమును లేదు. నేను చెప్పినమాటలు వినుము. మనుష్యుడు వ్యాధులనుండి తప్పించుకొనవలెనంటే, తాను తినవలసిన ఆహారమునుగురించి జాగ్రత్త తీసికొనుటయేగాక తాను త్రాగు నీటిని గురించియును, తాను పీల్చుగాలిని గురించియును తగిన శ్రద్ధను తీసికొనవలెను. వ్యాధులన్నియును కర్మమువలన కలుగునను నీ నమ్మకమును నేను పోగొట్టతలచుకొనలేదు. కాని ఒకసంగతిని మాత్రము చెప్పెదను. మీ రాజు త్వరలోనే దేశమందంతటను బడులను స్థాపించును. మీ పిల్లలకును, మనుమలకును మాత్రము వ్యాధులన్నియును విధి వశములను నమ్మకముండదు. పైగా వారికి తగిన జాగ్రత్తపడుటచేత వ్యాధులయొక్క బాధ చాలవరకు తగ్గునను నమ్మకముగూడ ఉండును."

ఆ కాపువాని బిడ్డలలో ఒకనికి ఒకకన్ను గ్రుడ్డిగా నుండుట జూచి బాటసారి అది ఎట్లు సంభవించెనని అడిగెను.

కాపువాడు ఇట్లు పలికెను :—“ అది ఈవిధమున ప్రారంభమైనది: మొదట కన్ను కొంచెముకలిగినది. కాని అందువలన ఎక్కువ బాధ కలుగలేదు. కనుక మేము అశ్రద్ధచేసితిమి. కొన్నివారములకు ఆవల కలక హెచ్చయి కంటిమీద పుండుపుట్టినది. వెంటనే బాధకూడ హెచ్చి కన్నువాచినది. అపుడు బిడ్డను రాజుపట్టణమందున్న ఆసుపత్రికి తీసికొనిపోతిమి. అక్కడ వైద్యుడు కంటికి కడుగుటకు మందు నీళ్లనిచ్చి అవి కాగానె తిరిగి రమ్మని చెప్పెను. మందు నీళ్లను ఒకసారి ఉపయోగించితిమి. అందుమీదట కన్ను కుదుర లేదని ఆ మందునీళ్లు వాడుట మానితిమి.”

బాటసారి ఇట్లుపలికెను :— “అనేకవారముల వరకును ఉండిన కంటి బాధ ఒక్కసారి మందునీళ్లను ఉపయోగించి నంతమాత్రమున కుదురు గనని నీవు నిజముగ తలచియుండవు. కంటికి చాలకాలమునుండి ఉన్న బాధ అనేకదినముల చికిత్సచేతనుగాని కుదురదు. ఇంతకు కొంచెము ముందుగా బిడ్డను ఆసుపత్రికి తీసికొనిపోయి ఉండినయెడలగాని, అచ్చటి వైద్యులు నియమించిన చికిత్సను మానక చేసి యుండినయెడలగాని, బిడ్డకు గ్రుడ్డితనము తప్పిపోయియుండును. అందునకు సందియము లేదు.”

ఉదియమునందే బాటసారి లేచి అంత ఆదరణమును కనుపరచినందులకు కాపువానికి వందనములిచ్చి రాజుపట్టణమునకు పయనమై పోయెను.

బాటసారి వెళ్లిన తరువాత కాపువాడు గ్రామాధికారిని కలిసికొనెను.

గ్రామాధికారి ఇట్లు అడిగెను :—“ నిన్నరాత్రి నీ యింటివద్ద ఆగినటువంటి బాటసారి ఎవరు ?”

“ అతడు ఎవడో నాకు తెలియదు. కాని అతడు బహు విచిత్రమైన మనుష్యుడు: ఎందువల్లననగా వ్యాధులన్నియును విధికృతములుగావని చెప్పినాడు” అని కాపువాడు చెప్పెను.

గ్రామాధికారి ఇట్లుచెప్పెను :—“ ఆ లాగు వాడు చెప్పియుండినయెడల అతనికి పిచ్చిపట్టి ఉండవచ్చును. నేను ఇప్పుడే తొందరగా రాజుపట్టణమునకుపోయి పిచ్చివాడుగానుండు ఎవడో పట్టణమును చేరినాడని ప్రధానితో చెప్పివచ్చెదను.”

ప్రధాని గ్రామాధికారివలన ఈ సంగతిని విని వినోదమునొంది వెంటనే రాజుతోపోయి చెప్పెను. అప్పుడు రాజు “ ఆతడు ఎవడో

ఎందుండివచ్చినాడో కనుగొనెదము. వానిని వెంటనే రప్పింపుము” అని చెప్పెను.

బాటసారి రాజు సముఖమునకువచ్చి ప్రొమొక్కి ముద్రను చూపెను. అంతట రాజు ఆ ముద్రను తీసికొని దానిపయిని “రోగము, మరణము, ఇవి అంధకారమునకును మురికికిని పుట్టిన బిడ్డలు ; ఆరోగ్యము, దీర్ఘాయువు, ఇవి వెలుతురునకును పరిశుభ్రతకును పుట్టిన బిడ్డలు” అనుమాటలను చూచెను.

ఈ మాటలను చదువగానే రాజు చాల సంతసించి తన దేశములోని జనుల ఆరోగ్యమునుగురించి నిబంధనములను చేయుటకు తనకు సహాయముచేయుటకై ఆ మహారాజుపంపిన వైద్యుడీ బాటసారియని గ్రహించెను. అతనిని మిక్కిలి గౌరవముతో ఆదరించి అతనిబసకు తగిన ఇంటిని సిద్ధముచేయుటకును అతనిని సేవించుటకు తగిన నవుకర్లను ఉంచుటకును ఆజ్ఞనిచ్చెను.

---

11 వ ప్రకరణము.

[మన్యపు జ్వరము. అది పుట్టుకారణములు రక్తమందలి పురుగులు. మన్యపు జ్వరము దోమలవలన కలుగువిధము దోమలు వృద్ధిపొందు విధము. దోమలు వృద్ధికాకుండుటకు చేయవలసిన పనులు.]

వైద్యశాస్త్రజ్ఞుడిట్లు విశ్రమించిన తరువాత మరుసటి దినమున రాజు వానిని పిలువనంపి ఇట్లుపలికెను. వైద్యుడా! ప్రజలయొక్క ఆరోగ్యమును అభివృద్ధిపరచుటకై నేను ఏయే పనులను చేయవలసియుండునో చెప్పుము.”

వైద్యుడిట్లుపలికెను:—“రాజా! మొట్టమొదట మీ దేశపు ప్రజలను బాధించుచున్న జాడ్యములు ఎట్లు కలుగుచున్నవో మీరు చక్కగ తెలిసికొనవలెను. ఆ ప్రకారము వాటినిగురించి చక్కగ గ్రహించినంగాని అట్టి జాడ్యములు దేశమునందు వ్యాపించకుండునట్లు చట్టములను నియమములను చేయుటకు మీకు సమర్థత కలుగనేరదు. మీదేశపు ప్రజలుకూడ వారిని పీడించు జాడ్యములయొక్క కారణములను గురించి బాగుగ తెలిసికొనవలయును. అట్లు చక్కగ జాడ్యములయొక్క కారణములను తెలిసికొనినపుడే మీరు వాటిని అంతరింపచేయుటకు చేయునట్టి చట్టములను నియమములను వారు మెలకువతోను విధేయతగాను అనుస

రించి ప్రవర్తించగలుగుదురు. అప్పుడు ప్రజలకు మీరుచేయు నిబంధనములయొక్క ప్రయోజనమును గూర్చి ఉద్దేశమును తెలియగలరు. కావున మొదట మీతో ఈ జాడ్యములను గురించి ముచ్చటించెదను. నేజెప్పు దానిని మీదేశపు బడులలోకూడ బోధింపవలెను. ఈ దినమున మన్యపు జ్వరమునుగురించి ముచ్చటించెదను. ”

రాజు ఇట్లుపలికెను :—“ వైద్యుడా ! నీవు మొదట మన్యపు జ్వరమునుగురించి మాటలాడుట వివేకమయినపనిగానున్నది. ఎందువల్ల ననగా నా దేశములోని ప్రజలు చాలమంది మన్యపు జ్వరమువలన చనిపోవుచున్నారు. ఒకవేళ మరణము సంభవింపకపోయినను దానివలన బాధపడువారిలో లెక్క లేనివారు రోగపీడితులై వారివారి పనులను చేయలేక పోవుచున్నారు. ఈ మన్యపు జ్వరమునకు కారణమేమో నాకు చెప్పుము. ”

వైద్యుడిట్లు చెప్పెను :—“ వడ్లగింజలు పొలములలో పెరిగి ఏవిధమున పుట్లకొలది ధాన్యమును ఇచ్చుచున్నవో ఆ రీతిగనే కొన్ని పురుగులు రక్తమందుండి లెక్కలేక వృద్ధిచెందును. ఆ పురుగులవలననే ఈ జాడ్యము కలుగుచున్నది. ”

రాజు ఇట్లు పలికెను :—“ కాని ఎవరో ఒకరు విత్తులను జల్లినపుడుగాని పొలములలో ధాన్యముపండదు. రక్తమునకు ఈ పురుగులు ఎట్లు వచ్చుచున్నవో నాకు తెలియచెప్పుము. ”

“ ప్రథమమునందు దోమలవలన ఈ పురుగులలో కొన్ని మనుష్యుని రక్తములో ప్రవేశించుచున్నవి ” అని వైద్యుడు చెప్పెను.

“ దోమవలన ఈ పురుగులు మనుష్యుని రక్తములో ప్రవేశించుట ఎట్లు సంభవించుచున్నది ? ” అని రాజడిగెను.

“ మనుష్యుని దోమకుట్టినపుడు ఈ పురుగులు అతని రక్తములో ప్రవేశించును ” అని వైద్యుడు చెప్పెను.

“ దోమలు కుట్టుటచేతనే ఎట్టి మన్యపు జ్వరమైనను కలుగునని నీ యభిప్రాయమా ఏమి ? ” అని రాజనెను.

“ నాకు తెలిసినంతవరకు ఈ పురుగులను ప్రవేశపెట్టగల దోమలు కుట్టినపుడుగాని ఎవరికిని మన్యపుజ్వరము రానేరదు ” అని వైద్యుడు పలికెను.

“ అట్లయినయెడల, వందలకొలది దోమలుకుట్టినను ఒకానొక మనుష్యునికి మన్యపుజ్వరము రాకుండుటకు కారణమేమో చెప్పుము ” అని రాజు పలికెను.

వైద్యుడిట్లు పలికెను :—“ ఎందువల్లననగా అన్ని దోమలవలనను మన్యపుజ్వరము కలుగనేరదు. వాటిలో కొన్ని జాతులున్నవి. వాటి మూలముననే ఈ జాడ్యము కలుగును. అడవిలో ఎన్ని విధములయిన కాయలును మొక్కలును ఉండునో అన్ని వేర్వేరుజాతులు, ఈ దోమలలో గలవు. ఒకబిడ్డ అడవికిపోయి వివక్షలేక చెట్లమీద కనుపడిన కాయలను తినినపుడు అట్టి కాయలలో అపాయకరమైనవి లేకపోవుట చేత ఏమియును ఉపద్రవము కలుగకపోవచ్చును. కాని అడవికాయలలో విషముతో నిండినవి అనేకములు గలవు. వాటిలో ఒకదానిని తినినంత మాత్రముననే బిడ్డకు జాడ్యమువచ్చును. ఆవిధముననే ఒకానొక మనుష్యుని వందలకొలది దోమలు కుట్టునను వాటిలో మన్యపుజ్వరమును కలుగ జేయగల దోమలు లేకపోవుటచేత ఆజాడ్యము రాకపోవచ్చును. కాని మన్యపుజ్వరమును కలుగజేయగల దోమలలో ఒక్కటి అయినను కుట్టునపుడు ఆ మనుష్యునికి జాడ్యము రాకమానదు. ”

“ దోమలు కుట్టనివానికి మన్యపుజ్వరము రానేరాదా ఏమి ? ” అని రాజుపలికెను.

వైద్యుడిట్లు పలికెను :—“ దోమలులేని దేశమునందు పుట్టి అచ్చటనే నివసించువారికి మన్యపుజ్వరము ఎన్నటికినిరాదు. చూడుడీ ! మన్యపుజ్వరము అధికముగ గల దేశము ఒకటి ఇటాలియా దేశమందున్నది. ఈ జ్యాడ్యముయొక్క ఉత్పత్తికారణమును గురించిన నిజమును శోధించుచున్న ఇద్దరు వైద్యశాస్త్రజ్ఞులు ఆ దేశమున నివసించుటకు పోయిరి. ఆ జ్వరము రాకుండునట్లు ఈ క్రిందజెప్పబడు రక్షణమునుమాత్రమే అమర్చుకొనిరి. అది ఏమనగా—తాము నివసించుచున్నటువంటియు నిద్రించుచున్నటువంటియు ఇంటియొక్క ప్రతిద్వారమునకును, కిటికీకిని, సన్నని ఇనుపతీగలతో అల్లబడిన తెరలు అమర్చబడియున్నవి. దోమలుకుట్టని సమయములందు మాత్రమే వారు బయటికి వచ్చుచుండిరి. ఇంటిచుట్టును వేలకొలది దోమలుండినను లోపలికి అవి ఎంతమాత్రమును పోలేకయుండెను. ఈ వైద్యుల నిద్దరను దోమలెన్నడును కుట్టలేదు, వారికి జ్వరమును రాలేదు. కాని చుట్టుపట్ల నివసించుచున్న అందరకును మన్యపుజ్వరమువలన బాధ కలిగియుండెను. ”

"ఆ దేశమునవచ్చు మన్యపు జ్వరము దోమలు కుట్టుటచేతనే కలుగుచున్నదని ఆ వైద్యులు నిశ్చయపరచ గలిగియుండిరా?" అని రాజు పలికెను.

వైద్యు డిట్లు పలికెను :—"ఆ దేశమందుండు దోమలవలననే ఈ జ్వరము కలుగుచున్నదని వారు దృఢపరచ గలిగినారు. ఎందుచేతన నగా, ఆ దేశమును విడువక పూర్వము వారు. కొన్ని దోమలను పట్టి ఇనుప తీగెల పంజరములలో నుంచిరి. వీటిని పంజరములలో జీవించి యుండునట్లు చేసి ఇంగ్లాండునకు తీసికొనిపోయిరి. ఇంగ్లాండులో ఒక వైద్యుని అతని నవుకరును ఇవి కుట్టునట్లు ఏర్పాటుచేసిరి. అట్లు చేసినపుడు ఆ వైద్యుడును అతని నవుకరును తమ జీవితకాలమును ఇంగ్లాండులో గడిపినవారై ఉన్నను వారికి మన్యపు జ్వరము వచ్చినది."

"అయితే ఇంగ్లాండు దేశములో ఎవరికిగాని మన్యపు జ్వరమురాదు. ఆ వైద్యునికిని అతని నవుకరునకును మన్యపు జ్వరము వచ్చినపుడు ఇటలీ దేశమునండి తీసికొనివచ్చిన దోమలవలననే ఈ జాడ్యము కలిగియున్న దని ఊహించుటకు ఏమి సందేహమున్నది."

"మన్యపు జ్వరమును కలుగజేయు దోమలకును కలుగజేయని దోమలకును ఏమైనను భేదముండు నేమో చెప్పుము" అని రాజనెను.

వైద్యు డిట్లు పలికెను :—"ఈ రెండు జాతుల దోమలకును భేదములున్నవి. ఈ విషయములలో తగిన ప్రజ్ఞగలిగిన వానికిగాని ఈ భేదములు సులభముగా తెలియవు."

"దోమలు ఎక్కడనుండి వచ్చుచున్నవి?" అని రాజడిగెను.

అందుమీద వైద్యు డిట్లుపలికెను :—"దోమలన్నియును నీటిలో పుట్టుచున్నవి. ఆడుదోమ నీటిలో గ్రుడ్లను పెట్టును."

"ఒక్కొక్క గ్రుడ్డునుండి సూక్ష్మమైన పురుగు బయలువెడలి నీటిలో ఈదుకొనిపోవుచుండును. పదిదినములైనతరువాత అది దోమయగుచున్నది. కొంచెము కిరసనాయెను ఆ నీటిలో వేసినపుడు అట్టి పురుగులన్నియును నశించును. ఈ విధముగా పదిరోజుల కొకసారి కొంచెము కిరసనాయెను పోసినయెడల దోమలు బయలుదేర నేరవు."

రాజు ఇట్లు పలికెను :—"ఈ పురుగులుగల దోమలు మనుష్యుని కుట్టినపుడు మాత్రమే మన్యపు జ్వరము వచ్చునని నీవు చెప్పుచున్నావు. అయితే దోమలలో ఈ పురుగు లెట్లు చేరుచున్నవో చెప్పుము."

వైద్యు డిట్లు చెప్పెను :—" మన్యపు జ్వరముచేత బాధపడుచున్న మనుష్యుని కుట్టిన దోమలో ఈ పురుగులు చేరుచుండును. అట్టి రోగిని కుట్టని దోమలో ఈ పురుగు లుండజాలవు. దానివలన ఎంతమాత్రము హానికలుగనేరదు."

" ఆగష్టు, శెప్టంబరు, అక్టోబరు, నవంబరు నెలలలోమాత్రమే సాధారణముగా ఈ మన్యపు జ్వరము వచ్చును. అందుకు కారణమేమి ?" అని రాజనెను.

వైద్యు డిట్లుపలికెను :—"ఈ నెలలలోనే మన్యపుజ్వరమును కలుగజేయు దోమ జాతులు ఎక్కువ వృద్ధిజెందియుండును. మిగిలిన నెలలలో అంత వృద్ధిగా నుండవు. అందుచేతను ఆ నెలలలో మన్యపు జ్వరము ప్రబలియుండదు."

రాజిట్లు పలికెను :—" జలుబుచేసినపుడు మన్యపు జ్వరము కలుగదా ఏమి? చెప్పుము. ఎందువల్లననగా ఎక్కువగా జలుబుచేసినపుడు ఎవనికైనను కొన్నిగంటల లోపుగనే ఈ మన్యపు జ్వరము వచ్చుచుండును. అది దోమలుండు కాలముగానుండి యుండదు. ఈ సంగతినిబట్టి చూడగా ఈ జ్వరము ఎక్కువగా జలుబుచేసినవానికి కలుగుచుండునుగాని దోమలు కుట్టుటచేత కలుగుచుండుట లేదని నాకు తోచుచున్నది."

వైద్యుడిట్లు బదులు చెప్పెను :—" జలుబుచేసిన కొన్ని గంటల లోపలనే ఎవరికైనను ఈ జ్వరము వచ్చుచుండుట సర్వ సామాన్యముగా నుండును. కాని అట్టి శైత్యభారమువలన మన్యపు జ్వరమునకు సంబంధమయిన పురుగులు ఆ మనుష్యుని రక్తములో చేరుచుండుట లేదు. జలుబుచేయక పూర్వమే అతని రక్తమందు ఈ పురుగులున్నవి. చాల నెలలక్రిందట దోమలవలన ఈ పురుగులు అచ్చట చేర్చబడియుండవచ్చును.. నెలలకొలది రక్తములో అంతర్గతమై ఉండుట ఈ పురుగులయొక్క లక్షణముగా నున్నది. అట్లు అంతర్గతముగా, ఈ పురుగులున్న మనుష్యునికి జలుబుచేసినపుడుగాని ఎక్కువ అలసట కలిగినపుడుగాని రక్తముయొక్క బలము తగ్గును. అందుచేత ఈ పురుగుల మహిమ హెచ్చగును.

పురుగులుకూడ ఎక్కువగా వృద్ధిచెందును. ఇట్టి సమయమునందు జ్వరము వచ్చును.”

“అయితే రక్తములో అట్టి పురుగులు ఉండని మనుష్యునికి కేవలము జలుబుచేసినందువలన ఈ మన్యపు జ్వరమురాదని నిశ్చయముగా చెప్పగలవా?” అని రాజనెను.

వైద్యుడిట్లు చెప్పెను :—“ఇట్టి పురుగులు రక్తమందుండనివానికి కేవలము జలుబుచేతనే మన్యపు జ్వరము కలుగనేరదు. ఈ సంగతి ఇట్లు దృఢపరచబడినది. ఇంగ్లాండుదేశమునందు మన్యపు జ్వరమును కలుగజేయు దోమలులేవు. అక్కడనేపుట్టి యావజ్జీవమును నివసించువారికి జలుబుచేయవచ్చునుగాని మన్యపు జ్వరము ఎన్నడునురాదు. కాని ఇండియాదేశములో కొంతకాలముండి ఇంగ్లాండునకువచ్చి నివసించెడువారికి జలుబుచేసినపుడు తరుచుగా మన్యపు జ్వరమువచ్చుచుండును. ఇండియాదేశమునం దుండినకాలమునందే ఈ మన్యపు జ్వరమునకు సంబంధించిన పురుగు వారి రక్తములో ప్రవేశించి ఉండి తీరవలెను.”

రాజు ఇట్లుపలికెను :—“వైద్యుడా! మంచిది, నీ రక్తములో ఈ పురుగులు ఉన్నవి అనుకొనుము. ఇప్పుడు మన్యపు జ్వరమును కలుగజేయు దోమ ఒకటి మొదట నిన్నుకుట్టి వెంటనే నన్ను కుట్టుననుకొనుము. నాకప్పుడు మన్యపు జ్వరమువచ్చునా?”

వైద్యు డిట్లుపలికెను :—“రాదు. మన్యపు జ్వరమునకు సంబంధించిన పురుగులు గల దోమ ఒక మనుష్యునికుట్టి వాని రక్తములో అట్టి పురుగులను ప్రవేశింప బెట్టినపుడు అదే దోమ మరియొక మనుష్యునకు మన్యపు జ్వరమును కలుగజేయజాలదు. మొట్టమొదట ఈ పురుగులు దోమ శరీరమునందే వందలకొలది వృద్ధికావలెను. ఇందులకు ఎనిమిది లేక పదిదినములు పట్టును. అప్పుడా దోమకుట్టిన మనుష్యునికే మన్యపు జ్వరము వచ్చును. దోమయొక్క దేహము అతి శీతలముగా నుండునపుడు అనగా శీతకాలమునందు ఈ పురుగులు వృద్ధి కాజాలవు. ఇందుచేతనే శీతకాలమునందు మన్యపుజ్వరము కనుబడదు.”

“దోమ కాటుచేత రక్తమందు పురుగులు చేరినవెంటనే మనుష్యునకు ఈ జ్వరము వచ్చునా?” అని రాజు అడిగెను.

వైద్యు డిట్లుపలికెను :—“అట్లురాదు. మొదట ఈ పురుగులు అతని రక్తమందు వేనవేలుగ వృద్ధిజెందవలెను. ఆ పురుగులు తగినంత

ఎక్కువగా నుండినపుడుగాని జ్వరము రానేరదు. అంత ఎక్కువగా ఆ పురుగులు వృద్ధిచెందుటకు రెండు మూడు వారములు కావలయును."

"దోమ కాటువలన మన్యపు జ్వరము కలుగునను జ్ఞానము ప్రజలకీరోగము రాకుండజేయుటకు నాకేమయినను పనికివచ్చునా?" అని రాజనెను.

వైద్యు డిట్లుపలికెను :—"ఇట్టి జ్ఞానము ఎక్కువ ప్రయోజనకరమైనదిగా నుండును. చుట్టుపట్లను ఎంత నీటిని వదలివేసియున్నయెడల అంత ఎక్కువగా దోమలు వృద్ధిఅగునని మీ ప్రజలకు తెలియవలెను. ఇంతియు గాక పనికిరాని నూతులను కప్పి ఉంచుటచేతను, చెరువులలో కిరసనూనెను పోయుటచేతను, ఆవరణములందును వీధులయందును మరికి నీటిగుంటలు ఏర్పడకుండనట్లు చేయుటచేతను, దోమల సంఖ్యలను చాలవరకు తగ్గింపవచ్చును."

రాజు ఇట్లుపలికెను :—"నీవు చెప్పినవానివలన దోమల సంఖ్యలను తగ్గింపవచ్చునని తెలిసినది. అయినను వర్షకాలమునందు వాటి వృద్ధి ఎక్కువగానుండును. అప్పుడవి మనుష్యులను తరుచుగా కుట్టుచుండును గదా! అందువలన మనుష్యునికి మన్యపు జ్వరము రాకయుండుటకు ఏమియును సాధనము లేదా ఏమి?"

వైద్యు డిట్లుపలికెను :—"అనేకములైన దోమలు కుట్టినప్పటికిని, మన్యపు జ్వరమువలన కలుగు బాధను తప్పించుకొనుటకు ప్రతివానికిని ఒక మంచిమార్గము గలదు. ఇది ఒక గొప్ప భాగ్యము."

"లెక్కలేని దోమలు కుట్టినను మన్యపు జ్వరమును రానీయకుండు సాధన మెద్దియో నాతోజెప్పుము" అని రాజుపలికెను.

"క్వైనాను పుచ్చుకొనినయెడల ఎవరికిని మన్యపు జ్వరమురాదు" అని వైద్యుడనెను.

"ఆ క్వైనామందు ఎచ్చటనుండి వచ్చుచున్నదో, దానిని తయారు చేయుట ఎటో, నాకుచెప్పుము" అని రాజనెను.

వైద్యు డిట్లు చెప్పెను :—"ఆ సంగతిని పూర్ణముగ తెలిసికొనుటకు తిరిగి దేవరవారు ఇంకొకదినమున నన్ను పిలువనంపినయెడల ఆ క్వైనా కనుగొనబడిన కథ నంతటిని తమకు విన్నవించెదను."

12 వ ప్రకరణము.

[పెరూదేశము. క్వైనాను మొదట కనిపెట్టినవిధము.]

మరునాడు వైద్యుడు రాజు సముఖమునకు వచ్చి ఇట్లుపలికెను :—
"క్వైనా మొదట ఏవిధమున కనిపెట్టబడినదియు దానికి ఆ పేరు ఎట్లు వచ్చినదియు దేవరవారికి మనవిచేయుదును :

క్వైనాను కనిపెట్టిన వృత్తాంతము.

ఆమెరికా ఖండమందు ప్రసిద్ధమైన పెరూదేశముకలదు. సుమారు మూడువందల సంవత్సరములకు పూర్వము-అనగా షాజహాను చక్రవర్తి ఢిల్లీ సింహాసనముపైనెక్కి రాజ్యముచేయుచుండు కాలమున పెరూదేశము ఇరోపీయను రాజుల పరిపాలనమందుండెను.

హిందూదేశమునందు, పాంచాలము, బంగాళము, మధ్యపరగణములు మొదలగు రాష్ట్రములు ఉండినటులనే పెరూదేశమునందునను అనేకములు పెద్దరాష్ట్రములుగలవు. ప్రతి రాష్ట్రమునకును ఒక గవర్నరుండెను. దేశమంతటికిని వైస్‌రాయి-లేక-రాజప్రతినిధిఉండెను. ఈ కథకాలమున సింకోన్ ప్రభువు పెరూదేశమునకు వైస్‌రాయిగానుండెను. సింకోన్ అనునది ఐరోపాఖండమునందలి ఒక పట్టణముయొక్క పేరు. ఆ పట్టణ సమీపమునందు ఈ సింకోన్ ప్రభువునకు గొప్పభూవసతియుండెను. సింకోన్ ప్రభువు చాల ప్రసిద్ధపురుడు. అతడు ఐరోపా ఖండములోని దేశములను పాలించు రాజులకు మిత్రుడు. క్వైనామందునకు ఆ పేరు వానిమూలమున కలిగెను. పెరూదేశముకూడ హిందూదేశము వంటిదే. ఏమనగా అచ్చటను ఎక్కువగా మన్యపుజ్వరమువలన బాధ కలదు.

సింకోన్ ప్రభువు పెరూదేశమునకు రాజప్రతినిధిగానున్నకాలమున అందలి రాష్ట్రములలో ఒకదానికి డాన్‌లూయీ * అనునాతడు గవర్నరుగానుండెను. డాన్‌లూయి అనునాతనికి తన రాష్ట్రభాగమునందు తరుచుగా తిరుగుచుండుట ఇష్టముగానుండెను. ఒకానొకప్పుడు డాన్‌లూ

* పెద్ద అట్లాసులలో సింకోన్ అనునది స్పానియాదేశమునకు రాజధానియగు మాడ్రిడు పట్టణమునకు దక్షిణ పూర్వపు దిక్కున 25 మైళ్లదూరములో కనుపరచబడును. ఇక్కడ డాన్‌లూయి అని చెప్పబడినవానిపేరు డాన్‌లూయి కనిజారస్. ఇతడు ఈ కథకాలమున పెరూదేశమందలి ఒక రాష్ట్రమునకు గవర్నరుగానుండెను.

యీాయును ఆతని సిబ్బందియును అరణ్యములో అనేక దినములు ప్రయాణముచేసి తిరిగిఇంటికివచ్చుచున్నారు. ఆ సమయమున డాక్ లూాయీాకి పెద్ద జ్వరమువచ్చి జబ్బుపడియుండెను. ప్రతిదినము మధ్యాహ్నమందున జ్వరము అతి తీక్ష్ణముగా వచ్చుచుండెను. కొద్దిదినములలోపలనే అతడు చాల నీరసపడి గుఱ్ఱముమీదపోవుటకైనను సమర్థత లేకయుండెను ఇట్టి దురవస్థలోనుండగా వారు ఒక పెద్ద గ్రామమును చేరిరి. డాక్ లూాయియొక్క సిబ్బంది మనుష్యులు గ్రామములోకి వెళ్లి గ్రామాధికారిని పిలిచి వానితో ఇట్లుచెప్పిరి: 'ఈ రాష్ట్రపు పరిపాలకుడు మాతోకూడవచ్చియున్నాడు. అతడు జ్వరముచేత చాల జబ్బుపడియున్నాడు. ఆ జ్వరము ప్రతిదినమునను మధ్యాహ్నమందు అతి తీక్ష్ణముగా వచ్చుచున్నది. ఆతడిప్పుడు చాల చిక్కియుండి గుఱ్ఱముమీదపోవుటకైనను సమర్థుడుగా లేడు. మేము ఉండుచోటు ఇంకను చాల దినములప్రయాణములోనున్నది. కావున కావలసిన కూలివాండ్రువచ్చి గవర్నరును అతి శీఘ్రముగా వానిఇంటికి తీసికొనిపోవునట్లు ఆజ్ఞనిమ్ము.' గ్రామాధికారి వెంటనే కూలీలను ప్రోగు చేయుమని ఆజ్ఞనిచ్చి గవర్నరునకు ఏవిధముచేతనైనను సహాయపడవలెనని ఉద్దేశించి ఆతనివద్దకుపోయెను.

అట్లు వారు గవర్నరుండుతావునకువచ్చి ఆతడుమిక్కిలి అపాయకరమైనస్థితిలోనుండుటకని గవర్నరును వెంటనే ఇంటికిపోవలదని ప్రార్థించుచు ఆతనితో ఇట్లు చెప్పిరి: 'దేవరవారు ప్రయాణమైపోయినయెడల ఈ జ్వరము కుదురదు. కావున ఇచ్చటనే కొన్నిదినములుఉండుడు. మీకుతగిన సేవచేసి మీజ్వరమునుకు దిర్చెదము. ఈ జ్వరమునకు చికిత్స మాకుబాగుగ తెలియును. ఈ యడవిలో ఒక చెట్టున్నది. దాని బెరడును పొడుముచేసి దేవరవారు పుచ్చుకొనినయెడల ఈజ్వరము తిరిగి ఎన్నటికినిరానేరదు.'

ఆ గ్రామమందలి జనులు మంచివారని డాక్ లూాయి సిబ్బందికి తెలిసియుండుటచేత వారుకూడ డాక్ లూాయీాని అచ్చటనే కొన్నినాళ్లుండుమని కోరిరి. డాక్ లూాయీాయును అట్లుచేయుటకు ఒప్పుకొనిన తరువాత ఆ గ్రామస్థులు అడవికిపోయి కొలదికాలములోపలనే కొన్ని పిడికిళ్లతో ఎఱ్ఱటి బెరడునుతీసికొనివచ్చిరి. ఈ బెరడులో కొంతతీసి ముక్కలుచేసి కల్వములోనూరి పిండిచేసిరి. అది మృదువైన చూర్ణమైన తరువాత కొంచెము నీటితో కలిపిదానిని డాక్ లూాయీాకి ఇచ్చిరి. దానిని డాక్ లూాయీా తీసికొనెను. అది అతని నోటికి చాలచేదుగానుండెను.

ఆ మందును పుచ్చుకొనిన కొన్నిగంటలకు అతనికి తల గిరగిరతిరిగినట్లుగా తోచెను. మరునాటి మధ్యాహ్నమున జ్వరమువచ్చు సమయముగనుక సిబ్బంది జనులలోగొందరు గవర్నరునకు ఎట్లున్నదో చూచుటకు అతని వద్దికుపోయిరి గవర్నరు జ్వరమురాక సుఖముగానుండుటచూచి వారు చాల ఆశ్చర్యపడి ఇట్లనిరి: 'ఈ చెట్ల బెరడు అంత ఘోరమైన జ్వరమును చెప్పినట్లు మాన్పినది. ఈ మందు దివ్యమైన ఔషధముగా నున్నది.'

అంతమీదట గ్రామాధికారి ఇట్లు పలికెను: 'గవర్నరు! ఈ బెరడును తినినయెడల తప్పక జ్వరమెన్నటికిని రాకుండునట్లు కుదర్చగలమని చెప్పియుండలేదా? ఈ బెరడును కొంచెము కొంచెము ప్రతి రాత్రియును గవర్నరును కొన్నివారములవరకును తీసికొనుమనుము. అతనికి రోగము పోయి సుఖముగానుండును.'

డాన్ లూయీకి కొన్ని దినములలోపలనే జ్వరము కుదిరినది. అతడప్పుడు గ్రామస్థులను పిలువనంపి ఇట్లు పలికెను: 'తిరిగి నే నాచెట్టును చూచినయెడల నేను దానిని గుర్తించగలిగియుండవలెను. కావున మీరు నాతోకూడ అడవికివచ్చి ఆ చెట్టును నాకు కనుపరచుడు. అది బహు దివ్యమైన చెట్టు. దాని బెరడు ప్రపంచమందుండు అన్ని దేశములలోను మన్యపు జ్వరమునకుమందుగా ఉపయోగింపబడును.' తరువాత అడవిలో పెరుగుచున్న ఆ చెట్టును గవర్నరునకు వారు కనుపరచిరి. మచ్చుకొరకు అతడుదానియొక్క ఆకులను పువ్వులను అనేకముగా కోసి కొంత బెరడునుకూడ ఊడబెరికి తిరిగి తాను ఆచెట్టును గుర్తించగలిగి యుండుటకై వాటిని తనతోతీసికొనిపోయెను. ఈ చెట్టు తరుచుగా ఆ పెరూదేశములోని అరణ్యములలో పెరుగుచుండును.

ఇట్లు జరిగిన కొంతకాలమునకు పెరూదేశమునకు వైస్రాయిగా ఉన్న సింకోన్ ప్రభువుయొక్క భార్య జ్వరమువచ్చి చాలజబ్బుపడినది. ఆమె బ్రతుకదేమో అని కూడభయము కలుగుటచేత వైస్రాయికి ఎక్కువ ఆందోళనము కలిగెను. డాన్ లూయీకి ఈ వార్త తెలిసినపుడు చాల మనస్సంతాపము గలిగినది. తత్క్షణమే మనుష్యులను అడవికిపంపి ఆ అద్భుతమైన చెట్టుయొక్క బెరడునుతీసికొనిరమ్మనెను. వైస్రాయి భార్యకు చికిత్సచేయుచున్న వైద్యునికి ఒక ఉత్తరమువ్రాసి దానిలో జ్వరమునకు ఈ బెరడు దివ్యమైన ఔషధమనిపొగడెను. అతి వేగమున పోవు దూత

చేత ఈ ఉత్తరమును ఆ బెరడును ఆతడా వైద్యునికిపంపెను. ఉత్త రము అందినవెంటనే ఆ వైద్యుడీ బెరడుతో మందును తయారుచేసి సింకోన్ ప్రభువుయొక్క భార్యకు ఇచ్చెను. ఈ మందును తీసికొనిన కొన్ని గంటలలోపలనే జ్వరము ఆగిపోయినది. త్వరలోనే ఆమెకు జబ్బు బాగుగ కుదిరినది. సింకోన్ ప్రభువు చాల ప్రసిద్ధుడుగనుక అట్టి బెరడు వలన అతని భార్యకువచ్చిన మన్యపు జ్వరము కుదిరినదని తెలియగానే మన్యపు జ్వరమునకు ఇదేమందు అని ప్రసిద్ధిచెందినది. సింకోన్ ప్రభువు ఐరోపావెళ్లినపుడు అధికముగా ఈ బెరడును తన యొడలతీసికొనిపో యెను. ఐరోపాదేశమునకు ఇది వచ్చుటకు ఇదియే ప్రారంభముగానుం డెను. ఆ చెట్టును బెరడునుకూడ సింకోన్ ప్రభువుయొక్క పేరుచే తనే పిలువబడుచున్నవి. ఈ తరుణమునకూడ ఆ చెట్టును బెరడును సింకోన్ అని పిలువబడుచున్నవి. వాటినుండి తయారుచేయబడిన మం దునకు క్వైనా అనిపేరు.

ఒకప్పుడు ఈ బెరడు పెరూదేశమునుండివచ్చినదిగాన దీనిని పెరూ బెరడనికూడ చెప్పుదురు. చెట్టునకును బెరడునకును సామాన్యముగా సింకోనాయను ఒకపేరేవాడబడుచున్నది. మొదట దీనిని ఐరోపాకు తీసికొనివచ్చినది సింకోన్ ప్రభువుగా ఉండుటచేత వీటిని ఇట్లు పిలుచుటకు కారణమైనది."

వైద్యుడా కథను పూర్తిగ చెప్పినతరువాత "వైద్యుడా! ఈ క్వై నావలన మన్యపు జ్వరము ఎట్లుతొలిగిపోవుచున్నదో నాకు తెలియజె ప్పుము" అని రాజుపలికెను.

"దేవరవారు ఇంకొకదినమున నన్నుపిలువనంపిన యెడల క్వైనా వలన మన్యపు జ్వరము ఎట్లుకుదురునో, క్వైనానుతీసికొనువిధమెద్దియో అను విషయములనుగురించి మనము సంభాషింతము" అని వైద్యుడు తిరిగిచెప్పెను.

---

13 వ ప్రకరణము.

[క్వైనావలన మన్యపుజ్వరము కుదురు విధము. అట్టి జ్వరములో క్వైనాను పుచ్చుకొను విధము. క్వైనావలన ఈ జ్వరము పోవురీతి. ఇట్టి జ్వరమురాకుండుటకు క్వైనా ను తీసికొనువిధము. క్వైనావలన ఏబాధయును కలుగదు.]

రెండవదినమున వైద్యశాస్త్రజ్ఞుడు రాగానే వానితోరాజు ఇట్లు పలికెను :—"రక్తమందు మన్యపు జ్వరమునకు సంబంధించిన పురుగు

లున్నవాడు క్వైనాను తీసికొనినయెడల వానికి జ్వరము ఎట్లు మాన్పబడు చున్నది".

వైద్యశాస్త్రజ్ఞు డిట్లుచెప్పెను :—"వాడు క్వైనాను మ్రింగినవెంటనే ఆమందు వాని అన్నకోశమునుండి రక్తములో చేరుచున్నది. అట్లు రక్తములోచేరి ఆమందు మన్యపుజ్వరమునకు సంబంధమైన పురుగులను చంపివేయును."

"ఆమందు పురుగులనన్నిటిని చంపివేయునా ?" అని రాజడిగెను

వైద్యశాస్త్రజ్ఞు డిట్లుచెప్పెను:— "అన్నిటిని చంపివేయజాలదు. ఎవరైనను పెద్దమోతాదుగా క్వైనాను తీసికొనినపుడు ఈమందు వాని రక్తమందున్న పురుగులను చాల మట్టుకు చంపివేయగలుగును కాని అన్నిటిని నశింపచేయలేదు."

"అయితే ఇట్లు చంపబడకమిగిలియున్న పురుగులవలన హాని ఏమయినను కలుగునా ?" అని రాజడిగెను.

వైద్య శాస్త్రజ్ఞు డిట్లుపలికెను :—"అవును, హానికలుగును. అవి రక్తమందు వృద్ధిచెంది కొన్నిదినముల కావల తిరిగి జ్వరమును కలిగించును."

"ఇట్లయినయెడల క్వైనావలన జ్వరము కుదురుటెట్లు" అని రాజు చెప్పెను.

వైద్య శాస్త్రజ్ఞుడిట్లుపలికెను :—"కొన్ని వారములవరకును అనుదినము ఈమందును తీసికొనినయెడల జ్వరమురానేగదు".

"ఆజ్వరము పోవలెనంటె ఎంత క్వైనామందును తీసికొనవలెను ?" అని రాజడిగెను.

వైద్యశాస్త్రజ్ఞుడిట్లు బదులుచెప్పెను :— "జ్వరమురాకుండుటకు రోగి దినమునకు మూడు * క్వైనాబిళ్లల చొప్పున రెండు వారములవరకును తీసికొనవలెను. ఆటుతరువాత వారమునకు రెండుసార్లు దినమునకు రెండు బిళ్లలవంతున నాలుగు వారముల పర్యంతమును ఈ క్వైనామందును తీసికొనవలెను. ఇట్లు చేసినపుడు వాని రక్తములోనుండు పురుగులన్నియును నశించును. ఈ మన్యపుజ్వర మెన్నిటికిని తరువాత రానేరదు."

---

* ఇచ్చట క్వైనాబిళ్లలని చెప్పబడునవి లాహోరు పట్టణమందు దొరతనమువారి యంత్రములచేత చేయబడుచున్నవి. ప్రతిబిళ్లలోను ఐదుగ్రేనుల క్వైనామందుండును.

"దినగ ంఔప్పుడు ఈమందును తీసికొనవలెను" అని రాజుపలికెను.

"దినమునకు మూడు బిళ్లలను తీసికొనినప్పుడు, ఉదయమునందు ఒకటి, మధ్యాహ్నమందు ఒకటి, రాత్రి ఒకటి తీసికొనవలెను. దినమునకు రెండు బిళ్లలను తీసికొనునపుడు రెండింటినికూడ రాత్రి సమయమునందే తీసికొనవలెను. వాటిని భోజనమైన తరువాత కొంచెము నీళ్లతో తీసికొనవలెను" అని వైద్యశాస్త్రజ్ఞుడు పలికెను.

"ఆడుదానికి మోతాదు ఎంత ?" అని రాజడిగెను.

వైద్యశాస్త్రజ్ఞు డిట్లుచెప్పెను :— "మగవానికిని ఆడుదానికిని మోతాదు ఒకటే. ఐదేండ్లకును పది పండ్లకును మధ్యనుండు బిడ్డలకు ఉదయమున ఒక క్వైనా బిళ్లయును, రాత్రి ఒక బిళ్లయును ఇయ్యవలెను. ఐదేండ్లకును మూడేండ్లకును మధ్యనుండు బిడ్డలు ఉదయమున ఒక బిళ్లలో సగమును రాత్రి మిగిలిన సగమును తీసికొనవలెను. పసిపిల్లలకు రాత్రి సమయమునందు బిళ్లలో సగము ఇచ్చిన చాలును. కొంచెము పాలతోగాని లేక బెల్లముతోగాని క్వైనామందను తీసికొనవలెను."

"క్వైనాను తీసికొని మన్యపుజ్వరమును పోగొట్టుకొనదలచిన మనుష్యుడు భేదిమందునుకూడ తీసికొనుట మంచిదిగానుండునా ?" అని రాజు అడిగెను.

వైద్యశాస్త్రజ్ఞు డిట్లుచెప్పెను :— "క్వైనామందువలన చికిత్సను ప్రారంభించకమునుపు భేదిమందు పుచ్చుకొని ప్రతిదినమును ఒకసారి స్వేచ్ఛగా విరేచనమగునట్లు పర్పరుచుటమంచిదే."

"క్వైనామందును తీసికొను కాలమున తినవలసిన ఆహారమెద్ది ?" అని రాజడిగెను.

వైద్యశాస్త్రజ్ఞు డిట్లుచెప్పెను :— "క్వైనామందును తీసికొనువాడు సాధారణముగ తానుతిను పదార్థములను తినవచ్చును. జ్వరముండినయెడల అతడు పాలనుమాత్రమేగాని, మజ్జిగనుమాత్రమేగాని, లేక పలుచని ఆహారమును మాత్రమేగాని తినుటమంచిది. జ్వరమున్నవాడు గట్టిగానుండు ఆహారమును జీర్ణముచేసికొనజాలడు."

"జ్వరముచేత బాధపడుచున్న సమయమందు ఎవరైనను క్వైనామందును తీసికొనవచ్చునా? " అని రాజడిగెను.

వైద్యశాస్త్రజ్ఞు డిట్లుపలికెను :— "జ్వరముచేత బాధపడుచున్నవారు ఎవరైనను ఈక్వైనాను తీసికొనవలసినదే. జ్వరముండినను లేకున్నను, గట్టిగానుండు ఆహారమును భుజించుచున్నను పలుచని పదార్థమును తిను

చున్నను, పాలుదొరకినను దొరకకపోయినను, కాలమున సరిగా విరేచనము అగుచున్నను కాకుండినను, ఎట్లున్నను సరే ఆ మనుష్యుడుమాత్రము క్వైనామందును దీసికొనకుండినయెడల ఆజ్వరము కుదరనేరదు. ఈ జ్వరము పోవుటకు కావలసినపని ఒక్కటియే. అది ఏమనగా క్వైనామందును పుచ్చుకొనుట. తగులబడుచున్న ఇంటిలోనుండు మనుష్యుడు, భాగ్యవంతుడైనను, బీదవాడైనను, బలముగలవాడైనను, బలహీనుడైనను, రోగములేనివాడయినను రోగి అయినను, ఎట్లయినను సరే తాను తనప్రాణములను రక్షించుకొనుటకు ఆ ఇంటినుండి దాటిపోయి ఎట్లు తప్పించుకొనవలెనో అదేవిధముగ ఈ జ్వరముండిన వాడును క్వైనామందును తీసికొనకతీరదు. కొందరు రాజులుగా పుట్టుదురు. మరికొందరు రయితులుగా పుట్టుదురు. కాని అందరకును జననమరణములు తప్పవుగదా! అదేవిధమున రాజైనను రయితైనను మన్యపుజ్వరమును తప్పించుకొనదలచినవాడు తప్పక క్వైనామందును తీసికొని తీరవలయును."

రాజు ఇట్లుపలికెను :—"క్వైనా పుచ్చుకొని మన్యపుజ్వరమును పోగొట్టుకొనురీతిని తెల్పినావు అయితే ఇదివరలో నీవు క్వైనామందును తినుటవలన మన్యపుజ్వరమును రానీయకుండ చేసికొనవచ్చునని చెప్పితివి. మనుష్యులు ఆవిధముగా మన్యపుజ్వరమును మాన్పుకొను మార్గమేదియో తెలియజెప్పుము."

వైద్యశాస్త్రజ్ఞుడు ఇట్లుచెప్పెను :—"ఈ దేశమునందు మనుష్యులకు మన్యపుజ్వరము ఆగష్టు, శెప్టంబరు, అక్టోబరు, నవంబరు నెలలలోనే వచ్చుచుండును. ఈ నెలలలో ప్రతివాడును వారమునకు రెండుసారులు రెండుక్వైనా బిళ్లలవంతున మందును తినినయెడల ఈజ్వరము రానేరదు."

"ఈమందును తినుటచేత ఆజ్వరమురాకుండుట ఎట్లు తటస్థించుచున్నది?" అనిరాజడిగెను.

వైద్యశాస్త్రజ్ఞుడిట్లుచెప్పెను:—"వారమునకు రెండుసార్లు రెండు క్వైనా బిళ్లలవంతున పుచ్చుకొనువాని రక్తములో ఎప్పుడును క్వైనా ఉండును. మన్యపుజ్వరమును కలుగజేయు దోమలు అట్టి మనుష్యుని కుట్టి ఆరోగమునకు సంబంధించిన పురుగులను అతనిరక్తమునందు ప్రవేశపెట్టినపుడు అక్కడనుండు క్వైనాచేతను అవివెంటనే చంపబడుచున్నవి. కావున మన్యపుజ్వరము వచ్చుకాలమున ప్రతివాడును తానుమాత్రమేగాక తనకుటుంబముకూడ ఈ మందునుతిని జ్వరమురాకుండచేసికొనవలెను."

"క్వైనా ఉష్ణముచేయునందు అనిచెప్పి ఈదేశములోని జనులు కొందరు దానిని తీసికొనుటలేదు" అని రాజుపలికెను.

వైద్యశాస్త్రజ్ఞు డిట్లు చెప్పెను :—“క్వైనా కొంచెము ఉష్ణముచేసి నప్పటికిని అందువలన ప్రమాదమేమియును కలుగదు. రోగముచేత కుళ్లి చచ్చిపోవుటకంటె కొంచెము ఉష్ణముచేయు మందును తీసికొనుట శ్రేష్ఠము. తగులబడు ఇంటిలో మనుష్యుడున్నపుడును అతని చుట్టుపట్లనుండు వారు అతనిని ఇంటినుండి రమ్మనుమని కేకలువేసినప్పుడును అతడు ‘ఆవల వర్షము కురియుచున్నది. నేను బయటికి వచ్చినయెడల నాబట్టలుతడియును’ అని చెప్పినయెడల వారీవిధమున వానికి బోధింపరా ?— ‘అయ్యో ! బుద్ధిహీనుడా ! నీవు ఆఇంటిలో ఉండి నశించుటకంటె నీ బట్టలు తడిసినను మంచిదికదా ? ’”.

“క్వైనామందువలన మనుష్యుడు చిక్కిపోయి బలహీనుడగునని ఇక్కడివారు చెప్పుదురు. అది నిజమేనా ?” అని రాజనెను.

“క్వైనామందు మనుష్యుని శుష్కింపజేసి బలహీనునిగా చేయునన్నమాట నిజముకాదు. మన్యపుజ్వరము లేని ఇంగ్లాండు దేశములో ఈమందు వైద్యులచే తరుచుగా వాడబడుచున్నది” అని వైద్యుడు చెప్పెను.

“మన్యపుజ్వరము లేనప్పుడు ఎందు నిమిత్తము ఈమందు ఇంగ్లాండులో వైద్యులచేత వాడబడుచున్నది ?” అని రాజనెను.

“రోగపీడితులై శుష్కించియుండువారికి తిరిగి ఆరోగ్యమును బలమును కలుగజేయుటకై ఈమందును ఇంగ్లాండులోని వైద్యులు వాడుచున్నారు” అని వైద్యశాస్త్రజ్ఞుడు పలికెను.

“క్వైనామందువలనమనుష్యునికి ఎట్టి హానియునుకలుగదా ?” అని రాజనెను.

క్వైనావలన ఎంతమాత్రమును మనుష్యునికి హానికలుగనేరదు” అని వైద్యశాస్త్రజ్ఞుడు పలికెను.

“మన్యపు జ్వరమునకు సంబంధించిన పురుగులను చంపగల ఈ మందు మనుష్యునికి ఏవిధమైన హానిని చేయకుండుట విచిత్రముకాదా ?” అని రాజుపలికెను.

వైద్యశాస్త్రజ్ఞు డిట్లుపలికెను :—“దానిలో విచిత్రమేమియును లేదు సృష్టిలో దానిని పోలినవి పెక్కులున్నవి. ముంగిసనుగూర్చి యోచింపుడు. ముంగిస మనుజునకు ఎంతమాత్రమును హానిని చేయదు. కాని పామునకది గర్భశత్రువు. పాము కనుపడునంతలో దానిని అది చంపివేయు

ను. క్వైనా మందుకూడ అట్టిదే. క్వైనా మందు మనుజునకు హాని కరముకాదు. కాని మన్యపు జ్వరమునకు సంబంధించిన పురుగులకు ఇది గర్భశత్రువు. ఆ పురుగులు కనుపడునంతలో వానిని చంపివేయును."

"మన్యపు జ్వరముచేత ఎంతమంది హిందూదేశమునందు ప్రతి సంవత్సరమును చనిపోవుచున్నారో చెప్పుము" అని రాజనెను.

"ఈ జ్వరమువలన హిందూదేశమునందలి జనులు ప్రతి సంవత్సరమును పది లక్షలమందికి అధికముగా చనిపోవుచున్నారు. క్వైనా మందును తీసికొనినయెడల వీరందరును రక్షింపబడుదురు!" అని వైద్యశాస్త్రజ్ఞుడు చెప్పెను.

అందుమీదట రాజు ఇట్లు పలికెను:—"నా దేశమందలి జనులు మన్యపు జ్వరమువలన రక్షింపబడు మార్గము నాకు తెలిసినది. కాని కొన్ని సంవత్సరములనుండియును ఈ దేశమునందలి జనులు అనేకులు బొబ్బరోగమువలన మృతినొందుచున్నారు. ఓ వైద్యశాస్త్రజ్ఞుడా! నా దేశపు జనులు దీనివలన ధ్వంసముకాకుండ రక్షింపబడగల మార్గమేదియో నాకు చెప్పుము"

వైద్యశాస్త్రజ్ఞుడిట్లు చెప్పెను:—"ఇంకొక దినమున దేవరవారు నన్ను పిలువనంపిన యెడల ఈ భయంకరమైన బొబ్బ జాడ్యమెట్లు కలుగుచున్నదో, దానినుండి జనులు రక్షింపబడు మార్గమేదియో, అను విషయములను గురించి తమకు మనవి చేసెదను."

---

14 వ ప్రకరణము.

[బొబ్బరోగము ఎట్లు కలుషూలమున కలుగుచున్నది. కాలిఫా బొబ్బరోగము, ఎలుకలు వీనిని గురించిన కథ.]

మరునాడు వైద్యశాస్త్రజ్ఞుడు రాగానే రాజు వానితో ఇట్లనెను:—"ఓ వైద్యశాస్త్రజ్ఞుడా! బొబ్బరోగము మనుష్యునకు ఎట్లు వచ్చుచున్నదో చెప్పుము."

వైద్యశాస్త్రజ్ఞుడిట్లు పలికెను:—"బొబ్బరోగము ఎలుకలకు తగులును. ఎలుకలనుండి అది మనుష్యునకు అంటుకొనుచున్నది. గ్రామములోగాని పట్టణమందునగాని ఎలుకలుండని యెడల అచ్చటి జనులకు ఈ రోగము వ్యాపించదు."

" ఈ రోగము ఎలుకలకు వచ్చు జాడ్యమనియు వానినుండి ప్రజలకు వ్యాపించుననియు ఎప్పుడు కనిపెట్టబడినది ?" అని రాజడిగెను.

వైద్యశాస్త్రజ్ఞుడిట్లు చెప్పెను :—" పెక్కు వందల సంవత్సరముల క్రిందటనే ఈ జాడ్యము ఎలుకలతో సంబంధించినదనియు ఎలుకలనుండి యే జనులకు వచ్చుచుండుననియు తెలిసికొనబడినది. అనేకమైన ప్రాచీన గ్రంథములలో ఈ సంగతి ఉదాహరించబడినది. ఒక కాలిఫానుగురించిన కథయొకటి కలదు. దానినిబట్టి చూడగా ఈ సంగతి చాలకాలము క్రిందటనే తెలియబడినట్లు స్పష్టమగుచున్నది. దేవరవారు చిత్తగించినయెడల నేను ఆ కథను చెప్పెదను."

" ఆ కథను చెప్పుము " అని రాజనెను.

" కాలిఫా, బొబ్బరోగము, ఎలుకలు.—దీనిని గురించిన కథ ఇదియే " అని వైద్యశాస్త్రజ్ఞుడు చెప్పెను.

" పెక్కు వందల సంవత్సరముల క్రిందట ఒకానొక సుప్రసిద్ధ పట్టణమందు బలవంతుడగు ఒక కాలిఫా ఉండెను. ఈ కథ కాలమునందు ఆ కాలిఫా దేశమునందు బొబ్బరోగము ప్రబలి యుండెను. ఆ రోగము అతని పట్టణమునకు చుట్టుపట్లనుండు గ్రామములకుకూడ వ్యాపించెను.

బొబ్బరోగము తన పట్టణమునకుకూడ వ్యాపించినయెడల అధికముగ జనులు చనిపోవుదురనియు అందువలన పట్టణమంతయును జన శూన్యమగుననియు ఎరిగియుండుటచేత ఆతడు మిక్కిలి మనస్సంతాపమును కలిగియుండెను. అప్పుడు కాలిఫా తన ప్రధానిని పిలువనంపి ఇట్లు చెప్పెను : 'బొబ్బరోగము ఈ పట్టణమునకు వ్యాపించకుండునటుల చేయవలసిన మార్గము ఏదైన కలదేమో చెప్పుము. ఈ రోగము దగ్గరకు వ్యాపించియున్నది. ఏమియును చేయకుండినయెడల కొన్ని వారముల కాలములోపలనే ఇక్కడకుకూడ అది వ్యాపించును.'

ప్రధాని ఇట్లు పలికెను : ' ఈ జాడ్యముయొక్క స్వభావమును గురించి నాకేమియును తెలియదు. నేనెప్పుడును ఇట్టి జాడ్యమును చూచియుండలేదు. కాని చాల దూరమునుండు తూర్పు దేశములగు చీనా, టిబెట్టు దేశములలో ఈ జాడ్యమున్నదట. ఆ దేశములలో తిరిగిన గొప్ప విద్వాంసుడును వివేకియును అగు ఒక బాటసారి ఇప్పుడు ఈ పట్టణమునకు వచ్చియున్నాడు. ఆతడు ఇంకను ఇచ్చటనుండి వెళ్లి

యుండని పక్షమున ఈ రోగమును మాన్పగల మార్గమును దేనినయినను మనకు బహుశః చెప్పగలడు. అతడు ఉండు ఇంటికి మనుష్యులను పంపి ఇంకను ఇచ్చటనే ఉండెనేమో కనుగొనెదను.'

ప్రధాని మనుష్యులను పంపి కనుగొనినప్పుడు ఆతడింకను పట్టణము వదలి వెళ్ల లేదని తెలిసినది. వెంటనే ప్రధాని ఆ విద్వాంసుని రప్పించి కాలిఫా సముఖమునకు తీసికొనిపోయెను.

కాలిఫా విద్వాంసునితో ఇట్లు పలికెను: 'ఓ! బాటసారీ, ఇతరదేశములలో ఈ బొబ్బరోగమును అధికముగ చూచియుంటివా! ఈ రోగమును మాన్పుటకు మార్గమును దేనినైనను నీవు చెప్పగలవా!'

బాటసారి ఇట్లు పలికెను: 'ఇతర దేశములలో దీనిని అధికముగా నేను చూచినాను. నేను చెప్పినట్లు చేయుమని తాము ప్రధానిని ఆజ్ఞాపించినయెడల ఈ పట్టణములో బొబ్బరోగము ప్రవేశింపకుండునట్లు నేను చేయగలను. ఇది నేను దేవుని సముఖమున చెప్పుచున్నాను.'

అప్పుడు కాలిఫా ఇట్లు పలికెను: 'నీవు బహు గంభీరమైన మాటలను పలికితివి. కానిమ్ము. ప్రధాని నీవు చెప్పినది అంతయును చేయును. బొబ్బరోగము పట్టణమున చేరకుండునట్లు చేసితివా, నీకు అధికమైన ధనము నిచ్చెదను. నీ ప్రాణములను రక్షించుకొనదలచిన యెడల నీవు తప్పిపోకూడదు.'

బాటసారి ఇట్లు పలికెను: 'ఈ పట్టణమందు ఎందరు రత్నవర్తకులున్నారు?'

'ఇక్కడ ఐదువందలమందికంటె యెక్కువ రత్నవర్తకులున్నారు' అని ప్రధాని పలికెను.

'వారిలో మిక్కిలి ధనవంతులగు రత్నవర్తకులను రెండువందల మందిని పిలిపించి, యవ ధాన్యపు గింజ అంత ప్రమాణము గలిగినట్టియును, ఎక్కువ ప్రకాశముగానుండునట్టియును, అధికమైన విలువగలిగినట్టి యును, వజ్రములను ఒక్కొక్కడు ఒక వజ్రమును కాలిఫావద్దకు తీసికొని రమ్మని ఆజ్ఞాపించుము.'

ప్రధాని అట్లు చేసెను. రత్నవర్తకులును రెండువందల వజ్రముల ను తీసికొనివచ్చి కాలిఫా ఎదుట ఉంచిరి.

'జీవముతోనుండు రెండువందల ఎలుకలను ఒక్కొక్క దానిని ఒక్కొక్క పంజరములోనుంచి తెప్పించుము' అని బాటసారి పలికెను.

ప్రధాని అట్లు చేసెను. పంజరమునకు ఒకటి చొప్పున రెండు వందల ఎలుకలు తెప్పింపబడినవి.

అప్పుడు బాటసారి ఒక పంజరములోనుండి ఒక ఎలుకను దీసి వదులుగానుండుదాని కడుపు చర్మమును మంచి పదునైన కత్తితో అతి చతురముగా కోసి చర్మములోపలికి ఒక వజ్రమును త్రోసి, తిరిగి ఎలుకను పంజరములో వదిలిపెట్టెను. ఈ విధముననే ఆ రెండువందల ఎలుకలకును చేసెను. కొంచెము ధాన్యమును నీటిని ప్రతి పంజరములో నుంచునట్లును, ఆ పంజరములను అన్నిటిని ఒక గదిలోనుంచి గది తలుపును మూసి ముద్రవేసి ఆ గదిని సంరక్షించుటకు రక్షకభటులను ఉంచునట్లును బాటసారి ప్రధానికి ఆజ్ఞను ఇచ్చెను. బాటసారి చేసిన పనులకు మిక్కిలి అద్భుతము పడినవాడైనను, ఆతడు చెప్పినదానిని అంతయును చేసి ఆ గదికి తాళమువేసి తలుపుపైని ముద్రనుంచి, తాళము చెవిని తన దగ్గరనే పెట్టుకొనెను.

ఇట్లు జరిగి రెండురాత్రులైన తరువాత బాటసారి నడిరేయివచ్చి ప్రధానితో ఇట్లు పలికెను: 'నీవు లేచి, నీయెడల మిక్కిలి విశ్వాసమును భక్తియునుగల పదిమంది బానిసవాండ్రను పిలిపింపుము. వారిని నాతో కూడ తీసికొనివచ్చి ఆ పంజరములున్న గది తలుపును తీయుము. ఆ బానిసవాండ్రలో ఒకరిని మనతోకూడ ఒక దీపమును తెమ్మని ఆజ్ఞాపించుము.'

ప్రధాని ఆ విధముగా చేసిన తరువాత వారందరును ఆ గదిదగ్గర చేరిరి. ఆ గదిని కాపాడుచున్న రక్షకభటులు ముద్రలనెవరును పగులగొట్టలేదని ప్రధానిని నమ్మించిన పిదప, ఆ ముద్రలను పగులగొట్టి తలుపును తెరువుమని ప్రధానిని బాటసారి ఆజ్ఞాపించెను. గదిలో ప్రవేశించిన తరువాత బాటసారి దీపపు వెలుతురునందు ప్రతి ఎలుకను పరీక్షించి ఎలుకలకు తాను చేసిన చిన్న గాయములన్నియును కుదిరి వజ్రములు వాటి చర్మములో ఇమిడియున్న సంగతి కనుగొనెను.

'ఈ బానిసవాండ్రలో ఒక్కొక్కడు ఇరువది పంజరములను పట్టుకొని నాతో పట్టణములోపలికి పోవునట్లు ఆజ్ఞాపించుము' అని బాటసారి పలికెను.

ప్రధానియును, ఎలుకల పంజరములను తీసికొనిన పదిమంది బానిస వాండ్రును బాటసారితో పట్టణపు వీథులలోనికి పోయిరి. కొంచెము దూరము పోయిన పిదప బాటసారి ఒకానొక బానిసవానిచేతనున్న పంజరమును తీసికొని తలుపు తెరచి అందుండు ఎలుకను పైకి వదిలివేసెను. వెంటనే ఎలుక చీకటిలో పరుగెత్తిపోయెను, ఈ విధముగా బాటసారి పట్టణములోని పలుదిశలకునుపోయి, ఎలుకలను ఒకట్టొకటిగా అనేక స్థలములందు వదిలివేసెను. ఇట్లు ఎలుకలన్నియును పంజరములలో నుండి వదిలివేయబడినది.

ప్రధానియును బానిసవాండ్రును బాటసారిచేసిన పనులకు అత్యాశ్చర్యపడిరి.

ఉదయమునందు బాటసారి ప్రధానివద్దకువచ్చి, రెండువందల ఎలుకలు పట్టణములో వదిలివేయబడినవి అనియు, ఒక్కొక్క ఎలుక కడుపు క్రిందనుండు చర్మములో ఒక్కొక్క వజ్రమున్నదనియు ఆ వజ్రము యవ ధాన్యపు గింజ పరిమాణము గలిగినదిగాను, అధికమైన ప్రకాశము గలిగినదిగాను, ఎక్కువ విలువగలదిగాను ఉన్నదనియు, పట్టణములోనున్న వారికి దండోరావేయించి తెలియపరచుమని అతనిని ఆజ్ఞాపించెను. ఇదియును గాక ఈ ఎలుకలలో దేనినైనను చంపి దాని కడుపు క్రింద నుండు వజ్రమును సంపాదించుకొనువారు దానిని స్వంతముగా ఉంచుకొనవచ్చును. లేదా ఎవరికైనను అమ్ముకొనవచ్చుననికూడ ప్రజలకు తెలియపరుపుమనెను.

ఇంట్లిసంగతి పట్టణములో తెలియజేయబడినపుడు అచ్చటనుండు వారిలో అనేకులు ఇది యొక పరిహాసమనుకొని అట్టి పని జరిగియుండునని నమ్మరైరి. అయినప్పటికిని బీదవాండ్రు కొందరు ఎలుకలను వేటాడి చంపి ఆ వజ్రములను సంపాదింప ప్రారంభించిరి. ఆనాటి సాయంకాలమున మిక్కిలి బీదకూలివాడొకడు తాను చంపిన ఎలుక కడుపులో వజ్రమును కనుగొనుట తటస్థించెను. వెంటనే వాడు దానిని అమ్మి ఒక ఇంటిని కొనెను. ఈ వార్త పట్టణములో తెలియగానే ప్రజలకు తత్తరపాటు అధికమాయను. ముసద్దితనముసద్ది పనిని వదిలివేసెను; వర్తకుడు తన దుకాణమును చాలించెను; గొప్పవారును కొద్దివారును, భాగ్యవంతులును బీదవాండ్రును,యజమానుడును, బానిసవాడును, మగవాండ్రును, ఆడువాండ్రును, బిడ్డలును అందరును తమ పని పాటులను వదిలివేసి అతి తొందరగా ఎలుకలను వేటాడిచంపి వాటి కడుపుల క్రింద

నుండు వజ్రములను సంపాదింప దొడంగిరి. ఈ పెద్ద వేటలో కొందరు ఎలుకలను ఇంటి కప్పులనుండి పయికి పారదోలిరి. మరికొందరు వాటిని గోడలలోను నేలలోను త్రవ్వి పట్టిరి. ఇంకను కొందరు వాటిని ధాన్యపు గాదెలలోనుండి పయికి ఊడ బెరికిరి. మరియు కొందరు మురుగు కాల్వలందున్న ఎలుకలను నీట ముంచి పయికితీసిరి. ఇంకను మరికొందరు వాటిని కర్రలతోను, కత్తులతోను, రాళ్లతోను హింసించిరి. కొన్నినాళ్ల వరకును పట్టణములో మరియొక పని జరిగియుండలేదు. అప్పటిలో బరువు మోసికొని పోవుటకు కూలివాండ్రు గాని, ఏ పనిని అయినను చేయుటకు మనుష్యులుగాని దొరకలేదు. ఎలుకల బోనులను చేసిన వడ్రంగులకు పని హెచ్చయి చాల లాభకరముగానుండెను లొట్టియల ఖరీదునకు పిల్లులు అమ్మబడెను. ఒక్క వారము దినములలోపల లక్షలకొలది ఎలుకలు చంపబడినవి. ఇంకను ప్రతి దినమునను ఐదో, ఆరో, ఏడో, ఎనిమిదియో, వజ్రములు దొరకినట్లు వార్తలు వచ్చుచుండెను. రెండు వారములైన పిదప పట్టణమందంతటను ఒక్క ఎలుక అయినను కనుపడలేదు. అయినను ఆ రెండు వందల వజ్రములు ఇంకను పూర్ణముగ కనుగొనబడక పోవుటచేత, ఏదైనను ఎలుక కనుపడినయెడల దానిని ప్రజలు చంపుచుండిరి.

ఇట్లు పట్టణమందలి ఎలుకలన్నియును చంపబడిన తరువాత, బాటసారి కాలిఫాదగ్గరకు పోయి ఇట్లు చెప్పెను: ‘ఈ పట్టణములో బొబ్బరోగము ప్రవేశించకుండ ఉపుచేయుదునని ప్రమాణముగ తమతో చెప్పియుండలేదా ? బొబ్బరోగము బయలు వెడలునని ఇప్పుడు ఎంతమాత్రమును భయపడకుము. నేను పన్నిన యుక్తిచేతను పట్టణములో నుండు ఎలుకలను అన్నిటిని ప్రజలు చంపునట్లు చేసితిని. బొబ్బరోగము ఎలుకలవలన కలుగును. మొట్టమొదట ఆ రోగము ఎలుకలలో బయలుదేరును. అటుతరువాత ఎలుకలనుండి ప్రజలకు వ్యాపించును. పట్టణములో ఎలుకలు లేనియెడల బొబ్బరోగము రాదు. ప్రజలకేవిధమయిన భయమును లేదు.’

చాల దినములు గడిచినను బొబ్బ రోగము ప్రబలకుండుట జూచి ఆ బాటసారి చెప్పినది నిజమని కాలిఫా తెలిసికొనెను. అప్పుడు కాలిఫా ఆ బాటసారికి తన ధనాగారమునుండి అధికమైన ధనమును ఇచ్చుటకు ఆజ్ఞను ఇచ్చెను. ఆ బాటసారి ఆ పట్టణమునందే నివసించి ప్రజల యొక్క గౌరవమును పొందుచు ముసలి పండు అగువరకును జీవించెను.

ఎవరైనను ఆ పట్టణమునకు వచ్చి, 'ప్రజలచేత ఇంత గౌరవింపబడు చున్న ఈత డెవడు' అని అడిగినపుడు అచ్చటి ప్రజలు ఈ విధమున వారికి ఉత్తర మిచ్చుచుండిరి: 'ఈతడు మిగుల ప్రసిద్ధిచెందిన బాట సారి. పట్టణములో బొబ్బ రోగము ప్రవేశించుటకు సిద్ధముగానున్న కాలమున ఇతడిచ్చటికివచ్చి, ఒక యుక్తిని పన్ని ఎలుకలను నన్నిటిని నశింపజేసెను. అందువలన ఈ పురజనులు ఆ ఘోరమైన రోగముచేత ధ్వంసముచేయబడకుండ రక్షింపబడిరి.'

వైద్యశాస్త్రజ్ఞుడీకథను ముగించినతోడనే రాజు ఆతనితో ఇట్లనెను :—"బొబ్బ రోగము తగిలిన ఎలుకవలన మనుష్యునకీ రోగము ఎట్లు వ్యాపించుచున్నదో నాకు చెప్పుము."

వైద్యశాస్త్రజ్ఞుడిట్లు చెప్పెను :—"దేవరవారు తిరిగి మరియొక దినమున నన్ను బిలువనంపినయెడల బొబ్బ రోగము తగిలిన ఎలుకలవలన మనుష్యులకు అది ఎట్లు వ్యాపించుచున్నదో, దానినుండి రక్షించుకొనుటకు ప్రజలుచేయవలసిన పనులు ఎవ్వియో తమతో మనవి చేసెదను."

---

15 వ ప్రకరణము.

[ఎలుకల మూలమున ప్రజలకు బొబ్బరోగమువచ్చు విధము. ఎలుక మిణ్ణల్లులు. బొబ్బ రోగము తగిలినప్పుడు ఎలుకలు కన్నములనుండి పైకివచ్చి చచ్చుటకు ఉండు కారణములు.]

మరునాడు వైద్య శాస్త్రజ్ఞుడు రాజు సముఖమునకు రాగానే రాజు అతనితో ఇట్లు పలికెను :—"బొబ్బ రోగము తగిలిన ఎలుకలవలన మనుష్యులకు ఆ రోగము ఎట్లు వ్యాపించుచున్నదో తెలియ జెప్పుము."

వైద్యశాస్త్రజ్ఞుడు ఇట్లు చెప్పెను :—"రక్తములోనుండు పురుగులు లేక అంకురములచేతనే ఈ బొబ్బ రోగము పుట్టుచున్నది. బొబ్బ రోగముగల ఎలుకల రక్తములో ఒక్కొక్క చిన్న బిందువునందును ఈ పురుగులు లేక అంకురములు వేలకొలది ఉండును. ఎలుకల పైని మిణ్ణల్లులు చేరి వాటిని కరచి లోపలిరక్తమును పీల్చుచుండును. బొబ్బ రోగము గల ఎలుకను ఈ మిణ్ణల్లులు కరచి లోపలిరక్తమును పీల్చి ఆ రక్తముతోపాటు అందుండు వేలకొలది పురుగులను (లేక అంకురములను) కూడ పీల్చుచుండును. ఎలుక చనిపోయినపుడు ఆ మిణ్ణల్లులు దానిని వదిలి ఇతరములగు ఎలుకలపయికిపోయి వాటిని కరచును. అట్లు ఇతరములగు

ఎలుకలు దొరకనపుడు ఈ మిణ్ణల్లులు మనుష్యులపయిబడి వారిని కరచి వారికి బొబ్బ రోగమును పుట్టించును."

రాజు ఇట్లు పలికెను :—"మొదట ఎలుకలకు బొబ్బ రోగము వచ్చును. అపుడు వాటిమీదనుండు మిణ్ణల్లులు వాటి రక్తమును పీల్చి అందుండు పురుగులను (లేక అంకురములను) గ్రహించును. ఆ మిణ్ణల్లులు మనుష్యులను కరచినపుడు వారికీ బొబ్బ రోగము వచ్చుచున్నది. ఈ విషయమును నేను చక్కగ గ్రహించితినా ? చెప్పుము."

"తమకా విషయము సరిగా తెలిసినది" అని వైద్యశాస్త్రజ్ఞుడు పలికెను "ఎలుకలమీదనుండు మిణ్ణల్లులు మనుష్యులపయిని ఉండు వాటిని పోలియున్నవా ?" అని రాజడిగెను.

"మనుష్యులపయిని ఉండు మిణ్ణల్లుల జాతి ఒకటి, ఎలుకలమీద నుండు మిణ్ణల్లుల జాతి మరియొకటి" అని వైద్యశాస్త్రజ్ఞుడు చెప్పెను.

"ఎలుకలమీదనుండు వాటియొక్క జాతి ప్రత్యేకమయినదిగా నున్నపుడు ఆ మిణ్ణల్లువచ్చి మనుష్యులను కరచుటకుండు కారణమేమి ?" అని రాజడిగెను.

"ఎలుకమీదనుండు మిణ్ణల్లులు తాము కరచుటకు ఇతరములైన ఎలుకలను కనుగొననపుడు మనుష్యులను కరచును" అని వైద్యశాస్త్రజ్ఞుడు చెప్పెను.

అందుమీద రాజు ఇట్లు పలికెను :—"అయితే కన్నములో ఒక ఎలుక ఉండినపుడు మరికొన్ని ఎలుకలుగూడ అచ్చటనే ఉండును. ఒక ఎలుక బొబ్బరోగమువలన చనిపోయినపుడు దానిని వదిలివచ్చు మిణ్ణల్లులు మిగిలిన ఎలుకలమీదచేరక మనుష్యులమీదికే వచ్చుటకు కారణమేమి ?".

వైద్యశాస్త్రజ్ఞుడిట్లు పలికెను :—"ఎందువల్లననగా-బొబ్బరోగము వలన చనిపోవు ఎలుక మరికొన్ని ఎలుకలుండుచోట చావనేరదు. అది కన్నమునుండి వయికివచ్చి తరుచుగా గదియొక్క నేల భాగముమీద చనిపోవుచుండును. దానిని వదిలివచ్చు మిణ్ణల్లులు నేలమీద ప్రసరించును. నేల భాగమునుంచి అవి ఆ గదిలోనుండు మనుష్యుల కాళ్లకును దేహములకును ఎక్కును".

రాజు ఇట్లు పలికెను :—"బొబ్బరోగమువచ్చి చనిపోవు ఎలుకలు కన్నములనుండి వయికివచ్చి చనిపోవునని నా గ్రామములందలి జనులు

చెప్పగా వినియుంటిని. ఈ సంగతి చాల విచిత్రముగా నున్నది. అట్లు ఎలుకలు కన్నములనుండి పయికివచ్చి చచ్చుటకు ఉండు కారణము కని పెట్టబడినదా?".

వైద్యశాస్త్రజ్ఞుడిట్లు చెప్పెను :—"సృష్టిలోనుండు పెక్కు జాతుల జీవరాసులకు తమ తమ జాతి జంతువుల క్షేమమును గురించిన జ్ఞానమును మెలకువయును ఇయ్యబడియున్నది. రాజా! తేనెటీగలను గురించియును చీమలను గురించియును కొంచెమా లోచింపుడు! ఇవి తమ తమ ఇండ్లను నిర్ణయించుకొనుటయందును, నిర్మించుకొనుటయందును, తమ తమ జాతి జంతువుల క్షేమమును అభివృద్ధిచేయు నిబంధనములను ఎక్కువ ఐకమత్యముగలిగి అనువర్తించుటయందును ఎంత మెలకువగా సంచరించుచున్నవో చూడుడు! అటువలెనే ఎలుకలును మసలుచుండును. తమలో ఒక ఎలుక బొబ్బరోగమువచ్చి చనిపోవునపుడు అది కన్నములోనే చచ్చినయెడల మిగిలినవాటికిగూడ చచ్చిన ఎలుకమీద నుండు మిణ్ణల్లులవలన బొబ్బరోగము వచ్చునని తక్కిన ఎలుకలకు తెలిసియుండును అందువలన తక్కిన ఎలుకలు కన్నమునకు వెలుపలి భాగమునందే అది చావవలెనని దానిని పైకి త్రోసివేయును".

"అయ్యో! మనుష్యునకే సహజసిద్ధమైన అట్టి జ్ఞానమున్నయెడల అధికమగు రోగపీడయును బాధయును తప్పిపోయి ఉండును గదా!" అని రాజనెను.

వైద్యశాస్త్రజ్ఞుడిట్లు చెప్పెను :—"నీచ మృగములకు సహజసిద్ధముగానుండు జ్ఞానము మనుష్యునకు లేకున్నను, వాటియందు కానరానటువంటియు, అంతకన్న ఎక్కువ ప్రశస్తమైనటువంటియు ప్రజ్ఞలు మనుష్యునియందు గలవు. మానవునికి బుద్ధి సంకల్పములను శక్తులు గలవు. అతడు తన బుద్ధిని ఉపయోగించినయెడల అన్నిరోగములకుండు ఉత్పత్తి కారణములను కనుగొని వాటినుండి సంరక్షింపబడుటకు తగిన సాధనముల యొక్క జ్ఞానమును తెలిసికొనగలడు. రెండవశక్తియగు సంకల్పము (ప్రయత్నము) చేత తానా జ్ఞానమును ఉపయోగించి రోగ బాధనుండి తప్పించుకొనగలడు".

అందు మీఁట రాజు ఇట్లు పలికెను :—"నీవు చెప్పినది సత్యము. వైద్య శాస్త్రజ్ఞుడా! రోగమునుండి తప్పించుకొను మార్గములను గురించి నా దేశపు ప్రజలు నేర్చికొనిన పిదప, వారును తమ సంకల్ప శక్తిచేతను

అట్టి జ్ఞానమును ఉపయోగించుటకు ప్రయత్నించ గలుగుదురుగాక! అయితే ఒక గ్రామమునుండి మరియొక గ్రామమునకు ఈ బొబ్బ జాడ్యము ఎట్లు వ్యాపించుచున్నదో తెలియ జెప్పుము".

వైద్య శాస్త్రజ్ఞుడు ఇట్లు చెప్పెను :—"ఈ విధముగా బొబ్బరోగము ఒక గ్రామమునుండి మరియొక గ్రామమునకు వ్యాపించుచున్నది. బొబ్బ రోగము ప్రబలియుండు గ్రామమునుండి ఒకడు అట్టి జాడ్యములేని మరియొక గ్రామమునకు పోవును. అట్టివాని దుస్తులలోనో పరపుగుడ్డలలోనో బొబ్బ రోగముచే చచ్చిన ఎలుకలనుండి వచ్చి ప్రవేశించిన మిణ్ణల్లులుండవచ్చును. ఈ ఎలుక మిణ్ణల్లులలో బొబ్బరోగమునకు సంబంధించిన పురుగులు (లేక అంకురములు) ఉండును. అట్టి మనుజుడు రెండవ గ్రామమునకు వచ్చిన తోడనే తన గుడ్డలను ఒకానొక ఇంటిలో నుంచును. సాధారణముగ వాటిని నేలమీదను పరచవచ్చును. అట్టి సమయమునందు బొబ్బరోగమునకు కారణమగు పురుగులున్న మిణ్ణల్లులు ఆ దుస్తులనుండి పైకి లేచి ఇంటిలోనుండు కొన్ని ఎలుకలను కరచును. ఆ ఎలుకలకు అందుమూలమున బొబ్బరోగము తగులును. బొబ్బరోగముచేత ఎలుకలు చావ నారంభించిన తరువాత ఆ గ్రామమునందుండు జనులకుకూడ ఈ రోగము ప్రారంభించును. సర్వ సాధారణముగా ఎవని దుస్తులలో ఇట్టి ఎలుక మిణ్ణల్లు లుండునో వానినే ఇవి మొదట కరచును. అందవలన వానికే మొదట ఈ రోగము వచ్చును, లేదా అతడు రెండవ గ్రామమునకు రాకముందే బొబ్బ రోగమునకు సంబంధించిన పురుగులుగల ఎలుక మిణ్ణల్లులచేత కరవబడియుండును".

"ప్రజలు ఏయే మార్గముల మూలమున బొబ్బరోగమునుండి తప్పించుకొనగలుగుదురో చెప్పుము" అని రాజనెను.

"దేవరవారు ఇంకొకసారి మరియొక దినమున నన్ను పిలుపనంపిన యెడల జనులు ఈ రోగమునుండి తప్పించుకొన కలిగిన మార్గములను గురించి మనవి చేసెదను".

16 వ ప్రకరణము.

[బొబ్బ రోగమువలన మరణము రాకుండుటకై ప్రజలు వలంబించవలసిన ఐదు మార్గములు. ఎలుకలవలన కలుగు హాని, మనుష్యుడు, ఎలుకలు - వీనిని గురించిన కథ. ఎలుకలను బోనులలో పట్టు విధము. వాటికి విషము పెట్టు విధము. ఒక గ్రామమునుండి మరియొక గ్రామమునకు ఈ రోగము వ్యాపించకుండుటకు చేయవలసిన పని. ఎలుకలు చచ్చిన గ్రామములను ఇండ్లను వదిలి వేయుటలో నుండు వివేకము. రాత్రివేళలందు బొబ్బ రోగమున్న ఇండ్లకు పోయి నందువలన కలుగు అపాయము. బొబ్బ రోగమున్న ఇండ్లను పరిశుద్ధము చేయువిధము. బొబ్బ రోగము రాకుండ టీకాలు వేయించుకొనుటవలన కలుగు లాభము. బొబ్బ రోగము తగిలినవారి విషయమై తీసికొనవలసిన జాగ్రత్త. అట్టి వారిని మృత్యువునుండి తప్పించు మార్గములు.]

మరుసటి దినమున వైద్య శాస్త్రజ్ఞుడు వచ్చిన తోడనే వానితో రాజు ఇట్లు పలికెను :—"బొబ్బ రోగమును తప్పించుకొనుటకు జనులేమి చేయవలయునో చెప్పుము".

"బొబ్బ రోగమువలన ధ్వంసము కలుగకుండుటకు జనులు అవలంబించవలసిన మార్గములు ఐదు ఉన్నవి :—

మొదటిది. ఆ రోగము వ్యాపించుటకు తగిన ఎలుకలు లేని గ్రామములో ఇది వ్యాపించదు కావున గ్రామమందుండు ఎలుకల సంఖ్యను సాధ్యమైనంతవరకు తగ్గించి ఉంచవలెను.

రెండవది. బొబ్బ రోగముండిన మరియొక గ్రామమునుండి ఇది తీసికొని రాబడినప్పుడుగాని ఏ గ్రామమందున్న ఎలుకలకును ఈ రోగము తగుల నేరదు. కావున బొబ్బ రోగము వ్యాపించియుండు గ్రామములనుండి జనులు తక్కిన గ్రామములకు వచ్చి అచ్చట ఆ జాడ్యమును ప్రవేశపెట్ట నియ్యరాదు.

మూడవది. ఎలుకలకు ఈ రోగము తగిలియున్నను అట్టి ఎలుకల మీదనుండు మిణ్ణల్లులువచ్చి మనుష్యులను కుట్టినపుడుగాని ఈ జాడ్యమురాదు. కావున ఎలుకలకీ రోగము వచ్చినపుడు వాటిమీదనుండు మిణ్ణల్లులు ప్రజలపైని ప్రవేశించకుండునట్లు వాటి బారినుండి వారు తప్పుకొని తాముండు ఇండ్లను వదిలి పొలములలో నివసించవలయును. ఆ ఇండ్లలోనుండు మిణ్ణల్లులనన్నిటిని వేడిమిచేత పూర్ణముగ నాశనముచేసిన వెనుకగాని అచ్చట వారు తిరిగి చేరరాదు.

నాల్గవది. బొబ్బరోగము బయలు దేరినపుడు ఈ వ్యాధి తగులకుండుటకు టీకాలు వేయించుకొనిన వారికి అంతగా హాని కలుగదు. టీకాలు వేయించుకొననివారికే ఎక్కువహాని కలుగుచుండును. కావున అచ్చట నుండువారు అందరును బొబ్బరోగము తగులకుండుటకుగాను టీకాలను వేయించుకొనవలెను.

ఐదవది. బొబ్బరోగము తగిలినపుడైనను రోగి ఓర్పు గలిగియుండి, మంచి వైద్య సహాయమునుపొంది చికిత్సను చేయించుకొనినయెడల అతనికి రోగము కుదురును. కావున ఈ రోగము తగిలినవారందరును తత్తరపడకయుండి సాధ్యమైనయెడల మంచిచికిత్సను పొందవలయును."

రాజు ఇట్లు పలికెను :—"మొదట నీవు గ్రామమందుండు ఎలుకల సంఖ్యను తగ్గించ వలయుననియు, ఎలుకలులేని స్థలములందు బొబ్బరోగము వ్యాపించదనియు చెప్పినావు. ఏ స్థలమునకైనను ఎలుకలను ఆకర్షించునవి ఏమయి ఉండునో నాకు తెలియజెప్పుము".

వైద్యు డిట్లుపలికెను :—"ధాన్యమును ఎలుకలు అత్యాతురత తో తినును. కావున ధాన్యము డు స్థలములందు ఎలుకలును ఉండును. ఏ యింటిలో ధాన్యము అజాగ్రత్తగా ఉంచబడునో అక్కడ ఎలుకలు అధికముగానుండును. కావున ధాన్యమును ఎలుకలు చేరగాని గాదెల లోనుంచవలెను. అదియునుగాక మనుష్యులుండి నిద్రించు స్థలములందు ధాన్యపు గాదెలను ఉంచకూడదు. మనుష్యులుండు గదులకు దూరముగా లోపలి ఆవరణములో ఒక పక్కనుండు వెల్లడియైన పంచపాళీలో ఇట్టి ధాన్యపుగాదెలను ఉంచవలెను. ఏగదిలోనైనను తినుబండారపు వస్తువుల లేశములు పడియుండునపుడు ఎలుకలు విశేషముగా అచ్చట చేరును. కావున ఎలుకలు వచ్చుటకు వీలులేని స్థలములందే ఆహార పదార్థములను అన్నిటిని ఉంచవలెను. ఎలుకలకు మురికి చాల ఇష్టము. మురికిగల చెత్తపోగులలో కన్నములు చేసికొని ఎలుకలు బ్రతుకుచుండును.

అందుచేత గ్రామములను ఇండ్లను పరిశుభ్రముగా నుంచవలెను. చెత్తపోగులు వాటి లోపలగాని చెంతనుగాని ఉండరాదు. ఎలుకలు బొబ్బ రోగమును కలిగించుట అట్లుండగా ధాన్యమును బట్టలను కూడ తిని ప్రజలకు ఎక్కువ నష్టమును కలిగించును. వారములో ఒక ఎలుక నాలుగు చెటాకుల ధాన్యమును తిన్నను సంవత్సరములో అది 12 సేర్ల ధాన్యమును తినగలదు. ఒక ఎలుక సంవత్సరములో 12 సేర్ల ధాన్యమును తినినయెడల 80 ఎలుకలు సంవత్సరములో 480 సేర్లు లేక

12 పకార్ల మణుగుల ధాన్యమును తినును. అనేక ఇండ్లలో నలుబది ఎలుకలైనను ఉండును. ఈ విధమున ఎక్కువ నష్టము గలుగుచుండును. మనుష్యులు, ఎలుకలు - వీనినిగురించిన చాల పురాతన మైన కథ ఒకటి కలదు :

ఒకప్పుడు ఒక మనుష్యుడు తన ఇంటిలోనున్న ఎలుకలనన్నిటిని పిలిచి వాటితో ఇట్లనెను : 'ఓ! ఎలుకలారా! మీరువచ్చి నా ఇంటను ఎందుకు నివసించియున్నారు? నాకుటుంబ సంరక్షణమునకు నేను పాటు బడి పండించిన ధాన్యములో పదియవవంతు మీరు ప్రతి సంవత్సరమును తినుచున్నారు'.

ఆ మనుష్యుని వెక్కిరించి ఎలుకలు ఇట్లు పలికెను: 'నీ ఇంటి లోనుండు ధాన్యములో పదియవవంతును సంవత్సరమునకు మేము తిను చున్నామని నీ వెంకునకు దుఃఖించెదవు? మేము నీ ఇంటికి బొబ్బరోగ మును తెచ్చి ఏటేట నీ కుటుంబములో పదిమందికి ఒకరు వంతున చని పోవునట్లు చేయుటలేదా? మేము నీ ధాన్యమును తినుచున్నాము. అది నిజమే, కాని నీవు పోషింపవలసిన జనమునుకూడ తగ్గించుచున్నాము'.

అందుమీద చాల కోపమువచ్చి ఆ మనుష్యుడు ఎలుకలనన్నిటిని తన ఇంటినుండి పారదోలెను. ఎన్నడైనను ఎలుక ఇంటిలో ప్రవేశించి నపుడు దానిని అతడు చంపుచుండెను. అప్పటినుండియును ధాన్యమున కు నష్టము కలుగలేదు సరేకదా అతని కుటుంబములోనివారు బొబ్బ రోగమువలన చనిపోవుచుండుటయును లేదు."

వైద్య శాస్త్రజ్ఞుడు కథను ముగించగానే వానితో రాజు ఇట్లు పలి కెను :—"ఇంటిలో ఎలుకలు చేరకుండుటకు మనుష్యుడేమి చేయ వలెను".

వైద్యశాస్త్రజ్ఞుడిట్లు పలికెను :—"బోనులలో పట్టిగాని, విషము పెట్టిగాని ఎలుకలను చంపవచ్చును. సంవత్సరము పొడుగునను బోను లను వాడుచుండవలెను. ఎలుకలకు ఇష్టమయిన ఆహారమును దేనినైన నను— అనగా రొట్టెముక్కలు, నెయ్యి, బెల్లము, కూరగాయలు, నేతి లో వేచిన మాంసము మొదలగు వానిని ఎరగాబెట్టి బోనులలోకి వాటిని రప్పించవచ్చును. ఎలుక జిత్తులమారి. కనుక ఒక రాత్రివిడిచి మరి యొక రాత్రి బోనులలో క్రొత్తక్రొత్త ఎరలను పెట్టవలెను. తియ్యని

నూనెతో రాచి బోనును పరిశుభ్రముగా నుంచవలెను. అగ్గి పుల్లలకు పైనుండు భాస్వరమును గోకి దానికి పిండియును బెల్లమును కలిసిన ముద్దనుచేసి మాత్రలుచేసి ఎలుకలకు విషముగా పెట్టవచ్చును. లేదా ఎలుకలను చంపగల విషమును తగరపు డబ్బీలలో తెప్పించవచ్చును. ఒక డబ్బీ విషమునకు ఒక సేరు పిండియును ఇంకొక సేరు బెల్లమును కలిపి గట్టిగానుండు ముద్దను చేయవలెను ఈ ముద్దతో 600 ల మాత్రలను చేయవచ్చును. సాయంకాలమునందు ఈ మాత్రలను ఎలుక కన్నములలోను, ధాన్యపు గాదెలక్రిందను, ఇంకను ఎలుకలురాగల ఇతర స్థలములందును ఉంచవలెను. బిడ్డలును ఇతర జంతువులును తిరుగు స్థలములందు వీటిని వేయకూడదు. ఎందువల్లననగా అవి బిడ్డలకును జంతువులకును ఖష వస్తువులు. ఎలుకలువచ్చి ఆ మాత్రలను తినువరకును వాటిని అచ్చటనే ఉంచవలెను ".

" ఈ విషమువలన ఎలుకలన్నియును ఒకర్రసారి చనిపోవునా ?" అని రాజడిగెను.

వైద్యశాస్త్రజ్ఞుడిట్లు పలికెను :— -" అట్లు జరుగదు. ఈ విషము వలన ఎలుకలన్నియును ఒకర్రసారి చనిపోనేరవు. కొన్ని ఎలుకలు తప్పించుకొని పోవును. అట్లు తప్పించుకొని పోయిన ఎలుకలు త్వరలోనే వృద్ధిచెంది తిరిగి యథాప్రకారముగ హెచ్చు సంఖ్యగలవిగా నుండును. గ్రామమందు ఉండు ఎలుకల సంఖ్య తక్కువకావలెనంటే మాసమునకు ఒకసారి గ్రామములోనుండు వారందరును ఒకర్ర రాత్రియందే తమతమ ఇండ్లలోని ఎలుకలకు విషము పెట్టవలెను ".

రాజు ఇట్లు పలికెను :—" విషముచేత ఎలుకలు చచ్చినపుడు వాటిమీదనుండు మిణ్ణల్లులు వాటిని వదిలి ఇంటనుండువారిని కుట్టవా ?".

వైద్యశాస్త్రజ్ఞుడిట్లు చెప్పెను :—" అట్లవి కుట్టినను బాధ లేదు. బొబ్బరోగము తగిలి చనిపోయిన ఎలుకనుండివచ్చు మిణ్ణల్లులవలన మాత్రమే ఉపద్రవము కలుగునుగాని విషముమింగి చనిపోవు వాటినుండివచ్చు మిణ్ణల్లులవలన అపాయము గలుగదు".

రాజు ఇట్లు పలికెను :—" ఈ దేశములో ఒకసారి ఏ గ్రామమందైనను బొబ్బరోగము వచ్చినయెడల తిరిగి శీతకాలమునందు ఆ గ్రామమునందే ఆ రోగము బయలుదేరుచుండును".

వైద్యశాస్త్రజ్ఞుడిట్లు చెప్పెను :—" ఆ రోగమునకు సంబంధించిన పురుగులు (లేక అంకురములు) ఆ గ్రామమందు అణగి ఉండుటచేత తిరిగి తిరిగి శీతకాలమునందు ఆ రోగము బయలుదేరుచుండును. ఆ రోగము బయలు దేరుటకు అనుకూలమైన కాలము తిరిగివచ్చునప్పటికి అణగియుండిన పురుగులు తిరిగి ఎలుకల రక్తములో ప్రవేశించును. అపుడా ఎలుకలు చచ్చిపోవును. తరువాత మనుష్యులకా రోగముచేత మరణము సంభవించును. గ్రామము ఎలుకలులేక పరిశుభ్రముగా నుండునపుడు ఇట్లు జరుగదు. అక్టోబరు నవంబరు నెలలలో ఈ రోగము బయలుదేరును కావున, శెప్టెంబరు నెలలోనే ఎలుకలకు విషముపెట్టవలెను. వసంత కాలమునందుకూడ ఈ రోగము హెచ్చుగా బయలుదేరును కాబట్టి ఫిబ్రవరి నెలలోకూడ ఎలుకలకు విషముపెట్టవలెను ".

రాజు ఇట్లు పలికెను :—" ఈ రోగమువలన కలుగు ధ్వంసమును మాన్పుకొనుటకు ప్రజలు చేయవలసిన మొదటి మార్గమును గురించి నాకు చక్కగ బోధించితిరి. ఈ రోగము తగిలిన గ్రామమందలి మనుష్యులు అట్టి రోగములేని మరియొక గ్రామమునకుపోయి అక్కడనుకూడ దానిని ఎలుకలకు వ్యాపింపజేయకుండునట్లు ఆ జనులు శ్రద్ధపుచ్చుకొనుట రెండవ మార్గముని నాతో చెప్పినావు. కాని ఈ దేశమందలి జనులు అతిథులను సత్కరించుట మిక్కిలి పవిత్రమైన పనిగా ఎంచెదరు. అది న్యాయమైన పనియే. కాని ఇట్టి ఆచారమునకు భంగము కలుగకుండునట్లు ఒక గ్రామములోని జనులు మరియొక గ్రామమునుండి వచ్చువారిని గ్రామములోపలికి రాకుండజేయుటకు ఏమిచేయవలెనో నాకు చెప్పవలయును ".

వైద్యశాస్త్రజ్ఞుడిట్లు పలికెను :—" ఈ విధముగ చేయవచ్చును. ప్రతి గ్రామములోనుండువారును ఊరి బయట ఒకటినిగాని రెంటినిగాని నివాసస్థలముల నేర్పరచవలెను. బొబ్బరోగముగల ప్రదేశమునుండివచ్చువానికి ఇక్కడ వసతి ఏర్పరచి వానిని అందు అయిదు దినములవరకును ఉంచవలెను. ఆ అయిదు దినములలోను అతడు తనదుస్తులను సామానులను నిత్యమును గాలిలోను ఎండలోను విప్పి ఆరబెట్టవలయును. ఇందు మూలమున వాని దుస్తులలోను సామానులలోను ఉండు మిణ్ణల్లులు చంపబడుచున్నవి. ప్రకాశముగల సూర్యరశ్మిచేత ఈ మిణ్ణల్లులు నశించును. నాలుగైదు దినములైన తరువాత అతనిని గ్రామములో ప్రవేశపెట్టినప్పటికిని ఏమియును భయముండదు."

రాజు ఇట్లు పలికెను :—"బొబ్బరోగము వ్యాపించకుండుటకు చేయ వలసిన రెండవ మార్గమును గురించి నాకు తెలిసినది. గ్రామమందలి ఎలుకలకు ఈ రోగము తగిలినపుడు అట్టి ఎలుకల నుండివచ్చు మిణ్ణల్లులు మనుష్యులను కుట్టకుండునట్లు వారు తప్పించుకొనవలెనన్నది మూడవ మార్గముగాని చెప్పితివి. వారు ఆ ప్రకారము ఎట్లు చేయగలుగుదురో నాకు చెప్పుము".

వైద్యశాస్త్రజ్ఞుడిట్లు చెప్పెను :—"బొబ్బరోగము చేత ఒక ఎలుక గ్రామములో చనిపోయిన వెంటనే, అచ్చటివారందరును తమతమ ఇండ్లను వదిలి ఊరి వెలుపలికిపోయి పొలములలో నివసింపవలెను. బొబ్బరోగము వలన ఎలుకలు నశించునపుడు వాటి శరీరములనుండి అనేకములగు మిణ్ణల్లులు బయలుదేరి ఇంటిలో నేలమీదను అన్నిచోట్లను ప్రవేశించును. ఆకరండనుండి అవి మనుష్యులను కుట్టి వారికి బొబ్బరోగమును తగిలించ గలిగియుండును. కావున ఆ యిండ్లలో మనుష్యులుండరాదు. ఉండినయెడల వారిని ఈ మిణ్ణల్లులు కుట్టును. అందువలన బొబ్బరోగము వచ్చును".

రాజు ఇట్లు పలికెను :—"ఇట్లు ఇండ్లను వదిలి కొన్ని వారముల వరకును పొలములలోపోయి నివసించుట చాల కష్టముగానుండునని అనేకులు చెప్పుదురు."

వైద్యశాస్త్రజ్ఞుడిట్లు పలికెను :—"అంత తెలివి హీనముగా చెప్పు వారికి అందరకును, రాజా ! తామీ విధముగ సెలవిండు : 'బొబ్బరోగము వలన ప్రాణములు పోగొట్టుకొని చచ్చిన శవముగా తిరిగి ఎన్నటికినివచ్చు ఆశ లేక మనుష్యుడు ఇంటిని వదిలిపోవుటకంటె, ఇంటిని వదిలి కొన్ని వారములు పొలములలో ఉండి తిరిగి సజీవుడై ఇంటికివచ్చుట మేలు."

రాజు ఇట్లు పలికెను :—"నీవు చాల వివేకముగా చెప్పినావు. అయితే ప్రజలు ఇట్లు ఎంతకాలము ఊరి వెలుపలనుండవలెనో చెప్పుము".

వైద్యశాస్త్రజ్ఞుడు ఇట్లు పలికెను :—"ఇంటిలోని ఎలుకలు చచ్చినపుడు, ఎవరుగాని పదిదినములవరకును ఆ యింటిలోనికి పోరాదు. అంతవరకును మనుష్యులు ఆ యింటిలో ఎంతమాత్రమును నివసింపరాదు. అట్టి యింటిలోపలికి రాత్రిసమయమునందు ఎన్నడును పోగూడదు. పగటికంటె రాత్రియందు ఈ మిణ్ణల్లులు అధికముగా కుట్టును. ఊరి

బయట పదిదినములవరకును తప్పక ఉండవలెను. రెండు మాసముల వరకును ఉండుట యింతకంటె శ్రేష్ఠముగా నుండును ".

రాజు ఇట్లు పలికెను :—" అటుతరువాత వారు ఇండ్లకు పోవచ్చునా ? లేక ఆ యిండ్లలో వారు ప్రవేశించుటకు ముందేమయినను చేయవలెనా ? "

వైద్యశాస్త్రజ్ఞుడిట్లు చెప్పెను :—" వారు ఇండ్లలో ప్రవేశించుటకు ముందు వాటిలోనుండు మిన్నెల్లను అన్నిటిని చంపివేయుట అవసరమైనపనిగా నుండును. అన్ని గదులలోను మంటలువేసి మండుచున్న నిప్పులను ఇంటిలోనుండు మూల మూలలకును అంచులకును తీసికొనిపోవలెను. ఇట్లు చేసినయెడల అందుండు మిణ్ణలులన్నియును నశించును. అటుతరువాత ఎలుకకన్నములను అన్నిటిని కప్పివేసి గదులకు మట్టిపూత వేయవలెను. ఈ పనులన్నియును చేసిన తరువాతగాని యిండ్లు వాసయోగ్యములుగా నుండవు ".

రాజు ఇట్లు పలికెను :—" బొబ్బరోగము తగిలి ప్రజలు నశించకుండుటకు వారు టీకాలు వేయించుకొనవలసియుండుట నాల్గవ మార్గమని నీవు చెప్పినావు ".

వైద్యశాస్త్రజ్ఞుడిట్లు చెప్పెను :—" అవును. ప్రతి సంవత్సరమును హిందూదేశములోని అన్ని భాగములందును అనేకవేలమందికి టీకాలు వేయబడుచున్నవి. అట్లు టీకాలు వేయించుకొనినవారిలో కొద్దిమంది మాత్రమే బొబ్బరోగమువలన చనిపోవుచున్నారు. టీకాలు వేయించుకొనని వారిలో చాలమంది చనిపోవుచున్నారు ".

" ఇట్లు టీకాలు వేయించుకొనుటవలన ఏమయినను హానికలుగునా?" అని రాజడిగెను.

వైద్యశాస్త్రజ్ఞుడిట్లు పలికెను :—" ఈ టీకాలవలన అపాయమేమియును లేదు. వాటివలనకలుగు బాధయును బహు స్వల్పము బొబ్బరోగమువలన చచ్చుటకంటె కొంచెము బాధపడుటయే మంచిదని విశ్వసించి అందరును టీకాలు వేయించుకొనుటకు సమ్మతింపవలయును. టీకాలవలన దృష్టి తగ్గును అనిగాని దుర్బలత్వము వచ్చునని గాని చెప్పుదానిలో నిజములేదు. ప్రతి సంవత్సరమును హిందూదేశములోనున్న వేలకొలది జనులకు టీకాలువేయబడుచున్నవి. అందువలన వారు బొబ్బరోగ

మునుండి సంరక్షింపబడుచున్నారుగాని వారిలో నెవరికినిగాని ఏ విధమయిన హానియును కలుగుచుండుటలేదు. దుర్మార్గులు మాత్రమే అందువలన దృష్టి తగ్గుననియు బలము చెడుననియు లేనిపోని సంగతులను చెప్పుచుందురు. టీకాలు ఉండిన మనుష్యునకు బొబ్బరోగము సాధారణముగా రానేరాదు. కనుక బొబ్బరోగము వ్యాపించియున్న స్థలములందు నివసించువారందరును టీకాలు వేయించుకొనవలెను. ఎందువల్లనంటే టీకాలున్న మనుష్యునకు బొబ్బరోగమువలన మరణము సంభవింపనేరదు. అది నిశ్చయము ".

రాజు ఇట్లు పలికెను :—" బొబ్బ రోగము వచ్చినవారు నెమ్మదిగా ఉండి మంచి చికిత్సనుపొందుట ఈ రోగమునుండి సంరక్షింపబడుటకు తగిన ఏకైక మార్గమని చెప్పినావు ".

వైద్య శాస్త్రజ్ఞు డిట్లుపలికెను :—" బొబ్బరోగము వచ్చినవారిని చీకటి గదులలోనుంచి వారికి తగిన చికిత్స చేయించక పోవుటచేతనే ఇట్టి రోగులనేకులు చచ్చుచున్నారు. బొబ్బరోగము రాగానే రోగిని ఇంటినుండి పైకి తీసికొనిపోయి ఇంటి కప్పుమీదనో లేక ఇంటి ఆవరణములోనో, మంచిగాలి ప్రసరించు స్థలములోనుంచి పరుండ బెట్టవలయును. చీకటిగా ఉన్నయెడల రోగికి మరణము సంభవించును. వెలుతురును మంచిగాలియును వాని ప్రాణములను రక్షించును. బొబ్బరోగము తగిలిన వారిని అందరను తత్క్షణమే బయటికి తీసికొనిపోయి శుభ్రమైన గాలిలోనే రేయింబగళ్లు ఉంచవలెను. తిరిగి జాడ్యము కొంచెము కుదురువరకును నిచ్చటనే ఆరోగు లుండవలెను. రోగి బయట నున్నపుడు వానికి ఉపచారము చేయుచుండువారికి అపాయమేమియును కలుగదు ఈ వ్యాధివలన బాధపడువారికి త్వరలోనే అతి నిస్సాణ కలుగును. కావున వారిని మంచము మీదనే పరుండబెట్టి ఉంచవలయును. ఇటు అటు వారు తిరిగిన యెడల వారికి హఠాత్తుగా మరణము సంభవించినను సంభవించును. వారికి బలము తగ్గకుండుటకై కావలసినన్ని పాలను, దేనితోనైనను కాచిన చారును ఇయ్యవలెను. చీకటి గదులలో వదిలివేయబడి చనిపోవలసియుండు రోగులలో అనేకులకు ఇట్టి సూక్ష్మ మార్గములచేత తిరిగి జాడ్యము కుదురును. బొబ్బ జాడ్యమునకు తగిన ఔషధములు మంచివి చాల గలవు. కావున మంచి వైద్యుడు దొరకనపుడు అట్టి వానిని పిలిపించవలయును".

రాజు ఇట్లు పలికెను :—"బొబ్బ రోగమువలన కలుగు నాశనమును ఆపగలిగిన మార్గములు ఐదును నాకు చక్కగా బోధపడినవి : వాటిలో,—

మొదటిది. గ్రామములందును పట్టణములందును ఉండు ఎలుకల యొక్క సంఖ్యను తగ్గించుట ;

రెండవది. బొబ్బ రోగము ప్రబలియుండు స్థలములనుండి ఎలుక మిణ్ణల్లలను తెచ్చి ఎవరుగాని తక్కిన పట్టణములలోను గ్రామముల లోను ఉండు ఎలుకలకు ఈ రోగమును వ్యాపింపజేయకుండునట్లు తగిన ఏర్పాటులను చేయుట ;

మూడవది. ఏ గ్రామమందైనను పట్టణమందైనను ఎలుకలకు ఈ రోగము తగిలియున్నపుడు, అచ్చటనుండు జనులు ఆ ఎలుకలనుండి వచ్చు మిణ్ణల్లులబారి నుండి తప్పించుకొనునిమిత్తము తమతమ ఇండ్లను విడిచి పొలములకుపోయి నివసించుట ;

నాల్గవది. ఎందుండు జనులైనను చుట్టుపట్ల బొబ్బ రోగము బయలు దేరినపుడు టీకాలను వేయించుకొనుట ;

ఐదవది. బొబ్బరోగము తగిలిన రోగులను నెమ్మదిగా ఉంచి వారికి తగిన చికిత్స చేయించుట ;

ఎంత నీచుడైనను ఎట్టి బీదవాడైనను కొంచెము మాత్రము ప్రయత్నించినయెడల తన ప్రాణములను రక్షించుకొనుటకై ఇట్టి నిబంధనములను ఆచరించవచ్చును. ఈ పనులయందేమియును కష్టము లేదు".

వైద్య శాస్త్రిజ్ఞు డిట్లు పలికెను :—"రాజా ! తాము సెలవిచ్చినది సత్యము. హిందూ దేశములో బొబ్బరోగము రానైయున్న స్థలములలో నివసించు ప్రతివారును ఇట్టి నియమములను తప్పక అవలంబించినయెడల మరుసటిదినమునుండియును దేశమం దెచ్చటను బొబ్బరోగము వ్యాపించక అంతరించును. కొద్దిమందికి మాత్రమే ఈ నిబంధనములు తెలిసియుండుట విచారకరమైన విషయముగానున్నది. ఆ నిబంధనములయొక్క నిజమును గ్రహించినవారు అంతకంటెను స్వల్పముగానుండుట ఇంకను విచారకరమైన సంగతిగానున్నది. అట్టి నిబంధనముల ప్రకారము నడుచుకొనుటకు ప్రయత్నపడువారు మిక్కిలి స్వల్పముగానుండుట అన్నిటికంటెను ఎక్కువ విచారకరమైన విషయముగానున్నది.

అయినను ఇందుల కెవరుగాని నిరాశను పొందవలసిన పనిలేదు. ఈ బొబ్బ రోగము విషయమున ఎవ్వరైనను తమ్ము తామే రక్షించుకొనగలరు. రాజా! ఈ దేశములోనున్న ఇంగ్లీషువారిని జూడుము. వారి చుట్టును ఈ రోగము ప్రబలియున్నను వారికి మాత్రము ఈ రోగమువలన బాధ కలుగుచుండుటలేదు. అందులకు కారణమేమి? అట్టి రోగము తమదగ్గరకు రాకుండునట్లు తగినపనులన్నిటిని వారంతట వారే చేసికొనుచున్నారు. ఇదియే కారణము వారి ఇండ్లలో ఎలుకలు జేరకుండునట్లు జాగ్రత్త పడుదురు. అన్నిటికంటెను ముఖ్యముగా వారు తమ ఇండ్లను పరిశుభ్రముగానుంచి వాటిలో మంచిగాలియును వెలుతురును ప్రసరించునట్లు చేయుదురు. చుట్టుపట్ల బొబ్బరోగము ప్రబలినపుడు వారు తత్క్షణమే టీకాలు వేయించుకొందురు. ఇంతియెగాక బొబ్బ రోగము తగిలిన యెడల వెంటనే వైద్యుని పిలువనంపి తగిన ఔషధములను తీసికొని రోగమును కుదుర్చుకొందురు. ఈ నిబంధనములన్నియును వారికి తెలిసియుండుటచేతను, వాటియందు వారికి నమ్మక ముండుటచేతను, వాటిని అనుసరించి నడచుకొనుటకు ఇష్టపడి వారు ప్రయత్నించుటచేతను, హిందూదేశమునందు నివసించు ఇంగ్లీషువారు ఈ రోగమువలన చనిపోవుట లేదు. అందుల కిదియే కారణముగాని మరి ఒకటి లేదు. ఇంగ్లీషువారిని బొబ్బ రోగమునుండి సంరక్షించదగిన మార్గములే దేశస్థులుగా నుండువారిని కూడ ఏమియును హెచ్చు తగ్గులేక సంరక్షించుననుటకు లేశ మాత్రము సందేహము పడవలసిన పనిలేదు. ఇంగ్లీషువారినైనను దేశస్థులనైనను, గొప్పవారినైనను కొద్దివారినైనను భాగ్యవంతులనైనను బీదవారినైనను, ముమ్మాటికిని నిశ్చయముగా ఈ నిబంధనములే రక్షించగలవు. కాని వారు మాత్రము వీటిని చక్కగ గ్రహించి, వాటియందు విశ్వాసముగలిగి, వాటిని అనుసరించి నడుచుకొనవలయును".

వైద్య శాస్త్రజ్ఞుడు ఇట్లు బొబ్బ రోగమును గురించి తాను చెప్పవలసిన దానిని అంతయును చెప్పి రాజువద్ద సెలవు తీసికొని పోవుటకు సిద్ధముగా నున్నపుడు ప్రధానివారున్న గదిలోనికి తొందరగావచ్చి రాజుతో ఇట్లనెను :—"రాజా! ఈ పట్టణముయొక్క కొత్వాలు ఇప్పుడే తొందరగా గుర్రముపైని ఎక్కి నగరునకువచ్చి పట్టణములో కలరా బయలుదేరినది అని నాతో చెప్పినాడు".

"కొత్వాలును ఇక్కడికి పిలువుము" అని రాజుపలికెను.

17 వ ప్రకరణము.

[కలరా. కలరా వ్యాపించు విధము. కలరా రాకుండుటకు చేయవలసిన పనులు. చక్కగ పండని పండ్లవలనను అపరిశుద్ధమైన నీటివలనను కలుగు అపాయము. కలరా వచ్చినపుడు చేయవలసిన పనులు.]

కొత్వాలు రాగానే రాజువారితో ఇట్లనెను:—"పట్టణమందలి కలరాను గురించిన వర్తమానము ఏమి?".

కొత్వాలు ఇట్లు చెప్పెను:—"ఈ దినమున ఇద్దరు మనుష్యులు కలరా వలన చనిపోయినట్లు ఇప్పుడే విని యున్నాను ఈ మనుష్యు లిద్దరును పట్టణములో వేరువేరు భాగములందు ఉన్నవారు అగుటచేత ఈ వ్యాధి ఇదివరకే వ్యాపించియుండునని భయపడుచున్నాను. ఈ సంగతి ప్రధానితో చెప్పుటకును ఎంతమాత్రమును ఉపేక్ష చేయరాని ఈ విషయములో వారి ఆజ్ఞలను తీసికొనుటకును ఇంత వేగముగా నుద్రముగ ఇక్కడికి వచ్చియున్నాను".

రాజు ఇట్లుపలికెను:—"కొత్వాలూ! తత్క్షణమే ఈ వార్తను నీవు మాకు తీసికొని వచ్చుట చక్కగానున్నది. ఏ గ్రామమందైనను పట్టణమందైనను మొట్టమొదట కలరా వచ్చినవారి విషయమై ఆలస్యము చేయక వెంటనే శ్రద్ధను తీసికొనిన యెడల ఈ భయంకరమైన జాడ్యము వ్యాపించకుండుటకు చాలవరకు పనిచేయవచ్చును. ఇట్టి వర్తమానమే లేకపోయి బస్తీలలోను, పట్టణములలోను, గ్రామములలోను ఏమియును చేయక ఊరక ఉండిన యెడల కలరా అన్ని వైపులను వ్యాపించును. అప్పుడు కలరా వ్యాపించకుండునట్లు చేయుట ఎక్కువ కష్టముగా నుండును. కావున ఇప్పుడే ప్రధానిని ఈ వైద్య శాస్త్రజ్ఞుని ఆ యిద్దరు మనుష్యులును చనిపోయిన ఇండ్లకు తీసికొనిపొమ్ము. వారిద్దరును ఇచ్చు ఆజ్ఞల ప్రకారము ఎంతమాత్రమును ఆలస్యము చేయక పనిచేయించుము".

అప్పుడు ప్రధాని, వైద్య శాస్త్రజ్ఞుడు, కొత్వాలు ఈ ముగ్గురును కలిసి బండిమీద పట్టణమునకు పోయిరి.

"మొదట మనము అంగడివాడగు విధి చంద్రుడనువాని ఇంటికి పోవుదము. అతని కుమారుడగు రామలాలు ఈ రోజుననే కలరావలన చనిపోయినాడు" అని కొత్వాలు పలికెను.

విధి చంద్రుని ఇంటికి వారు వెళ్లినతోడనే ఆ దినము మధ్యాహ్నము రామలాలు కలరా వలన చనిపోయినట్టును, అందువలన అతని బంధువులు శవమును దహనము చేయుటకై తీసికొని పోయినట్టును వారికి తెలిసినది. ఇంటిలో రామలాలు తమ్ముడగు వీరభానుడున్నాడు. వీరభానునకుగూడ కలరావచ్చి జబ్బు చేసినదిగాని ఇపుడు కొంచెము నెమ్మదిగా నున్నది.

వీరభానునితో ప్రధాని ఇట్లు పలికెను :—“ నీకును నీ అన్నయగు రామలాలునకును కలరా ఎట్లు వచ్చినదో చెప్పుము ”.

వీరభానుడు ఇట్లు చెప్పెను :—“ ఈ ప్రకారముగా జరిగినది : క్రిందటి నెలాఖరున నా తండ్రియగు విధి చంద్రుడును, నా అన్నయగు రామలాలును, నేనును ఇక్కడికి నాలుగు దినముల ప్రయాణములోని స్థలమునందు జరిగిన గొప్ప సంతకు పోయియుంటిమి. మాతోకూ పట్టణమందలి బంగారపు పనివాండ్రగు శివదయాలుడును కర్మ చంద్రు వచ్చియున్నారు. మేము ఐదుగురమును సంత దగ్గరనే బసచేసికొనిం టిమి. అక్కడ దేవి దాసుడను పేరుగల ఒక సిపాయి మమ్ములను కలి కొన్నాడు. అతని పటాల మిప్పుడు బర్మాదేశమునందున్నది. అతడు సెలవు తీసికొని ఇంటికి ప్రయాణమై వచ్చుచుండెను. మేము అందరమును కలిసి ఒక చిన్న ఆవరణముగలగదిని అద్దెకు తీసికొని అచ్చటనే ఉండి వండుకొను చుంటిమి ; ఆ సంతవద్ద మేమున్నపుడే అనేకులు కలరావచ్చి చనిపోవుచున్నారని వినియుంటిమి. కాని మేము క్షేమముగానే ఉంటిమి. అయితే ఒక దినము మధ్యాహ్నమందు వాంతులును విరేచనములును కలిగి విధి చంద్రునికి చాల జబ్బుచేసి మూడు గంటల కాలములోపలనే మరణము సంభవించినది. అతడు కలరావలననే చనిపోయినాడు. అందున కేమియును సందేహము లేదు ”.

“ మీ తండ్రి ఏ దినమున చనిపోయినాడు ? ” అని ప్రధాని అడిగెను.

వీరభానుడు ఇట్లు చెప్పెను :—“ ఇది ఈ నెలలో పండ్రెండవ దినము. మా తండ్రి విధి చంద్రుడు, ఈ నెల ఐదవరోజు సాయంకాలము చనిపోయినాడు. అతడు చనిపోయినవెంటనే సాయంకాలమునందే శవమును తీసికొనిపోయి దహనముచేసితిమి. ఆరవనాటి ఉదయమున మేము ఇంటికి బయలుదేరినాము. ఇక్కడికి రెండుదినముల ప్రయాణములో

నున్న స్థలమందు పడవనాటి మధ్యాహ్నమున ఆగితిమి. ఆనాటి సాయం కాలమున ఇద్దరు బంగారపు పనివాండ్రలో ఒకడగు శివదయాలుడు కలరావచ్చి జబ్బుపడి కొన్నిగంటల కాలములోపలనే చనిపోయెను. ఆ సాయంకాలమే అతని శవమును దహనముచేసితిమి. అతడుపోయిన మరునటి ఉదయముననే తిరిగి ప్రయాణమైతిమి. ఆ దినమున సిపాయి దేవిదాసుడు మరియొక రోడ్డుమీద అతని ఇల్లుండుటచేత మమ్ములను విడిచి వెళ్లెను. ఈ నెల తొమ్మిదవనాటి మధ్యాహ్నమున మిగిలిన ముగ్గురమును అనగా బంగారపు పనివాడగు కర్మచంద్రుడును, నేనును, నా అన్న రామలాలును, పట్టణము చేరితిమి. కర్మచంద్రుడు తన యింటికిపోయెను. నేనును నా అన్న రామలాలును ఇక్కడకు వచ్చితిమి. ఆ రాత్రి నా అన్న రామలాలునకును నాకును కలరావచ్చి జబ్బుచేసినది ఈ దినము మధ్యాహ్నమున రామలాలు చనిపోయినాడు. మా స్నేహితులు శవమును దహనమునిమిత్తమై తీసికొనిపోయినారు. కాని దైవానుగ్రహమువలన నాకు కొంచెము జాడ్యము కుదురుచున్నది అయినను నాకు ఇంకను నీళ్ల విరేచనములు కట్టలేదు".

ప్రధాని ఇట్లు పలికెను :—"ఆ బంగారపు పనివాడు అనగా కర్మచంద్రుడు ఎచ్చట నివసించుచున్నాడు ?".

"అతడు కూరగాయల అంగళ్లకు దగ్గరనున్న వీథిలోనున్నాడు" అని వీరభానుడు చెప్పెను.

"ఈదినమందు కలరావలన చనిపోయిన రెండవ మనుష్యుడు అతడే. అతనిపేరుకూడ అదియే. అతనుండు స్థలమును అదియే" అని కొత్వాలు చెప్పెను.

"అయ్యయ్యో! సంతవద్ద కలిసియున్న మా ఆరుగురిలోను దేవిదాసుడును నేనును మాత్రమే జీవించియున్నాము. ఇక్కడికి ఒకదినము ప్రయాణములోనున్న కొండలమొదట ఉన్న గ్రామములో దేవిదాసుడు ఉన్నాడు".

"ఒకవేళ అతనికిని కలరావచ్చి యున్నదేమో? కావున నేనును వైద్య శాస్త్రజ్ఞుడును రేపు ఉదయము ఆ గ్రామమునకు పోయి అతని వర్తమానమును కనుగొనెదము".

"సంతదగ్గర మీరు ఏ నీటిని త్రాగినారు" అని వైద్యశాస్త్రజ్ఞుడు అడిగెను.

" ఈ సంత ఒక చెరువుచుట్టును జరుపబడినది. ఆ చెరువులోని నీటినే మేమందరమును త్రాగినాము " అని వీరభానుడు చెప్పెను.

" ఆ సంతలో పండ్లను ఎక్కువగా మీరు తిని యుంటిరా " అని వైద్య శాస్త్రజ్ఞుడడిగెను.

" మామిడిపండ్లును ఖర్బూజాకాయలును అధికముగా సంతలో అమ్మబడినవి. అవి చాల చవుకగా ఉండుటచేత మేము వాటిని అధికముగా తినినాము " అని వీరభానుడు చెప్పెను.

వైద్య శాస్త్రజ్ఞు డిట్లు చెప్పెను :—" ఆ చెరువు నీటిని త్రాగుటయును అంత ఎక్కువగా పండ్లను తినుటయును కూడ చేయతగనిపనులే. కలరాపురుగులు (లేక అంకురములు) సాధారణముగా మురికినీటిలోనుండును. అదియునుగాక కలరా ప్రవేశించిన స్థలములలో బాగుగ పండని పండ్లను తినకూడదు. పండ్లవలన నీళ్ల విరేచనములు కలగును. కొంచెముగా నీళ్ల విరేచనములు అగుచున్న మనుష్యునకయినను కలరా రాగలదు. పండ్లను సాధారణముగా మనుష్యులు మురికినీళ్లలో అజాగ్రత్తగా కడుగుదురు. అందువలన ఆ మురికి నీటిలోనుండు కలరా పురుగులు (లేక అంకురములు) ఆ పండ్ల నంటియుండును. కలరా ఉన్నప్పుడు మిక్కిలి పరిశుద్ధముగానుండు నీటినే త్రాగవలయును. వంటచేయబడని పండ్లనుగాని శాక పదార్థములనుగాని ఎన్నటికిని తినకూడదు. తప్పక మనుష్యుడు తినునట్టి ఆహారము మూలముననో అతడు త్రాగు నీటిమూలముననో అతని అన్నకోశములోనికి కలరాపురుగులు (లేక అంకురములు) ప్రవేశించి అతనికి కలరా జాడ్యమును తెచ్చుచున్నవి. ఉష్ణము చేత ఈ పురుగులు (లేక అంకురములు) నశించును. అందువలన కలరా ఉండిన స్థలములలోని వారు బాగుగ మరుగబెట్టిన నీటిని పాలను మాత్రమే త్రాగవలెను. అటువలెనే వారు చక్కగ వంటచేయబడిన శాక పదార్థములను ఆహారమును మాత్రమే భుజింపవలయును".

" ఈ జాడ్యము వ్యాపించకుండుటకు మనమేమి చేయవలెను ? " అని ప్రధాని వైద్యశాస్త్రజ్ఞుని అడిగెను.

వైద్య శాస్త్రజ్ఞు డిట్లు చెప్పెను :—" కలరా వచ్చినమనుష్యునకు వాంతులును భేదులును అగునుకదా ! అట్టి వాంతుల మూలమునను భేదుల మూలమునను వెలువడు ద్రవ్యములలోనే కలరా పురుగులు (లేక అంకు

ము. వీరభానునకు ఇంకను విరేచనము లగుచున్నవి.
మట్టి పాత్రలను తీసికొనివచ్చి వాటిలోపల పొడిమట్టినిగాని
సున్నమునుగాని ఉంచి, వాటిలోనికి వీరభానుడు చేసి
ల మూలమునను విరేచనమూలమునను పైకివచ్చు ద్రవ్యము
డుము. ఆ ద్రవ్యములలో లేశమునైనను నేలమీద విడిచివేయ
అటువెనుక వీటితో నింపబడిన పాత్రలను అటులనే భూమిలో
ంచవలెను. వాటిని బావికి దగ్గరగాగాని నీటికి వసతిగానుండు
ర స్థలమునకు దగ్గరగాగాని పాతి పెట్టించకూడదు".

ఈ గదిలో ఎవరుగాని వంటచేసికొనకూడదు. ఎవరును ఇక్కడ
మును భుజించకూడదు. ఇతనికి కొంచెము జాడ్యము కుదర
దిక్రింకను అన్నిచోట్లను మంటలు వేయవలెను. మందుచున్న
గదియొక్క నాలుగు వైపులకును తీసికొనిపోవలెను. ఈ గదికి
గోడలమీదను మట్టిపూతను వేయవలెను. చనిపోయిన ఇతని
యొక్క పరపును పరపుగుడ్డలను చాలరోజులు ఎండబెట్టవలెను.
వాటిని తగులబెట్టవలెను. రామలాలుని శవమును దహనమునకు
వాత మోసికొనిపోయినవారు ఆహారమును తినుటకుముందు వారి చేతు
లను దేహములను పరిశుభ్రముగ కడుగుకొనవలెను".

"ఈ ఇంటి చెంతనుండు బావులలో కలరాపురుగులు (లేక అంకు
రములు) చేరియుండు ఉపద్రవముకూడ తటస్థించి ఉండవచ్చును. కావున
ఈ ఇంటిదగ్గరనుండు బావులలో 'పెర్మాంగనేట్ ఆఫ్ పొటాష్' *
అను ఎర్రటి వస్తువును వేసి వాటిలోని నీటిని పరిశుభ్రము చేయవలెను".

"కొత్వాలు కర్మచంద్రుడు చనిపోయిన ఇంటికికూడ పోయి మన
మిచ్చట చేయించిన పనులనే అచ్చటను చేయించవలెను."

---

* ఒక బావి లేక నూతిలోనుండు నీటిని పరిశుభ్రపరచుటకు దానిలో "పెర్మాంగనేట్ ఆఫ్ పొటాష్" అనుదానిని కలుపవలెను. నీటికి అంతటికిని కొంచెము ఎరుపువర్ణము వచ్చువరకును దీనిని కలుపవలెను. బావి విషయములో ఒక కడవ నీటికి $1\frac{1}{2}$ తులముల "పెర్మాంగనేట్ ఆఫ్ పొటాషు" ను చేర్చి, అందు ఆ "పెర్మాంగనేట్ ఆఫ్ పొటాషు" అంతయును కరిగిపోవునట్లు నీటిని బాగుగ కలపవలెను. అప్పుడా కుండలోని నీటిని బావిలో పోయవలెను. బావిలోని నీరుకూడ కొంచెము ఎర్రబడువరకును ఇట్లు పదేపదే చేయవలెను. తరువాత రెండుగంటల కాలమువరకును బావిజోలికి పోకయుండవలెను. అటుపిమ్మట బావిలోని నీటిని తోడిపైని పోయవలెను. ఆ నీటికి ఉండు ఎరుపువర్ణము కొంచె మించుమించుగా పోవువరకును ఇట్లుతోడి పోయవలెను. తరువాత బావిలోని నీటిని ఉపయోగింపవచ్చును.

" రేపటి దినమున మనము సిపాయి దేవిదాసుడు
మునకు పోవుదము."

" పట్టణమునందుండు బావులకు ఒకొ్కకదానికి ఇద్ద
నీళ్ల మనుష్యులను నియమించవలెను. ఆ నీళ్ల మనుష్యులకి
పరిశుద్ధముచేయబడిన పాత్రను ఇయ్యవలెను. ఆ పాత్రతో
నీళ్లను తోడవలెను. ఆ పాత్రగాక మరియొక పాత్రతో నీ
తోడకూడదు. ఆ నీళ్ల మనుష్యులుతప్ప మరియొకరు నూతిలో
వేసి నీటిని తీయరాదు."

" ఈ పనులను అన్నిటిని చేయించుమనియు, తాను నిత్యమ
ళ్లదగ్గరకుపోయి అచ్చట బాగుగపండని పండ్లును చెడినపండ్లను
కుండునట్లు చేయుమనియు, కొత్వాలును ఆజ్ఞాపించుము."

---

18 వ ప్రకరణము.

[ప్రజలు త్రాగెడు నీళ్ల బావులదగ్గరను ఊటలదగ్గరను బట్టలను
ఉతుకుటచేత కలుగు ఉపద్రవము.]

మరునాటి ఉదయమున వైద్య శాస్త్రజ్ఞుడును ప్రధానియును సిపాయిదేవిదాసుడున్న గ్రామమునకు గుర్రములనెక్కి శీఘ్రముగా పోయిరి. వారు ఆ గ్రామమునకు పోయినపుడు అచ్చటి జనులలో అనేకులు కలరా వలన చనిపోవుచుండుటయును అందువలన గ్రామములో నుండు వారందరును తత్తరపాటు గలిగియుండుటయును చూచిరి.

" ఈ గ్రామములో మొదట ఎవరికి కలరా వచ్చినది ? అత డెప్పుడు చనిపోయినాడు ?" అని ప్రధాని అడిగెను.

అందుమీద గ్రామాధికారి ఇట్లు ఉత్తరము చెప్పెను :—" బర్మాదేశములో ఉండిన తన పటాలమును విడిచి సెలవుతీసికొని దేవిదాసుడను సిపాయి ఇక్కడనున్న తనయింటికి వచ్చినాడు. అత డే మొదట కలరా వచ్చి చనిపోయినాడు. అతడు ఈ గ్రామమును ఈ నెల తొమ్మిదవరోజున చేరెను. ఆనాటి సాయంకాలమునందే కలరావలన దేవిదాసుడు చనిపోయెను."

" అతనికి కలరా ఎట్లువచ్చినది ? " అని ప్రధాని అడిగెను.

అందుపైని గ్రామాధికారి ఇట్లు పలికెను :—" ఇక్కడికి నాలుగుదినముల ప్రయాణములోనున్న స్థలమందు జరిగిన గొప్ప సంతవద్ద

తాను ఆగియుండినట్లు దేవిదాసుడు చనిపోవుటకు ముందు మాతో చెప్పి యున్నాడు. అచ్చట తనతోకూడ ఉండినవారిలో కొందరు కలరావలన చనిపోయినారని అతడు చెప్పెను. వారివలన ఇతనికికూడ కలరావచ్చి యుండవచ్చును".

"అప్పటినుండి ఇప్పటికి ఎంతమందికి కలరావచ్చినది?" అని ప్రధాని అడిగెను.

అందుమీద గ్రామాధికారి ఇట్లు చెప్పెను :—"ఈ లోపున డెబ్బది మందికి తక్కువగను అరువదిమందికి ఎక్కువగను కలరావచ్చినది. వారిలోఅనేకులు చనిపోయిరి. అయితే ఈ విషయములో ఒక విచిత్రము ఉన్నది. ఈ గ్రామమునకు మధ్యగా ఎండిపోయిన వాగు ఒకటి ఉన్నది. అది ఈ గ్రామమును రెండు సమభాగములుగాచేయుచున్నది. ఈ వాగునకు ఇటువైపునఉన్నవారికే కలరావచ్చియున్నది. ఈ వైపుననే సిపాయి దేవిదాసుడుకూడ నివసించుచుండెను కాని వాగునకు రెండవప్రక్కను ఉన్నవారిలో ఎవరికిని కలరా వచ్చియుండలేదు".

"రెండు ప్రక్కలను ఉండువారును త్రాగెడు నీరు ఒకటియేనా?" అని వైద్య శాస్త్రజ్ఞుడు అడిగెను.

"కాదు. ఈ ప్రక్కనుండువారికి ఒక ఊటకలదు. రెండవప్రక్కనుండువారికి ఇంకొకటికలదు" అని గ్రామాధికారిచెప్పెను.

అపుడు వైద్యశాస్త్రజ్ఞుడు ప్రధానితో ఇట్లు పలికెను :—"ఈ ప్రక్కనుండునీటిలో కలరా పురుగులు (లేక అంకురములు) తప్పకచేరియుండవలెను. కావున వాగునకు ఈ ప్రక్కనుండు ఊటలోని నీటిని ఎవరును ఉపయోగించరాదని గ్రామాధికారికి ఆజ్ఞనిమ్ము. ఇంతకుముందు దానిలోనుండి తీసిన నీటిని బయిటపోయించుము. మరియును "పెర్మాంగనేట్ ఆఫ్ పొటాష్"ను ఉపయోగించి అందలి నీటిని పరిశుభ్రముచేయించుము".

గ్రామాధికారికి ఈ యాజ్ఞలనుఇచ్చి ప్రధాని వైద్యశాస్త్రజ్ఞునితో కలిసి సిపాయి దేవిదాసుడు చనిపోయిన ఇంటికి వెళ్లిరి. అక్కడ ఇంటిలో సిపాయి దేవిదాసుని తల్లిఉన్నది.

"దేవిదాసుడు చనిపోయినపుడు అతడు ధరించుచున్న దుస్తులను చూపుము?" అని వైద్యశాస్త్రజ్ఞుడడిగెను.

అప్పుడు ఆమె లోపలికిపోయి కొన్ని దుస్తులను తీసుకొనివచ్చి వైద్య శాస్త్రజ్ఞునకును ప్రధానికిని కనుపరచెను. అవి పరిశుభ్రముగానున్నవి.

వైద్యశాస్త్రజ్ఞుడిట్లుపలికెను :—"నీ కుమారుడగు దేవిదాసుడు చాలకాలము ప్రయాణముచేసివచ్చియున్నాడు. అందువలన ఇచ్చటచేరి నపుడు అతని దుస్తులు చాలమురికిగానుండవలెనుకాని ఇంత పరిశుభ్రముగానుండవు".

ఆమె ఇట్లుచెప్పెనది :—"అవును. ఆమాట నిజమే. అతడు వచ్చినపుడు దుస్తులకు ప్రయాణపుమురికి చాలఉండెను. అదియునుగాక అతనికి జబ్బుచేసి వాంతులును భేదులును అయినప్పుడు ఈ దుస్తులుకూడ చాలమురికి అయినవి. అందుచేత అతడు చనిపోయినవెనుక నేనువీటిని తీసికొనిపోయి ఆయూటదగ్గర ఉతికినాను".

"వాటిని ఏ యూటదగ్గర ఉతికినావు" అని ప్రధాని అడిగెను.

ఆమె ఇట్లు బదులుచెప్పినది :—"వాగునకు ఈ ప్రక్కను ఒకటి ఊటమాత్రమే ఉన్నది. దానిలోనుండి మేము త్రాగుటకు నీటిని తీసికొనివచ్చుచున్నాము. అక్కడనే నేను ఈ దుస్తులను ఉతికినాను".

అపుడు వైద్యశాస్త్రజ్ఞుడు ప్రధానివైపు తిరిగి ఇట్లనెను :—"నేను చెప్పిన రీతిగనే జరిగినది. ఈ యూటదగ్గర చనిపోయిన సిపాయియొక్క దుస్తులను ఈమె ఉతికినపుడు కలరా పురుగులు (లేక అంకురములు) ఊటలోనున్న నీటిలో ప్రవేశించినవి. అందువలన ఆ నీటిని త్రాగినవారికి అందరకును కలరా వచ్చినది. రెండవ ప్రక్కనున్న ఊటలోని నీరు చెడియుండనందున ఆ నీటిని త్రాగుచున్నవారికి కలరా వచ్చియుండ లేదు".

అటుతరువాత వైద్యశాస్త్రజ్ఞుడును ప్రధానియును గ్రామాధికారిని వెంటబెట్టుకొని ఆమె బట్టలను ఉతికిన ఊటదగ్గరకుపోయిరి. పెర్మాంగనేట్ ఆఫ్ పొటాషుతో అందలి నీటిని పరిశుభ్రముచేయించిరి. ఇట్లు జరిపిన తరువాత ఆ గ్రామములోనున్నవారికి ఎవరికిని కలరా జాడ్యము కలుగ లేదు.

అచట వైద్యశాస్త్రజ్ఞుడును ప్రధానియును చాలదినములుండిరి. కలరా జాడ్యమువలన ఎవరికిని అటుపైని బాధ కలుగకపోవుట చూచి వైద్య శాస్త్రజ్ఞుడు ప్రధానితో ఇట్లనెను :—"ఇకముందు కలరా జాడ్యము ఎవ

రికిని కలుగుననుఅపాయము లేదు. ఆయూటనీటిలో మాత్రమే కలరాపురుగులు (లేక అంకురములు) ఉండెను. వాటిని 'పెంర్మాగనేట్ ఆఫ్ పొటాషుతో మనము నశింపచేసినాము. ప్రధానీ! కలరాజాడ్యమువలన పోయినవాని బట్టలను త్రాగెడు నీళ్లుండు స్థలములకు తీసికొనిపోగూడదన్న సంగతి ఇపుడు తెలిసినదా! కలరావచ్చిన మనుష్యుని బట్టలనుగాని దుస్తులనుగాని పరపుగుడ్డలనుగాని, అతడు ఉపయోగించిన భోజన పాత్రలనుగాని, ఇంకను అట్టివానిచేత ఉపయోగించబడినట్టి ఇతరవస్తువులనుగాని, అతని చెంతనుండు వస్తువులనైననుగాని మనుష్యులు త్రాగెడు పానీయ ద్రవ్యములవద్దకును తినెడు పదార్థముల చెంతకును రానీయకూడదు. ఈ గ్రామములో జరిగిన పని స్పష్టముగా తెలియుచున్నది. సిపాయి దేవిదాసుడు ఇక్కడికి వచ్చినవెంటనే కలరావలన చనిపోయినాడు. అతడు చేసికొనిన వాంతులలోను విరేచనములలోను కలరాపురుగులుండెను. అట్టి వాంతుల మూలమునను భేదులమూలమునను వెలుపడిన పదార్థములు వాని దుస్తులలో చేరినవి. అందువలన ఆ దుస్తులలో కలరా పురుగులును చేరినవి. అతని తల్లి వాని బట్టలను ఊటదగ్గర ఉతికినది. ఆ బట్టలలోనున్న పురుగులు (లేక అంకురములు) ఆయూటలోనున్న నీటిలో ప్రవేశించినవి. ఊటనీళ్లలో ఆ పురుగులు వేనవేలుగ వృద్ధిచెందినవి. ఆ సిపాయి దుస్తులను ఉతికిన దినముమొదలుకొని ఆ యూటలోని నీళ్లను 'పెర్మాంగనేట్ ఆఫ్ పొటాషు'తో మనము పరిశుభ్రముచేసినదినమువరకును ఆ నీటిని త్రాగినవారిలో అరువదినలుగురికి కలరా వ్యాధి వచ్చినది. అట్లు జబ్బుపడినవారిలో ముప్పదిఏడుగురు చనిపోయిరి."*
అటుతరువాత వైద్యశాస్త్రజ్ఞుడును ప్రధానియును రాజుతో ఈ సంగతులను విన్నవించుటకై పట్టణమునకు పోయిరి.

---

19 వ ప్రకరణము.

[కలరా రాకుండ తీసికొనవలసిన ముందుజాగ్రత్తలు. అది వచ్చినపుడు చేయవలసిన పనులు.]

వైద్యశాస్త్రజ్ఞుడు తిరిగి రాజుసముఖమునకువచ్చినతరువాత అ పట్టణమందును గ్రామమందును బయలుదేరిన కలరాను గురించిన వృత్తాంత

---

* కొన్ని సంవత్సరముల క్రిందట పైని చెప్పిబడిన రీతిగను అట్టి కారణములవలనలు అనగా త్రాగెడునీళ్లుగల ఊటదగ్గర కలరా జాడ్యమువచ్చినవాని గుడ్డలను ఉతుకుటచేతను కలరా జాడ్యము కాంగ్రాలోయలోని బాజీనాడ్ దగ్గరనున్న గ్రామములో బయలుదేరినది.

మును రాజుతో మనవిచేసెను. అప్పుడు రాజు ఇట్లుపలికెను :— 'వైద్యశాస్త్రజ్ఞుడా! కలరావలన హానిగలుగకుండ పట్టణమందున్నవారు గాని గ్రామమందున్నవారుగాని ఏమిచేయవలయునో చెప్పుము."

వైద్యశాస్త్రజ్ఞుడు ఇట్లు చెప్పెను :—"గ్రామములోగాని పట్టణములోగాని జనులు నీళ్ల విరేచనములచే బాధపడుచున్నపుడు కలరా శీఘ్రముగా వ్యాపించును. అట్టి విరేచనములవలన వారు బాధపడుచుండనపుడు కలరా అంతత్వరగా వారిలో వ్యాపించనేరదు. నీళ్ళ విరేచనములకు అనుకూలమైనవి అన్నియును కలరా వ్యాపించుటకు కూడ అనుకూలముగానుండును".

రాజు ఇట్లు పలికెను:—"నీళ్ళ విరేచనములుకలుగుటకు అనుకూలమైనవి ఎవ్వి?".

వైద్యశాస్త్రజ్ఞుడు ఇట్లుపలికెను :—"అపరిశుభ్రమైన నీరు, చెడినటువంటియు బాగుగా పండనటువంటియు పండ్లు, మురికి, ఈగలు ఇవి నీళ్ల విరేచనములకు అనుకూలముగానుండును. ఇవి ఉన్నపుడు జనులకు నీళ్ల విరేచనములు పుట్టును. అట్టి విరేచనములున్న కాలములో కలరా ఒకసారి ప్రవేశించినయెడల అది అతి శీఘ్రముగా వ్యాపించును. అట్లుగాక గ్రామములలో పరిశుభ్రమైన మంచి నీళ్ల నూతులున్నపుడును, చక్కగా పండనటువంటియు చెడిపోయినటువంటియు పండ్లు అమ్మబడనపుడును, మురికి ఈగలు మొదలగునవి ఎన్నడును చేరకుండ ఇండ్లును వీథులును పరిశుభ్రముగానుంచబడినపుడును, అచ్చటనుండువారికి నీళ్ళ విరేచనములుకలుగవు. అందువలన కలరాకూడ ఆ గ్రామములలో వ్యాపించనేరదు. అన్ని కాలములయందును అన్ని స్థలములయందును ఈ సంగతులన్నియును చక్కగ ఆలోచింపబడి జాగ్రత్తపరచబడవలయును. కలరా వచ్చువరకును దీనినిగురించి ఉపేక్ష చేయరాదు".

రాజు ఇట్లుపలికెను :—"జనులకు కలరా రాకుండచేయవలెనంటే మొదట వారికి నీళ్ళ విరేచనములవలన బాధకలుగకుండ చేయవలెను".

వైద్యశాస్త్రజ్ఞుడిట్లుచెప్పెను :—"అవును. అటులనే చేయవలెను. ఇదియునుగాక ప్రస్తుతమునందైనను కలరా బయలుదేరనైయున్నపుడుగాని నిజముగ బయలుదేరినపుడుగాని అచ్చటనుండు నూతులను ఊటలను పరిశుభ్రపరచి వాటిలో ఏ విధమైన కల్మషమును చేరకుండునట్లు

జాగ్రత్తపడవలయును. కావున, ఏస్థలమందైనను కలరా బయలుదేరినపుడు అక్కడనుండు నూతులలో దేనియందైనను కలరా పురుగులు చేరుటకు వీలు ఉండవచ్చును. అట్టి నూతిని 'ఆ పెర్మాంగనేట్ ఆఫ్ పొటాషు'తో పరిశుద్ధముచేయవలెను. అగ్నితో పరిశుద్ధముచేయబడిన పాత్రలిచ్చి ప్రతినూతికిని ప్రతి ఊటకును ఇద్దరిద్దరు కాపున్న నీళ్ల మనుష్యులను ఉంచవలెను. అట్టి పాత్రలు తప్ప మరియొక పాత్ర నూతిలో దించబడకూడదు. ఆ నీళ్ల మనుష్యులు తప్ప మరియొకరు నీటిని తీయకూడదు. కలరా ఉన్నను లేకపోయినను మనుష్యులు త్రాగుటకు ఉపయోగించెడు ఊటల దగ్గరగాని, నూతుల దగ్గరగాని చెరువుల దగ్గరగాని బట్టలను ఉతకనీయరాదు. ఎట్టి ప్రవాహమునందైనను మనుష్యులు త్రాగుటకు నీరుతీసికొనుపోవు రేవునకుమీదుగా బట్టలను ఉతకనీయరాదు".

రాజు ఇట్లు పలికెను :—"జనులకు కలరా రాకుండజేయుటకు నూతులను ఊటలను పరిశుభ్రము చేసి అందలి నీటిని శుద్ధముగానుంచుట రెండవ మార్గమని నాకు తెలిసినది".

వైద్యశాస్త్రజ్ఞుడిట్లు పలికెను :—"అవును. అటులనే. కలరా పురుగులు (లేక అంకురములు) కలరా వచ్చినవారి వాంతుల మూలమునను భేదుల మూలమునను వెలువడు ద్రవ్యములలో నుండునను విషయము మరవరాదు. ఆ పురుగులు (లేక అంకురములు) నీటిలోగాని ఆహార పదార్థములలోగాని ప్రవేశించుట తటస్థించినయెడల అట్టి నీటిని త్రాగువారికిని ఆ పదార్థములను భుజించువారికిని కలరా వచ్చును. ఈ అంశము మూడవది. ఇదియును అంత ముఖ్యమైన అంశమే. కావున :—

(1) కలరావచ్చిన మనుష్యుని ఇతరులు భుజించునట్టి పదార్థముల దగ్గరను, వారు త్రాగెడు పానీయద్రవ్యముల దగ్గరను ఉండనీయరాదు.

(2) కలరా వచ్చిన మనుష్యుడుండు గదిలో ఎవరుగాని వంట చేసికొనకూడదు. ఎవరుగాని అచ్చట ఆహారమును భుజింపరాదు.

(3) కలరావలన బాధపడు మనుష్యుడు ఉపయోగించునటువంటి వానినిగాని ముట్టుకొను నటువంటివానినిగాని, వేయేల,? అట్టి రోగిచెంత నున్నటువంటి ఏ వస్తువునైననుగాని ఇతరులు త్రాగు నీటికి సమీపమునందును వారు తిను పదార్థముల దగ్గరను ఉంచరాదు.

(4) వంటకు ఉపయోగపడునటువంటియు మనుష్యులు త్రాగునటువంటియు నీరుగల ఊటలదగ్గరను, నూతులదగ్గరను, చెరువుల దగ్గరను ప్రవాహముల దగ్గరను కలరా వచ్చినవానియొక్క గుడ్డలను పరపులను ఉతకనీయరాదు.

(5) కలరావచ్చినవారికి ఉపచారము చేయువారు అన్నమును ముట్టుటకుగాని తినుటకుగాని ముందు తమ చేతులను పరిశుభ్రముగ కడుగుకొనవలెను.

(6) కలరావచ్చిన మనుష్యుడు వాంతులు చేసికొనినపుడును భేదులుచేసికొనినపుడును పైకివచ్చు ద్రవ్యములను సగమువరకు పొడిమన్నుతోను లేక కాల్చి ఆర్చిన సున్నముతోను నింపబడిన కుండలలో పెట్టి, కుండలతోకూడ వాటిని భూమిలో పాతిపెట్టించవలెను. వీటిని ఎన్నటికిని నీరుండు స్థలముల సమీపమున పాతిపెట్టించకూడదు.

(7) కలరా వచ్చినవానియొక్క పరపు, పరపు గుడ్డలు, దుస్తులు మొదలగువాటిని మంచి ఎండలో చాలదినములు ఆరబెట్టవలయును. సూర్యుని వేడిమిచేతను ప్రకాశముచేతను వాటిలో నుండు కలరాపురుగులన్నియును నశించును. కలరా వచ్చిన మనుష్యుడు చనిపోయినను సరే లేక రోగముకుదిరి బ్రతికియున్నను సరే, ఈ పనిమాత్రము చేయక తప్పదు ".

అప్పుడు రాజు ఇట్లు పలికెను :—" కలరావలన గ్రామమందుగాని పట్టణమందుగాని ఉండు జనులకు హాని కలుగకయుండుటకు మూడు మార్గములున్నవని నాకు తెలిసినది. ఆ మార్గము లెవ్వియనగా :—

మొదటిది—జనులకు నీళ్ల విరేచనములను పుట్టించగలవాని విషయమై శ్రద్ధపుచ్చుకొనుట.

రెండవది—అన్నినూతులను, ఊటలను, చెరువులను పరిశుభ్రము చేసి అందుండు నీటిని శుద్ధముగానుంచుట.

మూడవది—కలరావచ్చిన మనుష్యునివలన కలుగు పురుగులను భోజనపదార్థములకును త్రాగెడు నీటికిని వ్యాపించకుండునట్లు చేయుట ".

వైద్యశాస్త్రజ్ఞుడు ఇట్లు పలికెను :—" అన్ని సంగతులును తమకు చక్కగ తెలిసినవి ".

రాజు ఇట్లుపలికెను :—" మశూచకము టీకాలవలన ఆపబడగలదు. మన్యపు జ్వరము, బొబ్బరోగము, కలరా అను జాడ్యములనుకూడ మాన్పవచ్చునని నీవు నాకు తెప్పితివి. మశూచకము, మన్యపు జ్వరము, బొబ్బరోగము, కలరా అను ఈ మహావ్యాధులను నాల్గింటిని మాన్పవచ్చును. వైద్యశాస్త్రజ్ఞుడా! నాదేశమునందు జాడ్యములలో మాన్పదగినవి ఇంకను ఏ జాడ్యములైన ఉన్నయెడల నాకు జెప్పుము".

వైద్యశాస్త్రజ్ఞుడిట్లు పలికెను :—" మాన్పదగినవి ఇంకను అనేకములైన జాడ్యములు ఈ దేశమునందున్నవి. దేవరవారు తిరిగి మరియొక దినమున నన్ను పిలువనంపినయెడల మాన్పదగినటువంటి జాడ్యములలో కొన్నింటిని గురించి సంభాషించెదను".

20వ ప్రకరణము.

[రోతగానుండు వాడుకలు. ఆరోగ్యములేని కుక్కలవన కలుగు ఉపద్రవములు. ఉమ్మివేయుటవలన కలుగు అపాయములు. క్షయరోగము. క్షయరోగమును తప్పించుకొను విధము. మారికిపండనలన కలుగు హాని. క్షయరోగమునకు చికిత్స. క్షయరోగమును కుదర్చగల రెండు గొప్ప ఔషధములు. సమాప్తము.]

వైద్యశాస్త్రజ్ఞుడు తిరిగి రాజు సముఖమునకు వచ్చినపుడు రాజు వానితో ఇట్లనెను :—" మాన్పతగిన జాడ్యములను గురించి క్రిందటి రోజున ముచ్చటించితిమి. ఇంకను ఇట్టి విషయములనుగురించి చెప్పుము".

వైద్యశాస్త్రజ్ఞుడు ఇట్లు చెప్పెను :—" సిగ్గులేక ఎచ్చటనైనను శంకానివృత్తి చేసికొనుట ఈ దేశమందలి జనులలో అనేకులకు వాడుకగానున్నది. తమగుమ్మముదగ్గరనే తరుచుగా మనుష్యులు శంకానివృత్తి చేసికొందురు. ఈ విషయమును గురించి పిల్లలకు బోధించి వారిని సిగ్గుపడునట్లు చేయరు. ఈ విషయమునందు సిగ్గుపడవలసినదని తలిదండ్రులు పిల్లల కెందువలన చిన్నతనమందే నేర్పరు? నాగరికులైనవారిలో ఇట్టి అభ్యాసములు ఉండునా? ఇట్టి పనులు అనేక జాడ్యములను పుట్టించును. ఇట్టి విషయములందు అసహ్యము గలిగినవారు అనేకులు నాగరికులు ఈ దేశమందును గలరని నేను బాగుగా ఎరుగుదును. ఇట్టి రోత పనులను చూచినవెంటనే వాటిని మాన్పుటకై వారు ఎల్లపుడును తమ శక్తిని ఉపయోగించి ప్రయత్నపడవలయును. ప్రతి గ్రామము చుట్టును పొలము లనేకములుండును. జనులు ఆ పొలములలో శంకానివృత్తిని

చేసికొనుటకై పోవలయును. శంకానివృత్తికి పోయినపుడు జనులు అశుద్ధమును కొంత మట్టితో కప్పివేయుచుండవలెను. అశుద్ధముపైని ఉన్నటువంటి ఈగలు తిరిగి ఒకడు భుజించెడు ఆహారముపైని వ్రాలుట అసహ్యకరముగాను అపాయకరముగాను కూడ ఉండును."

"నీవు నిజమును చెప్పినావు. బడులలో వీనిని గురించి నా ప్రజలకు నేర్పవలయును" అని రాజు పలికెను.

వైద్యశాస్త్రజ్ఞుడు ఇట్లు పలికెను :—"మరియు గ్రామములో గుంపులుగుంపులుగా తిరుగుచుండు కుక్కలను చూడుడు. అవి ఆహారము లేక ఎండిపోయి గజ్జితోను కొఱుజులతోను నిండియుండును. వాటిని బ్రతుకనిచ్చుట భూతదయకాదు. వాటికి తరుచుగా పిచ్చిపట్టును. అపుడు అవి పశువులను మనుష్యులను కరచి ఎక్కువ హానిని కలుగజేయును."

"అవును. నిజమె. అట్టి కుక్కలను నాశనముచేయవలెను" అని రాజు పలికెను.

"జాడ్యములకు కారణమైన మరియొక దురభ్యాసము కలదు. అది ఏమనగా—ఎప్పుడును ఉమ్మివేయుచుండుట" అని వైద్యశాస్త్రజ్ఞుడు పలికెను.

"ఉమ్మివేయుటవలన కలుగు జాడ్యమేది?" అని రాజు అడిగెను.

"తరుచుగా ఉమ్మివేయువారు పురుగులను వ్యాపింపజేయుదురు. ఆ పురుగులు మనుష్యుని ఊపిరితిత్తులలోనికి పోయి భయంకరమగు క్షయవ్యాధిని పుట్టించును" అని వైద్యశాస్త్రజ్ఞుడు చెప్పెను.

"నా దేశములోని పెద్ద పట్టణములలో నుండువారిలో క్షయవ్యాధి చాల వ్యాపించియున్నది!" అని రాజు చెప్పెను.

వైద్యశాస్త్రజ్ఞుడు ఇట్లు చెప్పెను :—"అట్లుండును. అందులకు కారణము ఇది. పెద్దపట్టణములలో అనేకులు క్రిక్కిరిసిన చీకటి ఇండ్లలోను మురికి ఇండ్లలోను నివసించుచుందురు. వాటిలోపలికి పరిశుభ్రమైన గాలి చొరనేచొరదు. అట్టి ఇండ్లలో నుండువారిలో అనేకులు బయటికి అనగా సూర్యరశ్మియును పరిశుభ్రమైన గాలియును ఉండు చోట్లకు తరుచుగా వెళ్లరు. అట్టివారు పాలిపోయిన వర్ణముగలవారుగను, బలహీనులుగను, జబ్బుగలవారుగను ఉందురు. వారు క్షయ

వ్యాధికి సంబంధించిన పురుగులను లోపలికి పీల్చినవెంటనే వారికి దుష్టమైన దగ్గుకలిగి ఉమ్మితో రక్తము పడును. వారును క్రమక్రమముగ బలహీనులై చిక్కిపోయి కొన్ని నెలలలోనే చచ్చిపోవుదురు ".

"క్షయవ్యాధికి కారణమేమి" అని రాజు అడిగెను.

వైద్యశాస్త్రజ్ఞుడు ఇట్లుపలికెను :—" చెదలుపట్టి కఱ్ఱను ఎట్లు తినివేయునో అటులనే కొన్ని పురుగులు మనుష్యుని ఊపిరి తిత్తులలో ప్రవేశించి వాటిని తినివేయును. ఇట్టి పురుగులచేతనే ఈ క్షయవ్యాధి కలుగుచున్నది క్షయవ్యాధి గలవాడు దగ్గినపుడు పయికివచ్చు ద్రవ్యములు ఈ పురుగులతో నిండియుండును. అట్టి మనుష్యుడు అన్నిచోట్లను ఉమ్మివేయునపుడు పయికివచ్చు ద్రవ్యములు అచ్చటచ్చటనే ఎండిపోవును. అందలి పురుగులు ధూళిరేగినట్లు నాలుగు వైపులకును పోవును. ఇట్టి పురుగులను పీల్చువారికి క్షయవ్యాధి వచ్చుచున్నది. ఇందువలన క్షయవ్యాధిగలిగిన మనుష్యులు నివసించునటువంటియు నిద్రించునటువంటియు గదిలో ఇతరులు ఉండుటవలన వారికి చాల హాని కలుగుచుండును".

"క్షయవ్యాధిని మాన్పవచ్చునా?" అని రాజు అడిగెను.

వైద్యశాస్త్రజ్ఞుడు ఇట్లుచెప్పెను :—"పొడిగాను పరిశుభ్రముగాను ఉండు ఇండ్లలో నివసించువారికి తగినంత మంచిగాలియును సూర్యరశ్మియును తగులుచుండును గాన తరుచుగా క్షయవ్యాధి రానేరదు. చీకటిగానుండుట, మురికిగానుండుట, ఇండ్లు క్రిక్కిరిసియుండుట, ఉమ్మివేయుట ఇవి క్షయవ్యాధికి అనుకూలమైనవిగా నున్నవి. సూర్యరశ్మియును పరిశుభ్రమైన గాలియును అన్నిరోగములకును శత్రువులే కాని వాటిలో ముఖ్యముగా క్షయవ్యాధికి శత్రువులుగా నున్నవి".

"క్షయవ్యాధికి అనుకూలమైనవి ఇంకేమయినను గలవా?" అని రాజు అడిగెను.

వైద్యశాస్త్రజ్ఞుడు ఇట్లుపలికెను :—"మురికిగానుండు పండ్లు ఈ వ్యాధికి అనుకూలమైనవిగా నున్నవి. ఏ మనుష్యునియొక్క పండ్లైనను మురికిగా నున్నపుడు, పురుగులు వాటిమీద పెరిగి క్రమముగా క్రిందికి ఊపిరితిత్తులలోనికి దిగును. కావున, పండ్లను ఉదయమునను రాత్రియందును కఱ్ఱపీచుతో పరిశుభ్రముగ తోముకొనవలయును".

"క్షయవ్యాధి కుదురునా?" అని రాజు అడిగెను.

"క్షయరోగము ఎక్కువగా ముదిరియుండనపుడు దానిని కుదర్చ గల ఔషధములు రెండుగలవు. కాని వాటిని చాల పెద్ద మోతాదులుగా తీసికొనవలయును" అని వైద్యశాస్త్రజ్ఞుడు పలికెను.

"అయితే బీదవానికి ఈవ్యాధి కుదురునను ఆశ ఉండదు. అంత మట్టుకు ఔషధములను కొనుటకు వానికికావలసిన ధనముండదు" అని రాజు పలికెను.

"క్షయవ్యాధికి కావలసిన రెండు ఔషధములును ఖరీదుగలవి కావు" అని వైద్యశాస్త్రజ్ఞుడు పలికెను.

"క్షయవ్యాధిని కుదర్చగల ఆ ఔషధము లేమైయుండునో చెప్పుము. వాటిని ఎక్కువగా కొని నా దేశములోనుండు అన్ని ఆసుపత్రులకును పంపించెదను" అని రాజు పలికెను.

"క్షయజాడ్యమును కుదుర్చునట్టి రెండు ఔషధములును ఖరీదునకు దొరకవు. వాటిని మోసికొనుపోవుటకుకూడ వీలులేదు. అవి ఎచ్చట నుండునో అక్కడనే వాటిని శుద్ధముగా ఉపయోగించవలెను" అని వైద్యశాస్త్రజ్ఞుడు పలికెను.

"అయ్యయ్యో! బీదవాండ్రకు ఈ మందులు ఎట్లు దొరకును?" అని రాజు చెప్పెను.

వైద్యశాస్త్రజ్ఞుడు ఇట్లుపలికెను:—"రాజా! భయమువడకుము. ఇందువలన బీదవాండ్రకు ఏమియును హాని కలుగనేరదు. క్షయవ్యాధిని కుదర్చగల ఔషధములు రెండును సూర్యరశ్మి, పరిశుభ్రమైనగాలి, అనునవిగానున్నవి. ఈ వ్యాధివలన బాధపడుచుండువారు దట్టముగా దుస్తులను ధరించి, ఏ ఋతువైనను సరే, వారు రేయింబగళ్లు గాలిలోనే తమకాలమును గడపవలెను. పగటి సమయమునందు బయటగాని చెట్టునీడనుగాని వారు పరుండవలెను. రాత్రులయందు ఇంటికప్పుమీదనో లేక వానగాని మంచుగాని కురియుచున్నయెడల వెల్లడిగానుండు పంచపాళీలోనో, వారు పరుండవలెను. వేరు ఔషధములతో అంతగా వారికి పనిలేదు. సూర్యరశ్మియును పరిశుభ్రమైన గాలియును చక్కగా పనిచేసి క్షయరోగమును కుదుర్చును. ఈ ప్రకారము చేసినయెడల అనేకులు రోగముకుదిరి చక్కగా నుందురు. అట్టివారే చీకటిగదులలో నుండినయెడల తప్పక చనిపోవుదురు."

రాజు ఇట్లు పలికెను :—"హెచ్చు తగ్గులుగల ఈ ప్రపంచము నందు కొందరు ధనికులుగాను కొందరు బీదవారుగాను పుట్టుదురు. సృష్టికర్తయగు మహేశ్వరుడు ఎంతధనము చేతనయినను సంపాదించ గాని అనేకవస్తువులను బీదవాండ్రకు అత్యధికముగా ఇచ్చి ఉన్నాడు".

"రాజా! నేను ఈదేశమునకు వచ్చినది మొదలు తమతో మనవి చేసిన సంగతులనుగురించి తాము దూరముగ ఆలోచించినయెడల, జాడ్య ములనుండి తప్పించుకొనుట ధనవంతునికి ఎంతసులభమో బీదవానికిని అంత సులభముగానే ఉన్నదని మీకు తెలియగలదు" అని వైద్యశాస్త్రి జ్ఞుడు చెప్పెను.

"నీవు చెప్పిన విషయము లన్నిటియందును ఉన్న సత్యముయొక్క మహిమ నాకిప్పుడు తెలిసినది" అని రాజు చెప్పెను.

అపుడు వైద్యశాస్త్రజ్ఞుడు రాజువద్ద సెలవుతీసికొని ఇట్లు పలి కెను :—"మీప్రజల బిడ్డలును, మనుమలును, ఈ విషయములలో నున్న సత్యమును గ్రహించి వాటిప్రకారము వారి ఇండ్లను ప్రవర్తనములను శుద్ధపరచుకొనునట్లు మీదేశపు బడులలో ఈ సంగతులను నేర్పవల యును".

"అట్లు జరిగినయెడల దేశమంతటను వారే చక్కనిమార్పులను చేసికొందురు. ఇట్టి లాభములను పొందుటకు ధనము అగత్యములేదు. దేశము నెమ్మది గలిగి క్షేమముగా నుండునంత కాలమును పట్టుదలతో పనిచేసినయెడల ఇట్టి మార్పులు జరుగగలవు."

"హిందూదేశమునకు చక్రవర్తియగు శ్రీ పంచమ జార్జి సార్వభౌముని ధర్మరక్షణము క్రిందనే ఈదేశము నిశ్చలమయిన శాంతిని అను భవించుచున్నది. వారియొక్క బలవత్తరమగు యుద్ధనావలసంఘము లే ప్రపంచము అంతయును శాంతి గలిగియుండునట్లు చేయుచున్నవి. అన్నిటికంటెను ఈ సంగతులను ముఖ్యముగ జ్ఞప్తికి తెచ్చుకొనుచుండ వలెను".

"ఏ ప్రభువు తన హిందూదేశపు ప్రజలందరచేతను ప్రేమించ బడెనో, ఎవనిమరణమునకు అందరును తల్లడిల్లియుండిరో, అట్టి సార్వ భౌముడును కీర్తిశేషుడును అగు సప్తమ ఎడ్వర్డు చక్రవర్తి మీదేశ ములో ఘోరమగు బొబ్బరోగము బయలుదేరి పలువిధముల జనులు బాధ పడుచున్నపుడు వారికి తన అనురాగమును కనుపరచుచు ఉత్సాహమును

కలుగచేయుటకై ఒకసందేశమును పంపియున్నాడు. అందలి మాటలు ఇప్పటికిని చక్కగా అందరకును జ్ఞాపకమున్నవి."

"ఇన్నిబాధలను పడుచున్న మీ ప్రజలవిషయమునందు శ్రీరాజ-చక్రవర్తిగారి హృదయము పరితపించుచున్నది. తమ సంరక్షణముక్రింద భయములేనివారై శాంతిని అనుభవించుచు మీ ప్రజలు అందరును తగిన విద్యచేతను వివేకముగల బోధనముచేతను అభివృద్ధి చెందవలయుననియును, కాలక్రమమున వారిక్షేమమును భాగ్యమును అభివృద్ధిని, పెంపుజేయునట్టి విషయములనుగురించిన జ్ఞానము వారికి కలుగవలయుననియును వారు కోరుచున్నారు."

"హిందూదేశమునందుండెడి ప్రజలకు ఇపుడు వారికి ఎక్కువ హానిచేయుచున్న జాడ్యము లన్నిటినిగురించిన జ్ఞానము తెలిసినపుడు, వాటినుండి సంరక్షించుకొను మార్గము చాలవరకు వారికి స్వాధీనమే అను మహాసత్యము తేట తెల్లమగును."

"సుఖమగు గాక."

మనసు ఫౌండేషన్

పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	TRLA 109 B 118
పుస్తకం పేరు	[illegible]
తారీఖు	25/10/24
ముందు అట్ట	NO
వెనుక అట్ట	NO
మొత్తం పేజీలు	101
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	CI, II, BCI, VI, X
లేని పేజీలు	NO
తయారు చేసినది	akshaya
పేజీలు విడదీసినది	Ahasen
స్కాన్ చేసినది	K Daveed
పరీక్ష చేసినది	ROHITH
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	NO
స్కాన్ చెయ్యబడి	good.